ప్రజా కలం
Digital Editions
http://prajakalam.com
epaper.prajakalam.com
paperboy.com
www.magzter.com

epaper.prajakalam.in
www.prajakalam.in

ప్రజా కలం

Published From Nizamabad

PRAJA KALAM Telugu Daily తెలుగు దినపత్రిక

PRGI No.TELTEL/2010/33275

ప్రజా కలం
PRAJA KALAM Telugu Daily
Classifieds
5 Lines Rs.250 only
&
Public Notice Advertising
క్లాసిఫైడ్స్ సంప్రదించండి
9010972526

శనివారం | 31-10- 2026 | సంపుటి: 17, సంచిక: 210, నిజామాబాద్, పేజీలు: 12, వెల: 3/- | ఎడిటర్: కలకొండ రామకృష్ణ



దేశం సంక్షోభంలో ఉంటే

విపక్షాలకు సంతోషం

నా ప్రతిష్ఠ దిగజార్చడమే లక్ష్యంగా దేశంలో గందరగోళానికి ప్రయత్నాలు

చివరి శ్వాస వరకు దేశ సేవలోనే మోదీ

న్యూఢిల్లీ, అక్టోబరు 30: దేశం సంక్షోభంలో ఉంటే విపక్షాలు సంతోషిస్తాయంటూ ప్రధాని మోదీ మండిపడ్డారు. గుజరాత్‌లోని బనస్కాంత జిల్లా భిల్డీ పట్టణంలో జరిగిన కార్యక్రమంలో

తరువాయి 2వ పేజీలో...

హైస్పీడ్ రైళ్ల మార్గాల పనులు

వేగవంతం చేయండి



నూతన రైలు మార్గాల మంజూరుకు అనుమతులు ఇవ్వండి

అనంతారంలో మెగా ఫ్లైట్ మెయింటెనెన్స్ డిపో ఏర్పాటు చేయండి

రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వినతి

ఢిల్లీ: తెలంగాణకు ప్రకటించిన హైస్పీడ్ రైళ్ల పనులు వేగవంతం చేయాలని రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్ – పుణె, హైదరాబాద్ – బెంగళూరు, హైదరాబాద్ – చెన్నై కారిడార్లకు సంబంధించి, కేంద్ర ప్రభుత్వం పంపిన ప్రతిపాదనలపై రాష్ట్ర ప్రభుత్వం సమీక్షించి, కొన్ని మార్పులను సూచిస్తూ కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిందని సీఎం తెలిపారు. ఈ మూడు కారిడార్లకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ఎటువంటి భూ సేకరణ ప్రక్రియను ప్రారంభించలేదని కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అలైన్‌మెంట్ ఆమోదించిన తర్వాత

తరువాయి 2వ పేజీలో...

అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు

- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- రాష్ట్రంలో 8 లక్షల ఇందిరమ్మ ఇళ్లకు 40 వేల కోట్ల రూపాయల ఖర్చు
- రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పట్టాల పంపిణీ చేసిన మంత్రి.



పాలేరు అక్టోబర్ 30(ప్రజా కలం న్యూస్)

రాష్ట్రంలో అర్హులైన ప్రతి పేదవారికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. శుక్రవారం మంత్రి, జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తో కలిసి ఏదులాపురం మునిసిపాలిటీ పరిధిలోని వీవిఆర్ గార్డెన్స్ లో ఏదులాపురం మునిసిపాలిటీ లోని 176 మంది లబ్ధిదారులకు రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ప్రజా ప్రభుత్వం వచ్చిన తర్వాత పేదవారి ఒక స్లాబ్ ఇళ్లలో ఉండాలనే కల, ఆశ ఏదైతే ఉందో అది నెరవేర్చాలనే తపనతో ప్రజా ప్రభుత్వం కృషి చేస్తున్నదని తెలిపారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మొదటి విడతలో 4.5 లక్షల ఇళ్లు, రెండో విడతలో 2.5 లక్షల ఇళ్లు ఇవ్వడం జరిగిందని, హైదరాబాద్ క్యూర్ ప్రాంతంలో మరో లక్ష ఇళ్లు, ఇవన్నీ కలిపి ఈ రెండు విడతల్లో రాష్ట్రవ్యాప్తంగా 8 లక్షల ఇళ్లు 40 వేల కోట్ల రూపాయలతో

తరువాయి 2వ పేజీలో...

మూడు బొమ్మల మేడిపల్లిలో

‘గుంటల’ దందాపై చర్చ!

పంచాయతీ అనుమతులు లేకుండానే భూముల విక్రయాలా?

లేఅవుట్ నిబంధనలు పాటిస్తున్నారా?

పార్కులు, రహదారుల కేటాయింపుపై నీలినీడలు

కొనుగోలుదారుల ప్రయోజనాల కోసం అధికారుల విచారణ తప్పనిసరి



మెట్‌పల్లి రూరల్ , అక్టోబర్ 30:(ప్రజా కలం);మెట్‌పల్లి మండలంలోని మూడు బొమ్మల మేడిపల్లి గ్రామంలో వ్యవసాయ భూములను ‘గుంటల’ లెక్కన విభజించి విక్రయిస్తున్నారనే ప్రచారం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. ఈ భూముల విభజన, విక్రయాలకు సంబంధించి గ్రామ పంచాయతీ అనుమతులు తీసుకున్నారా? లేఅవుట్ నిబంధనలు పాటిస్తున్నారా? అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. అనుమతులకు సంబంధించి స్పష్టత లేకపోవడంతో కొనుగోలుదారుల్లోనూ ఆందోళన నెలకొంటోంది.

అనుమతులపై స్పష్టత ఏది?

వ్యవసాయ భూములను ప్లాట్లుగా విభజించి విక్రయించే ప్రక్రియలో వర్తించే నిబంధనల ప్రకారం అవసరమైన అనుమతులు పొందాల్సి ఉంటుంది. అయితే, మూడు బొమ్మల మేడిపల్లిలో జరుగుతున్న భూముల విక్రయాలకు సంబంధించి గ్రామ పంచాయతీ అనుమతులు తీసుకోలేదనే సమాచారం

తరువాయి 2వ పేజీలో...

క్రీడాకారులకు అండగా ప్రజా ప్రభుత్వం

ప్రభుత్వ విప్ చింతకుంట విజయరమణారావు

అండర్-17 వాలీబాల్ టోర్నమెంట్ ప్రారంభం

తెలంగాణ పబ్లిక్ స్కూల్‌కు రూ.8 కోట్లు మంజూరు


కాలేజీ మైదానంలో రూ.1.40 కోట్ల పనులను పరిశీలించిన ఎమ్మెల్యే

సుల్తానాబాద్,అక్టోబర్ 30:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి) క్రీడారంగం అభివృద్ధికి,క్రీడాకారుల సంక్షేమానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని రాష్ట్ర ప్రభుత్వ

తరువాయి 2వ పేజీలో...



కలం కౌంటర్



ఉమ్మడి పాలమూరు జిల్లాను కరువు ప్రాంతంగా ప్రకటించాలి

- ప్రజలను పీడించే ప్రభుత్వంగా కాంగ్రెస్ ప్రభుత్వం మారిందా
- కేసీఆర్ పాలనలో రైతులకు అండగా నిలిచాం..
- మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్



కలిసి ఎదుగుదాం



INVEST TELANGANA GLOBAL SUMMIT 2026
7 | 8 | 9 డిసెంబర్ 2026
భారత్ ఫ్యూచర్ సిటీ, హైదరాబాద్

తెలంగాణ ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక కార్యక్రమమైన ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ 2026 ఈసారి మరింత భారీ స్థాయిలో నిర్వహించబడుతోంది. ఈ సదస్సు ద్వారా ప్రపంచవ్యాప్తంగా ఉన్న పరిశ్రమల ప్రముఖులు, పెట్టుబడిదారులు, ఆవిష్కర్తలు, విధాన నిర్ణేతలు ఒకే వేదిక పైకి రానున్నారు.

ఈ సమ్మిట్ రక్ష ఎక్స్‌పో (Raksha Expo), క్లైమేట్ చేంజ్ కాన్క్లేవ్ ఇండియాజాయ్ (IndiaJoy), స్టార్టప్ షోకేస్, ప్రొడక్ట్ ఎగ్జిబిషన్లు, పాలసీ కాన్క్లేవ్, ఫైర్‌సైడ్ సెషన్లు మరియు తెలంగాణ సంస్కృతి, వారసత్వం మరియు వంటకాలకు సంబంధించిన కార్యక్రమాలను ఒకే గొడుగు కిందకు తెస్తుంది.

RAKSHA EXPO 2026
CLIMATE CHANGE CONCLAVE
indiajoy 2026
START UP SHOWCASE

Product Exhibitions
Policy Conclave
Fireside Sessions
Telangana Culture, Heritage and Food

invest.telangana.gov.in

జారీ చేసినవారు: సమాచార, పౌర సంబంధాల శాఖ, తెలంగాణ ప్రభుత్వం.

హైస్పీడ్ రైళ్ల మార్గాల పనులు

వేగవంతం చేయండి

మొదటి పేజీ తరువాయి...

భూ సేకరణను ప్రారంభిస్తామని సీఎం స్పష్టం చేశారు. సాధ్యమైనంత త్వరగా అలైన్‌మెంట్ ప్రక్రియను పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఢిల్లీ రైలు భవన్‌లో రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో ముఖ్యమంత్రి శుక్రవారం సాయంత్రం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణ అభివృద్ధికి అవసరమైన కీలక రైలు ప్రాజెక్టులపై కేంద్ర మంత్రితో సీఎం చర్చించారు. వికారాబాద్ – కృష్ణా కొత్త రైలు మార్గాన్ని (130 కి.మీ.) వెంటనే మంజూరు చేయాలని సీఎం కోరారు. వికారాబాద్ జిల్లా టేకల్‌కోడ్ పరిసరాల్లో భారీ సున్నపురాయి నిక్షేపాలు బయటపడ్డాయని, దీంతో ఈ ప్రాంతాన్ని సిమెంట్, టెక్స్‌టైల్ హబ్‌గా మార్చేందుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసిందని కేంద్ర మంత్రికి తెలియజేశారు. హైదరాబాద్ చుట్టూ సుమారు 360 కి.మీ మేర నిర్మిస్తున్న రీజినల్ రింగ్ రోడ్డు పక్కనే రీజినల్ రింగ్ రైలును అలైన్‌మెంట్ చేయాలని కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను సీఎం కోరారు. రీజినల్ రింగు రైలుతో పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. డోర్నకల్–గద్వాల్, కల్వకుర్తి – మాచర్ల, కాచిగూడ కాచిగూడ –జగ్గయ్యపేట (250 కి.మీ.), పటాన్‌చెరు – ఆదిలాబాద్ (320 కి.మీ.), బోధన్ – లాతూర్ (175 కి.మీ.), అక్కన్నపేట బైపాస్ లైన్ (8 కి.మీ.) మార్గాలను వెంటనే మంజూరు చేయాలని రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు. దక్షిణ మధ్య రైల్వే ప్రతిష్టాత్మకంగా చేపట్టదలచిన మెగా కోచింగ్, ఫ్లైట్ మెయింటెనెన్స్ డిపోను మహబూబాబాద్ సమీప అనంతారం గ్రామంలో ఏర్పాటు చేయాలని కేంద్ర మంత్రి కోరారు. ఈ డిపో ఏర్పాటుకు అవసరమైన 409 ఎకరాల 1 గుంట భూమిని రైల్వే శాఖకు అప్పగించేందుకు ఇప్పటికే అంగీకరించిన విషయాన్ని ముఖ్యమంత్రి కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.

మెగా ఫ్లైట్ మెయింటెనెన్స్ డిపోకు త్వరగా అనుమతులు మంజూరు చేయాలని కేంద్ర మంత్రిని సీఎం కోరారు.

ఈ సమావేశంలో రాష్ట్ర మంత్రి వివేక్ వెంకటస్వామి, ఎంపీలు డాక్టర్ మల్లు రవి, వేం నరేందర్ రెడ్డి, చామల కిరణ్ కుమార్ రెడ్డి, బలరాం నాయక్, గడ్డం వంశీకృష్ణ, అనిల్ కుమార్ యాదవ్, రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, హెచ్‌ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్ అద్వైత్ కుమార్ సింగ్ పాల్గొన్నారు.

రాష్ట్రంలో ఏదులాపురం మునిసిపాలిటీని

రోల్ మోడల్ గా తీర్చిదిద్దుతాం

- రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

- ఏదులాపురం మున్సిపాలిటీలో అభివృద్ధి పనుల శంకుస్థాపన చేసిన మంత్రి



పాలేరు అక్టోబర్ 30(ప్రజా కలం న్యూస్)

ఏదులాపురం మున్సిపాలిటీని రాష్ట్రంలోనే రోల్ మోడల్ గా తీర్చిదిద్దుతామని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. శుక్రవారం మంత్రి, జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తో కలిసి ఏదులాపురం మున్సిపాలిటీలో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. ఇందులో భాగంగా ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని 6 వ వార్డు సింగరేణి కాలనీ వద్ద రూ. 496 లక్షల అంచనా వ్యయంతో 46 అంతర్గత సి.సి. రోడ్ల నిర్మాణ పనులకు, రూ. 250 లక్షల అంచనా వ్యయంతో ప్రకాశ్ నగర్ బ్రిడ్జి నుండి కోదాడ ఆర్ అండ్ బి రోడ్డు వయా కోటనారాయణపురం ఇందిరమ్మ కాలనీ వరకు బీటీ రోడ్డు నిర్మాణ పనులకు మంత్రి శంకుస్థాపనలు చేశారు. ఈ రోడ్లతో సాయి ప్రభాత్ నగర్ వన్ అండ్ టూ, టెంపుల్ సిటీ, అభయ టౌన్‌షిప్, సింగరేణి కాలనీ, గుర్రాలపాడు తండా, ఇందిరమ్మ కాలనీ, కోట నారాయణపురం, సూర్యా నగర్, చంద్ర నగర్, చిన్న తండా, కె.ఎల్.ఆర్. నగర్, బృందావనం, గోకుల కృష్ణ నగర్, తాశిల్లీ తండా, లక్ష్మీ గాయత్రి నగర్, నందన వనం, ఏదులాపురం, ఆదిత్య టౌన్‌షిప్, గుర్రాలపాడు ఆర్.టి.సి. కాలనీ, శ్రీవారి నగర్, సత్య సంకల్ప కాలనీ, షాబాద్ మాసరెడ్డి నగర్, వరంగల్ క్రాస్ రోడ్, కోదాడ క్రాస్ రోడ్ తదితర ప్రాంతాల ప్రజలందరూ నిరంతరం రాకపోకలు సాగిస్తారు. ఈ నందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ప్రజాప్రభుత్వం వచ్చిన తర్వాత 6, 7, 8 డివిజన్లలో వివిధ అభివృద్ధి కార్యక్రమాల కోసం రూ. 79 కోట్ల 79 లక్షల రూపాయలతో శంకుస్థాపనలు చేసుకున్నామని, కొన్ని పూర్తయ్యాయని, మరికొన్ని వివిధ దశల్లో ఉన్నాయని తెలిపారు. ఏదులాపురం మున్సిపాలిటీని ఎన్నికల ముందు నుంచి కూడా అభివృద్ధి చేస్తూ, రాష్ట్రంలోనే ఒక రోల్ మోడల్ మున్సిపాలిటీగా తీసుకొస్తామని ఇచ్చిన మాటి ప్రకారం ఎన్నికల దగ్గర నుంచి ఇప్పటివరకు సుమారు రూ. 100 కోట్లకు పైగా నిధులు తీసుకొచ్చామని తెలిపారు. మున్సిపాలిటీలో 8 నుంచి 11 గ్రామ పంచాయతీలు కలిసి ఉన్నందున అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని, ఈ విశాలమైన మున్సిపాలిటీని తీర్చిదిద్దాలనే తపనతో ముఖ్యమంత్రి ఏది కాదనకుండా సహకరిస్తున్నారని అన్నారు. కేవలం రోడ్లు, డ్రైన్లే కాకుండా తాగునీరు సమస్యను, విద్యుత్ సమస్యలను హైటెన్షన్ లైన్ల తొలగింపు తదితరాలను పరిష్కరించామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా పేదవాళ్లకు అండదండగా ఉంటూ, భద్రత, భరోసా కల్పిస్తూ అనేక సంక్షేమ కార్యక్రమాలు అందిస్తున్నామని మంత్రి తెలిపారు. హౌఇందులో భాగంగానే 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ఆర్.టి.సి. బస్సులలో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం, కొత్త రేషన్ కార్డులు, పేదవాళ్ళు తినడానికి సన్నబియ్యం పంపిణీ కార్యక్రమం అమలు చేస్తున్నామని అన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేసే కార్యక్రమంలో భాగంగా గడిచిన 33 నెలల్లో రూ. 73 వేల కోట్లు సున్నా వడ్డీనిచ్చిన ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమని తెలిపారు. పేదోడి కల ఇందిరమ్మ ఇల్లు అన్నట్లుగా, పేదవాడు చనిపోయేలోపు సొంత స్థలంలో ఇల్లు కట్టుకోవాలనే కోరికను నెరవేర్చడానికి తెలంగాణ ప్రభుత్వం అప్పుల్లో ఉన్నప్పటికీ ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోందని తెలిపారు.హౌమొదటి విడత రాష్ట్రవ్యాప్తంగా 4.5 లక్షల ఇళ్లు, రెండో విడత 2.5 లక్షల ఇళ్లు, హైదరాబాదులో లక్ష ఇళ్లు, మొత్తంగా 8 లక్షల ఇళ్లకు 40 వేల కోట్ల రూపాయలు పేదింటి ఆడబిడ్డకు ఇల్లు కట్టుకోవడానికి ఇస్తున్నామని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరుకు కులం, మతం, పార్టీ అనకుండా కేవలం పేదవాడై ఉంటే చాలు అనే ఉద్దేశంతోనే ఈ కార్యక్రమం అమలు జరుగుతోందని మంత్రి స్పష్టం చేశారు. ఏదులాపురం మునిసిపాలిటీకి ఇప్పటికే రూ. 100 కోట్లు ఖర్చు పెట్టామని, రాబోయే రోజుల్లో మరో రూ. 100 నుండి 150 కోట్లు ఖర్చు పెట్టి ప్రతి డొంకను, ప్రతి రోడ్డును సిమెంట్ రోడ్డుగా మారుస్తామన్నారు. కార్యక్రమాల్లో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ, కేవలం వారం రోజుల్లోనే రూ. 30 కోట్ల విలువైన శంకుస్థాపనలు ఏదులాపురం మునిసిపాలిటీలో జరిగాయన్నారు. అభివృద్ధి పనులు అత్యంత వేగంగా కొనసాగుతున్నాయన్నారు.అన్ని ఏరియాలలోనూ ప్రజలకు మెరుగైన వసతులు కల్పించేలా సమగ్ర అభివృద్ధి జరుగుతోందని అన్నారు. మంత్రి ఆదేశాల మేరకు పనుల పూర్తికి ఇంజనీరింగ్ అధికారులను డెప్యుటేషన్ పై తెప్పించడం జరిగిందని, త్వరలోనే ఈ పనులన్నీ పూర్తిగా వేగవంతం చేసి పూర్తి చేస్తామని కలెక్టర్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ అండ్ బి ఎస్ఈ యుగంధర్ రావు, పీఆర్ ఎస్ఈ వెంకట్ రెడ్డి, ఏదులాపురం మునిసిపల్ చైర్ పర్సన్ పోకబత్తిని అనిత, వైస్ చైర్మన్ తమ్మినేని నవీన్, కౌన్సిలర్లు, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు

మొదటి పేజీ తరువాయి...

కట్టే కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం జరిగిందని అన్నారు.


ఇందిరమ్మ ఇండ్ల పథకం వంద శాతం పేదోళ్ల మనసును దోచిన, మెచ్చినదని, అర్హులైన ప్రతి పేదవాడికి కులం, మతం, పార్టీ అని చూడకుండా, పూర్తిగా పేదల సంక్షేమమే ధ్యేయంగా అమలు చేయబడుతోందని మంత్రి స్పష్టం చేశారు.హౌ

సుప్రీంకోర్టు లో మియాపూర్ కు సంబంధించి 560 ఎకరాల భూమి వివాదంలో ప్రయివేటు వ్యక్తులకు అప్పటి ప్రభుత్వం కట్టబెట్టాలని చూస్తే, అప్పుటి పార్లమెంట్ సభ్యుడిగా, ఇప్పుడు ముఖ్యమంత్రిగా ఉన్న రేవంత్ రెడ్డి సుప్రీంకోర్టులో న్యాయమైన వాదనలు పెట్టి ఆ కేసు గెలిచామని తెలిపారు.హౌ ప్రతి ఆడబిడ్డకు రూ. 5 లక్షల చొప్పున ఇందిరమ్మ ఇళ్లు కట్టిస్తామని తెలిపారు. ప్రతిపక్షాలు ఎన్ని గావు కేకలు పెట్టినా, ఎన్ని పొర్లు దండాలు పెట్టినా, ఎన్ని క్షుద్ర పూజలు చేసినా ప్రజా ప్రభుత్వం మళ్లీ ప్రజల దీవెనలతో అధికారంలోకి వస్తుందని మంత్రి అన్నారు.

కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ, ఏదులాపురం మునిసిపాలిటీ కి మొదటి విడతలో దాదాపు 467 ఇళ్లు మంజూరు కాగా, ఇందులో దాదాపు 400 వరకు ఇళ్లు నిర్మాణం పూర్తై లబ్ధదారులకు అందుబాటులోకి వచ్చాయన్నారు. మరో 45 ఇళ్లు మాత్రమే వివిధ దశలలో నిర్మాణంలో ఉన్నాయని, కొన్ని నెలల క్రితం శాంక్షన్ వచ్చిన 18 మంది లబ్ధదారులు కూడా వేగంగా ఇళ్ల నిర్మాణం చేపడుతున్నారని తెలిపారు. లబ్ధదారులకు ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు లేకుండా, అత్యంత పారదర్శకంగా ఎంపిక చేయడం జరిగిందని అన్నారు. ఇండ్ల నిర్మాణం స్టేజి పూర్తి కాగానే ఫోటోలు తీసుకుని, కేవలం వారం వది రోజుల్లోనే బిల్లులు చెల్లించడం వల్ల లబ్ధదారులు ఎంతో త్వరగా ఇళ్లను నిర్మించుకోగలిగారన్నారు.

మొదటి విడత విజయవంతమైన నేపథ్యంలో, ఇప్పుడు రెండో విడత కింద 176 ఇళ్లను లబ్ధదారులకు అందజేస్తున్నామని కలెక్టర్ తెలిపారు. ఈ రెండో విడత ఇళ్ల నిర్మాణాలను కూడా అతి త్వరగా పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో హౌజింగ్ పిడి భూక్యా శ్రీనివాస్, ఏదులాపురం మునిసిపల్ చైర్ పర్సన్ పోకబత్తిని అనిత, వైస్ చైర్మన్ తమ్మినేని నవీన్, మున్సిపల్ కమిషనర్ ఆళ్ల శ్రీనివాస రెడ్డి, కౌన్సిలర్లు, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

మూడు బొమ్మల మేడిపల్లిలో 'గుంటల' దందాపై చర్చ!



మొదటి పేజీ తరువాయి...

ప్రచారంలో ఉంది. ఈ నేపథ్యంలో సంబంధిత అధికారులు రికార్డులను పరిశీలించి వాస్తవాలను వెల్లడించాల్సిన అవసరం ఉంది.

పార్కులు, రహదారుల కేటాయింపుపై ప్రశ్నలు

లేఅవుట్ నిబంధనల ప్రకారం అవసరమైన రహదారులు, పార్కులు, ఇతర ప్రజా సదుపాయాల కేటాయింపు జరిగిందా? లేదా? అన్న అంశంపై స్పష్టత రావాల్సి ఉంది. భవిష్యత్తులో ఇళ్ల నిర్మాణాలు చేపట్టే కొనుగోలుదారులకు మౌలిక వసతుల సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

కొనుగోలుదారులు అప్రమత్తంగా ఉండాలి

భూములు కొనుగోలు చేసే వారు యాజమాన్య హక్కులు, భూమి వినియోగ స్వరూపం, వర్తించే లేఅవుట్ అనుమతులు, సంబంధిత ధ్రువపత్రాలను పరిశీలించుకున్న తర్వాతే నిర్ణయం తీసుకోవాలి. విక్రయదారుల మాటలపై మాత్రమే ఆధారపడకుండా అధికారిక రికార్డుల ద్వారా వివరాలను నిర్ధారించుకోవడం అవసరం.

అధికారుల మౌనం వీడేనా?

మూడు బొమ్మల మేడివల్లిలో భూముల విభజన, విక్రయాలపై సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి అనుమతుల స్థితిగతులను వెల్లడించాలి. నిబంధనల ఉల్లంఘనలు ఉన్నట్లు తేలితే చట్టప్రకారం చర్యలు తీసుకోవాలి. అనుమతులు ఉన్నాయా? లేవా? విక్రయిస్తున్న భూముల్లో నిబంధనల ప్రకారం ప్రజా సదుపాయాలకు స్థలం కేటాయించారా? కొనుగోలుదారుల ప్రయోజనాలను కాపాడేందుకు అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోనున్నారు? ఈ ప్రశ్నలకు అధికారుల సమాధానమే కీలకం.

బోగస్ ఫారం-7 దరఖాస్తులపై చర్యలు తీసుకోండి



న్యూఢిల్లీ, అక్టోబరు 30: సర్ ప్రక్రియలో భాగంగా ఓటరు జాబితా నుంచి పేర్లను తొలగించడానికి ఉద్దేశించిన ఫారం–7ను దుర్వినియోగం చేస్తూ పెద్ద ఎత్తున నకిలీ దరఖాస్తులను సమర్పిస్తుండటంపై సుప్రీంకోర్టు తీవ్రంగా స్పందించింది. ఈ వ్యవహారంపై విచారణ జరిపి తక్షణ దిద్దుబాటు చర్యలు చేపట్టాలని కేంద్ర ఎన్నికల సంఘాన్ని ఆదేశించింది. ఉత్తరప్రదేశ్‌లో పెద్ద ఎత్తున బోగస్ ఫారం–7 దరఖాస్తులు సమర్పిస్తున్నారంటూ.. సర్ ప్రక్రియను సవాల్ చేస్తూ కాంగ్రెస్ ఎంపీ తనూజ్ పునియా, సమాజ్‌వాదీ పార్టీ నేత అరవింద్ కుమార్ తదితరులు వేసిన పిటిషన్లపై సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ బాగ్చి, జస్టిస్ మోహనల ధర్మాసనం శుక్రవారం విచారణ జరిపింది. ఈ సందర్భంగా ఎన్నికల సంఘం తరఫు న్యాయవాదులు వాదనలు వినిపిస్తూ.. పెద్ద సంఖ్యలో ఫారం–7 దరఖాస్తులు దాఖలైనట్లు గుర్తించామని.. వాటిని క్షేత్రస్థాయిలో అధికారులు పరిశీలించి నకిలీవని తేల్చారని వెల్లడించారు. అయితే వాటి ఆధారంగా ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. అయితే ఒక నియోజకవర్గంలో ముస్లిం వర్గానికి చెందిన ఓటర్లను తొలగించడమే లక్ష్యంగా ఓ బీజేపీ నేత ఏకంగా 32 ఫారం–7 పత్రాలు సమర్పించారని ఆరోపణలున్నాయి. ఈ వ్యవహారాన్ని పిటిషనర్ల తరఫు న్యాయవాది కోర్టు దృష్టికి తెచ్చారు. ఇందులో 2 ఫారాలపై బీఎల్‌వోల సంతకాలు కూడా ఉన్నాయని తెలిపారు. యూపీలో సకాలంలో చర్యలు తీసుకోకపోవడం వల్లే తెలంగాణ, కర్ణాటకల్లోనూ ఇలాంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయన్నారు.

ఢిల్లీలో 47.56 లక్షల ఓటర్ల ఇంటింటి సర్వే..

ఢిల్లీలో తొలగించిన 47.56లక్షల ఓటర్ల అర్హతను పునఃపరిశీలించేందుకు ఇంటింటి సర్వేను ముమ్మరం చేయనున్నట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. సర్ ప్రక్రియ గడువును నవంబరు 25వరకు పొడిగిస్తున్నట్లు ఈసీ ప్రకటించిన ఒకరోజు తర్వాత వారు ఈ నిర్ణయం తీసుకున్నారు. నవంబరు 15, 22వ తేదీల్లో విద్యార్థులు, నిరాశ్రయులు, ట్రాన్స్‌జెండర్లు, సెక్స్ వర్కర్ల కోసం ప్రత్యేక శిబిరాలను నిర్వహించే అంశాన్ని పరిశీలిస్తున్నామని చెప్పారు.

క్రీడాకారులకు అండగా

ప్రజా ప్రభుత్వం

మొదటి పేజీ తరువాయి...

విప్,పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయ రమణారావు స్పష్టం చేశారు.పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో శుక్రవారం నిర్వహించిన 70వ ఎస్‌జీఎఫ్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా అండర్–17 బాలురు,బాలికల వాలీబాల్ టోర్నమెంట్ కమ్ సెలక్షన్స్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.టాస్ వేసి పోటీలను లాంఛనంగా ప్రారంభించిన అనంతరం ఆయన క్రీడాకారులను ఉత్సాహపరుస్తూ వారి ఆట తీరును తిలకించారు.అనంతరం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో రూ. 1.40 కోట్లతో నూతనంగా నిర్మిస్తున్న ఉన్నత పాఠశాల భవన తరగతి గదుల పనులను స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ చింతకుంట విజయరమణా రావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యారంగానికి అత్యున్నత ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు.నియోజకవర్గానికి ఒకటి చొప్పున సకల సౌకర్యాలతో తెలంగాణ పబ్లిక్ స్కూళ్లను ప్రభుత్వం ఏర్పాటు చేస్తోందని, పెద్దపల్లి నియోజకవర్గానికి మంజూరైన తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను సుల్తానాబాద్ పట్టణంలో రూ. 8 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్నట్లు వెల్లడించారు. జూన్ నెలాఖరు నాటికి ఈ ప్రక్రియ పూర్తి చేసి అందుబాటులోకి తెస్తామన్నారు.అలాగే పట్టణంలోని ప్రభుత్వ విద్యాసంస్థల్లో మౌలిక వసతుల కల్పన, అదనపు గదుల నిర్మాణం కోసం మరో రూ. 3 కోట్లు వెచ్చించనున్నట్లు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్,మార్కెట్ కమిటీ చైర్మన్,స్థానిక కౌన్సిలర్లు,సింగిల్ విండో చైర్మన్లు,వాలీబాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు,పీడీలు, పీఈటీలు,వివిధ శాఖల అధికారులు,ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు, క్రీడాకారులు పాల్గొన్నారు.

దేశం సంక్షోభంలో ఉంటే

విపక్షాలకు సంతోషం

మొదటి పేజీ తరువాయి...

ఆయన ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి పథకం కింద రైతుల ఖాతాల్లో నగదును జమ చేశారు. నవంబరు 1న ఢిల్లీ రామ్‌లీలా మైదానంలో విపక్షాలు తలపెట్టిన ధర్నా 'మోదీకా బాప్‌బీ జాయేగా (మోదీ తండ్రి కూడా వెళ్లాల్సిందే) అంటూ ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే ఇటీవల చేసిన వ్యాఖ్యలను ఉద్దేశించి ఆయన తీవ్రస్వరంతో విరుచుకుపడ్డారు. చివరి శ్వాస వరకు దేశ ప్రజలకు సేవ చేస్తానని స్పష్టం చేశారు. పశ్చిమాసియా యుద్ధ ఉద్రిక్తతల కారణంగా ప్రపంచమంతా సంక్షోభంలో ఉన్న సమయంలో, దేశంలోని రైతులు, మహిళల్లో భయాందోళనలను వ్యాప్తి చేస్తున్నాయంటూ విపక్షాలపై ఆగ్రహించారు. "దేశం బాధలు పడుతుంటే వారికి బాగుంటుంది. దేశ సంకట స్థితి వారికి సంతోషాన్ని కలిగిస్తుంది" అంటూ మోదీ మండిపడ్డారు. దేశ ఇంధన భద్రతతోపాటు క్రిమి సంహారకాల దిగుమతిపై గల్ఫ్ సంక్షోభం తీవ్ర ప్రభావం చూపుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ గడ్డుపరిస్థితిని దేశం ఒక్కతాటిపైకి వచ్చి ఎదుర్కొంటుండగా, ఎరువుల కొరత గురించి కొంతమంది తప్పుడు వదంతులు వ్యాప్తి చేస్తున్నారని మోదీ మండిపడ్డారు. దొంగ క్యూలైన్లు వారే సృష్టించి రైతుల్లో భయాందోళనలు వ్యాప్తి చేశారన్నారు. దేశంలో గందరగోళం సృష్టించడం ద్వారా తన ప్రతిష్ఠను దెబ్బతీయాలని విపక్షాలు ప్రయత్నిస్తున్నాయంటూ మండిపడ్డారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో గల్ఫ్ ఉద్రిక్తతలు మొదలైన కొత్తల్లో, ఇందుకు విఫల ప్రయత్నం చేశాయన్నారు. "గ్యాస్ దొరికే పరిస్థితి ఇక లేదు...వంట ఎలా చేసుకుంటారు.. సకాలంలో పిల్లలను బడులకు ఎలా పంపిస్తారంటూ గృహిణులను భయపెట్టారని, ఎరువులపై రైతులను ఆందోళనకు గురిచేశారన్నారు. 'రైతులకు అండగా నిలుస్తానని హామీ ఇచ్చా. మాట ఇచ్చినట్టే యుద్ధ ఉద్రిక్తతలు ఉన్నప్పటికీ ఎక్కడా ఎరువులకు కొరత రానీయలేదు. యుద్ధం కారణంగా ప్రపంచవ్యాప్తంగా ఎరువులు, రసాయనాల ధరలు పెరిగినప్పటికీ ఆ భారం రైతులపై పడకుండా చూశామన్నారు. "అంతర్జాతీయ మార్కెట్‌లో రూ. 3 వేలు ఉన్న బస్తా యూరియాను, మనం ఇక్కడ రూ.300 కన్నా తక్కువకే ఇస్తున్నాం. రూ. 5000 ఉన్న డీఏపీని మన రైతులు రూ.1,350కే అందుకుంటున్నారు. వివిధ పథకాల ద్వారా గత కొన్ని సంవత్సరాలుగా రైతాంగం రూ.ఐదు లక్షల కోట్ల మేర లబ్ధి పొందింది." అని వివరించారు. గుజరాత్ డిప్యూటీ సీఎం హర్ష సంఘ్వీ మాట్లాడుతూ.. 'మోదీ కహీ నహీ జాయేగా' (మోదీ ఎక్కడకూ వెళ్లరు) అంటూ నినదించారు. ఆ వెంటనే నభలోని వారంతా దాన్ని అందుకుని.. పెద్ద ఎత్తున నినదించారు.

రైతుల ఖాతాల్లో నగదు జమ

ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి పథకం 24వ విడతలో భాగంగా రూ. 18,000 కోట్లను రైతుల ఖాతాల్లో ప్రధాని మోదీ జమ చేశారు. దేశవ్యాప్తంగా 10 కోట్లమంది రైతులకు ఈ పథకం లబ్ధి చేకూర్చింది. ఇందులో గుజరాత్‌కు చెందిన యాభై లక్షలమంది వెయ్యి కోట్ల విలువైన ప్రయోజనం పొందారు.

ఐడీబీఐ విక్రయంపై రగడ!

న్యూఢిల్లీ, అక్టోబరు 30: ఐడీబీఐ బ్యాంకు ప్రైవేటీకరణ వ్యవహారం కేంద్ర ప్రభుత్వానికి, కాంగ్రెస్‌కు మధ్య రాజకీయ యుద్ధానికి తెరలేపింది. లాభాల బాటలో పయనిస్తున్న ప్రభుత్వ రంగ బ్యాంకును విక్రయించాల్సిన అవసరమేంటని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ప్రశ్నిస్తుండగా.. కాంగ్రెస్ హయాంలో బ్యాంకింగ్ వ్యవస్థను రాజకీయ ప్రయోజనాలకు వాడుకున్నారని కేంద్ర ఆర్థికమంత్రి నిర్మల ఎదురుదాడికి దిగారు. ఐడీబీఐ బ్యాంకులో మెజారిటీ వాటాను విక్రయించాలన్న కేంద్రం నిర్ణయంపై రాహుల్‌తీవ్రంగా స్పందించారు. ఒకప్పుడు ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయిన బ్యాంకును ఉద్యోగుల కృషి, సమష్టి ప్రయత్నాలతో లాభాల బాటలోకి తీసుకొచ్చారని చెప్పారు. గత ఏడాది బ్యాంకు రూ.9 వేల కోట్లకు పైగా లాభాన్ని ఆర్జించిందని గుర్తుచేశారు. అలాంటి బ్యాంకును ప్రైవేటు సంస్థ చేతుల్లో పెట్టాల్సిన అవసరమేంటని శుక్రవారం రాహుల్ గాంధీ 'ఎక్స్'లో ప్రశ్నించారు. కాంగ్రెస్ హయాంలో దేశ పారిశ్రామిక అభివృద్ధికి అవసరమైన ఆర్థిక వనరులు సమకూర్చేందుకు ఐడీబీఐ వంటి బ్యాంకులను ఏర్పాటు చేశారని, మోదీ హయాంలో వాటిని విక్రయిస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ హయాంలో బ్యాంకులు ఏర్పాటయ్యాయని.. మోదీ హయాంలో అమ్ముకుంటున్నారని ఆరోపించారు. రాహుల్ విమర్శలకు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బదులిచ్చారు. కాంగ్రెస్ హయాంలో బ్యాంకులు, ఆర్థిక సంస్థలను వ్యక్తిగత ఆస్తుల్లా ఉపయోగించుకున్నారని ఆరోపించారు.

రాజకీయ పలుకుబడితో బ్యాంకు ఉద్యోగులపై ఒత్తిడి తెచ్చి, సరైన రుణ ప్రమాణాలను పక్కనపెట్టి పెద్ద వ్యాపార సంస్థలకు రుణాలు ఇప్పించారని విమర్శించారు. తాము అధికారంలోకి వచ్చే సమయానికి ఐడీబీఐ బ్యాంకు పరిస్థితి ఏమాత్రం బాగా లేదని, రూ.25 వేల కోట్లకు పైగా మూలధనాన్ని సమకూర్చి బ్యాంకును పునరుద్ధరించామని అన్నారు. కాంగ్రెస్ హయాంలో పలుకుబడి ఉన్నవారికి ఒక రకమైన బ్యాంకింగ్ విధానం, సామాన్యులకు మరో రకమైన విధానం ఉండేదని విమర్శించారు.

రూ.52,878 కోట్లకు ఫెయిర్‌ఫ్యాక్స్‌కు విక్రయం

ఐడీబీఐ బ్యాంకు ప్రైవేటీకరణలో భాగంగా కెనడాకు చెందిన ఫెయిర్‌ఫ్యాక్స్ ఫైనాన్షియల్ హోల్డింగ్స్ సంస్థను వ్యూహాత్మక కొనుగోలుదారుగా కేంద్రం ఎంపిక చేసింది. ఈ నెల 14న కేంద్ర క్యాబినెట్ ఇందుకు ఆమోదం తెలిపింది. కేంద్ర ప్రభుత్వానికి చెందిన 30.48 శాతం, ఎల్ఐసీకి చెందిన 30.24 శాతం.. మొత్తం 60.72 శాతం వాటాను విక్రయించనున్నారు. ఈ లావాదేవీ విలువ సుమారు రూ.52,878 కోట్లు. ఇది భారత బ్యాంకింగ్ రంగంలో అతిపెద్ద విదేశీ పెట్టుబడి లావాదేవీల్లో ఒకటిగా నిలవనుంది.

ఉపాధి హామీ లక్ష్యాల సాధనలో నిర్లక్ష్యం సహించేది లేదు

జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ - కూలీలకు నిరంతర ఉపాధి



జగిత్యాల ప్రతినిధి అక్టోబర్ 30(ప్రజాకలం) : గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీ పనులను వేగవంతం చేయడంతో పాటు జాబ్ కార్డులు కలిగిన ప్రతి ఒక్కరికీ నిరంతరం ఉపాధి కల్పించాలని, గ్రామాల్లో శాశ్వత ఆస్తుల సృష్టికి ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ సంబంధిత గ్రామ, మండల స్థాయి అధికారులతో పెగడపల్లి మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాబోయే 2027 జూన్, జూలై నెలల వరకు ఉపాధి హామీ పనుల నిర్వహణకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని, కూలీలకు నిరంతర ఉపాధి కల్పించేందుకు అదనపు పనులను గుర్తించి తగినన్ని అంచనాలు రూపొందించి ముందస్తుగా అనుమతులు, మంజూరులు పొందాలని సూచించారు. ఉపాధి హామీ పథకం కింద సోక్ పిట్స్, ఫామ్ పాండ్స్, నర్సరీల ఏర్పాటు, మొక్కల పెంపకం తదితర పనులను ప్రణాళికా బద్ధంగా చేపట్టాలని సూచించారు. ప్రతి గ్రామపంచాయతీలో జాబ్ కార్డుదారుల సంఖ్య, కూలీల అవసరాలు, అందుబాటులో ఉన్న పనులను గుర్తించి నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా పనులు చేపట్టాలని ఆదేశించారు. గ్రామపంచాయతీలు, మండలాల వారీగా ఉపాధి హామీ పనుల పురోగతిని నిరంతరం సమీక్షించాలని, కూలీల హాజరు శాతాన్ని పెంచేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను సూచించారు. లక్ష్యాల సాధనలో వెనుకబడిన గ్రామాలు, మండలాలపై ప్రత్యేక దృష్టి సారించి పనుల పురోగతిని మెరుగుపరచాలని స్పష్టం చేశారు. నిర్దేశిత లక్ష్యాలను సాధించడంలో నిర్లక్ష్యం వహించే అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామపంచాయతీల ఆదాయ వనరులను పెంపొందించేందుకు పన్నుల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని, వచ్చే మార్చి నెల నాటికి నూటికి నూరు శాతం పన్నుల వసూళ్లు పూర్తి చేయాలని ఆదేశించారు. కొన్ని మండలాల్లో పన్నుల వసూళ్లు ఆశించిన స్థాయిలో లేకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ, ప్రతి గ్రామపంచాయతీ నిర్దేశిత లక్ష్యాన్ని చేరుకోవాలని సూచించారు. పన్నుల వసూళ్ల వివరాలను తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, ఆన్‌లైన్‌లో నమోదైన రికార్డులనే ప్రామాణికంగా పరిగణనలోకి తీసుకుంటామని స్పష్టం చేశారు. పంచాయతీ కార్యదర్శులు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఎంపీడీవోలు, ఇతర సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ఉపాధి హామీ పనుల పురోగతి, గ్రామాల్లో ఆస్తుల సృష్టి, పన్నుల వసూళ్ల లక్ష్యాలను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహించే పంచాయతీ కార్యదర్శులు, సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సమావేశంలో జెడ్పీ సీఈఓ గౌతమ్ రెడ్డి, డీఆర్‌డీఓ రఘువరన్, ఆర్డీఓ మధునాదన్, ఎంపీడీఓ, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ వధకం నిబ్బంది, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు

అయ్యప్ప స్వామి ఆలయంలో నూతన షెడ్డు నిర్మాణానికి భూమిపూజ

కార్యక్రమంలో పాల్గొన్న టీపీసీసీ డెలిగేట్ కల్వకుంట్ల సుజిత్ రావు



మెట్ పల్లి టౌన్ ప్రతినిధి అక్టోబర్ 30 (ప్రజాకలం): మెట్‌పల్లి పట్టణంలోని శ్రీ అయ్యప్ప స్వామి దేవాలయంలో నూతన షెడ్డు నిర్మాణానికి శుక్రవారం టీపీసీసీ డెలిగేట్ కల్వకుంట్ల సుజిత్ రావు భూమిపూజ నిర్వహించారు. పాత షెడ్డును ఆనుకొని నూతన షెడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు సుజిత్ రావును ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ కూన గోవర్ధన్, టీపీసీసీ ఫిషర్మన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రుత్త నారాయణ, జిల్లా కాంగ్రెస్ నాయకులు బైండ్ల శ్రీకాంత్, ఖతుబుద్దిన్ పాషా, ఏలేటి వినోద్ రెడ్డి, పలువురు కాంగ్రెస్ నాయకులు, గురుస్వాములు, అయ్యప్ప స్వాములు పాల్గొన్నారు. మెట్ పల్లి పట్టణ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు జెట్టి లింగం,మల్లాపూర్ మండల కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు కొమ్ముల చిన్నారెడ్డి,జిల్లా యూత్ కాంగ్రెస్ మీడియా కోఆర్డినేటర్ కూన రాకేష్, నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ఉప అధ్యక్షుడు కోడిమ్యాల దీపక్ రాజ్,నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ సెక్రటరీ అమ్ముల పవన్, ఇబ్రహీంపట్నం మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు నల్లూరి సాగర్,పాత దాంరాజ్ పల్లి ఉప సర్పంచ్ ఇప్పపల్లి గణేష్,వేంపల్లి ఉప సర్పంచ్ రోడ్డ హారిక రాజు,తిమ్మాపూర్ మాజీ ఉప సర్పంచ్ సల్ల సునీల్,డా.అవుట్ల లక్ష్మణ్,కల్లెడ గంగాధర్,గూడ సోల్ల ముత్యం రెడ్డి,గోపిడి నరేష్,పరశురామ్,కూన సాయితేజ,పిట్టల వెంకటేష్,ఎట్టేం మల్లేష్ నాయకులు అయ్యప్ప స్వాములు తదితరులు పాల్గొన్నారు.

బెల్లంపల్లి టిఆర్ఎస్ పార్టీలో చేరిన మహిళలు



బెల్లంపల్లి,అక్టోబర్ 30, (ప్రజాకలం) ప్రతినిధి బెల్లంపల్లి పట్టణంలో శుక్రవారం టిఆర్ఎస్ పార్టీలో మహిళలు చేరారు.వారికి మాజీ కార్మిక శాఖ మంత్రి ,టిఆర్ఎస్ పార్టీ బెల్లంపల్లి నియోజకవర్గ ఇంచార్జి బోడ జనార్ధన్,జిల్లా అఫీషియల్ స్పోక్స్మెన్ సిద్ధం శెట్టి సాజన్,పట్టణ అధ్యక్షుడు మత్తమారి శశికాంత్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.కన్నాలబస్తీ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా మాజీ మంత్రి బోడ జనార్ధన్ మాట్లాడుతూ ఉచిత విద్య, వైద్యం,వ్యవసాయం ఉపాధి,వంటి అనేక అంశాలపై సుదీర్ఘ ఆలోచనతో ప్రజలకు సంక్షేమం అభివృద్ధి అందాలనే దృఢమైన సంకల్పంతో టిఆర్ఎస్ పార్టీని అధినేత్రి కవిత ప్రారంభించారన్నారు. గత ప్రభుత్వాలు రాష్ట్ర ప్రజలకు చేసింది శూన్యమని. ప్రజలకు అభివృద్ధి,సంక్షేమం అందే విధంగా టిఆర్ఎస్ పార్టీ ముందుకు వెళ్తుంది అని తెలిపారు.ఇంద్రవెల్లి లో పాంచజన్య మహాసభకు పార్టీ కార్యకర్తలు,నాయకులు పెద్ద ఎత్తున తరలి వెళ్తున్నామన్నారు. బెల్లంపల్లిలో వచ్చే ఎన్నికల్లో టిఆర్ఎస్ పార్టీ జెండా ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు..

టీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడిగా లింగంపల్లి సంజీవ్ నియామకం



మెట్‌పల్లి టౌన్ ప్రతినిధి అక్టోబర్ 30 (ప్రజాకలం):- తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) మెట్‌పల్లి పట్టణ అధ్యక్షుడిగా మున్సిపల్ కౌన్సిల్ మాజీ కో-ఆప్షన్ సభ్యుడు లింగంపల్లి సంజీవ్ నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం పార్టీ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత నియామక ఉత్తర్వులు జారీ చేశారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో మెట్‌పల్లి పట్టణంలో సంజీవ్ క్రియాశీలకంగా పనిచేశారు. బీఆర్ఎస్‌లో సుదీర్ఘకాలం పనిచేసిన ఆయన, ఆ పార్టీకి రాజీనామా చేసి కల్వకుంట్ల కవిత సమక్షంలో తెలంగాణ రక్షణ సేనలో చేరారు.తనపై నమ్మకంతో పట్టణ అధ్యక్ష బాధ్యతలు అప్పగించిన కవితకు, కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ రఘుకు సంజీవ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మెట్‌పల్లి పట్టణంతోపాటు పరిసర గ్రామాల్లో పార్టీ బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని, పార్టీ అధిష్ఠానం తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని పేర్కొన్నారు. సంజీవ్ నియామకం పట్ల టీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు.

వైభవంగా వాసవి అమ్మవారి

గర్భగుడి శిలాన్యాస మహోత్సవం

- నూతన ఆలయ నిర్మాణ పనులకు శ్రీకారం

- నూతన దుకాణ సముదాయం ప్రారంభం



మెట్‌పల్లి టౌన్ ప్రతినిధి అక్టోబర్ 30 ప్రజాకలం:- పట్టణంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయ నూతన నిర్మాణ పనుల్లో భాగంగా అమ్మవారి గర్భగుడికి సంబంధించిన తొలి శిలా స్థాపన మహోత్సవం శుక్రవారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మెట్‌పల్లి మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి, పట్టణ ఆర్య వైశ్య సంఘం అధ్యక్షుడు మైలారపు రాంబాబు హాజరయ్యారు. వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి,కొబ్బరికాయలు కొట్టి ఆలయ నిర్మాణ పనులను లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం నూతన దుకాణ సముదాయాన్ని ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో ఆర్య వైశ్య సంఘం గౌరవ అధ్యక్షుడు కోట గంగాధర్, దొంతుల రాజకుమార్, కోట సుమన్, మున్సిపల్ గౌరవ కౌన్సిలర్లు,దేవాలయ కమిటీ కార్యవర్గ సభ్యులు, ఆర్య వైశ్య సంఘం ప్రతినిధులు, మహిళలు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

అక్రమ ఇసుక రవాణా ను అధికారులు

వెంటనే అరికట్టాలి

- బెల్లంపల్లి ట్రాక్టర్ అసోసియేషన్ సభ్యులు



బెల్లంపల్లి, అక్టోబర్ 30, (ప్రజాకలం) ప్రతినిధి.

బెల్లంపల్లిలో జరుగుతున్న అక్రమ ఇసుక రవాణా ను అధికారులు వెంటనే అరికట్టాలని బెల్లంపల్లి ట్రాక్టర్ అసోసియేషన్ సభ్యులు డిమాండ్ చేశారు. శుక్రవారం బెల్లంపల్లిలో ఏర్పాటు చేసిన సమావేశంలో అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ కొందరు అక్రమార్కులు నెన్నెల మండలం, జంకాపూర్, తదితర ప్రాంతాల నుంచి ట్రాక్టర్ ల ద్వారా అక్రమ ఇసుకను రవాణా చేస్తున్నారు. ఇసుక అక్రమ రవాణాతో వారు అధికంగా ఆదాయాన్ని సమాకూర్చుంటు ఇటు తమ ఉపాధిని, ప్రభుత్వ అదాయానికి గండి కొడుతున్నారని ఆరోపించారు. గతంలో తాము నెలకు 15 నుంచి 18 ట్రిప్పుల ఇసుక తరలిస్తే, ఈ అక్రమ ఇసుక రవాణా వల్ల నెలకు 7 నుంచి 8 ట్రిప్పుల మాత్రమే తమకు ఆదాయం వస్తుందని వాపోయారు. ట్రాక్టర్ అసోసియేషన్ ద్వారా ప్రభుత్వానికి ఇసుక రవాణా ద్వారా నెలకు 18 లక్షల రూపాయల ఆదాయం వస్తుందని తెలిపారు. ఈ అక్రమ ఇసుక రవాణా చేయడం ద్వారా ఇటు తమ ఆదాయం, అటు ప్రభుత్వానికి చెందాల్సిన ఆదాయం సైతం పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. బెల్లంపల్లిలో ట్రాక్టర్ ఇసుక రవాణా ద్వారా ప్రత్యక్షంగా 150 పరోక్షంగా ఏడు నుంచి తొమ్మిది వందల కుటుంబాలు జీవనాన్ని కొనసాగిస్తున్నారని అన్నారు. అక్రమ ఇసుక రవాణా ఇలాగే కొనసాగితే తమ కుటుంబాలు రోడ్డునప్పుడే పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో సైతం సంబంధిత అధికారుల కు ఫిర్యాదు చేసినప్పటికీ వారు పట్టించుకోవడంలేదని ఆరోపించారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి అక్రమ ఇసుక రవాణాను అరికట్టాలని లేనిపక్షంలో ట్రాక్టర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రెసిడెంట్ వీ.రాజు, సెక్రెటరీ సంగతి రామకృష్ణ, కోశాధికారి ఏ.కుమారస్వామి, సభ్యులు సందీప్, చంద్రశేఖర్, సతీష్, మొగిలి, సత్తన్న, ముక్తేష్, మల్లేష్, తదితరులు పాల్గొన్నారు...

ప్రభుత్వ విద్యాసంస్థలు, ఆసుపత్రులలో సౌకర్యాల

మెరుగుదలకు ప్రత్యేక చర్యలు






- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాల జిల్లా//ప్రజాకలం జిల్లా ప్రతినిధి : జిల్లాలోని ప్రభుత్వ విద్యాసంస్థలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఇతర ప్రభుత్వ కార్యాలయాలను సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం జిల్లాలోని దండేపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాలను మండల తహసిల్దార్ రోహిత్ దేశ్ పాండే, మండల పరిషత్ అభివృద్ధి అధికారి ప్రసాద్ లతో కలిసి సందర్శించి కళాశాల భవన నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అసంపూర్తిగా ఉన్న భవన నిర్మాణ పనులను టెండర్ ప్రక్రియ ద్వారా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని, పనులను త్వరితగతిన పూర్తిచేసి జూనియర్ కళాశాలకు భవనాన్ని అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు సూచించారు. కళాశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి 10వ తరగతి విద్యార్థులకు స్వయంగా గణిత పాఠ్యాంశాలను బోధించి, విద్యార్థుల అభ్యసన స్థాయిని పరిశీలించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి ఆసుపత్రిలోని వార్డులు, రిజిస్టర్లు, పడకలు, రోగులకు అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవాల సంఖ్య, ప్రైవేట్ ఆసుపత్రులలో ప్రసవాలు చేయించుకోవడానికి గల కారణాలను వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ ఆసుపత్రులలో మెరుగైన వైద్య సేవలు అందించి గర్భిణులు ప్రభుత్వ వైద్య సేవలను వినియోగించుకునేలా అవగాహన కల్పించాలని తెలిపారు. వైద్యులు, సిబ్బంది విధుల పట్ల సమయపాలన పాటిస్తూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, అవసరమైన మందులను అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. మండల తహశీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి భూ భారతి, రెవెన్యూ సంబంధిత పెండింగ్ దరఖాస్తుల పరిష్కారంపై తహసిల్దార్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. మండలంలో ఇందిరమ్మ ఇండ్ల పురోగతిపై మండల పరిషత్ అభివృద్ధి అధికారిని వివరాలు అడిగి నిర్మాణ పనులు వేగవంతం చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం జన్నారం మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలను సందర్శించి నిర్మాణంలో ఉన్న ప్రహరీ గోడ పనులను పరిశీలించి త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పాఠశాలలో విద్యార్థుల హాజరు, విద్యార్థుల సంఖ్య, వారికి అందిస్తున్న సౌకర్యాలు, భోజన మెనూ అమలును పరిశీలించారు. విద్యార్థులకు నిర్ణీత మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి నిర్మాణంలో ఉన్న అదనపు గదుల పనులను పరిశీలించారు. పనులు దాదాపు పూర్తయ్యే దశలో ఉన్నందున మిగిలిన పనులను త్వరితగతిన పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని తెలిపారు. విద్యార్థినులకు మెనూ ప్రకారం సకాలంలో పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందించాలని, విద్యార్థుల ఆరోగ్య పట్ల శ్రద్ధ వహించాలని తెలిపారు. నిర్మాణంలో ఉన్న భోజనశాల పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి వైద్య సేవలు, రోగులకు అందుతున్న చికిత్స, ఆసుపత్రి నిర్వహణను పరిశీలించారు. జిల్లాలో డెంగ్యూ కేసులు నమోదైన గ్రామాల వివరాలను సేకరించి, సంబంధిత ప్రాంతాలలో నీటి నమూనాలను పరీక్షించాలని వైద్యాధికారులను ఆదేశించారు. దోమల వృద్ధికి కారణమయ్యే నీటి నిల్వలను గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో వారానికొకసారి / కనీసం నెలకు ఒకసారి ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. మండల తహసిల్దార్ కార్యాలయాన్ని సందర్శించి తహసిల్దార్ జి. బక్కయ్య, మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఉమర్ షరీఫ్ లతో కలిసి భూ భారతి దరఖాస్తుల పరిష్కారం, పెండింగ్ రెవెన్యూ సమస్యలపై అడిగి తెలుసుకున్నారు. మండల పరిషత్ అభివృద్ధి అధికారులతో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పురోగతి, వివిధ దశలలో ఉన్న ఇండ్ల వివరాలు, పారిశుధ్య కార్యక్రమాల అమలుపై సమీక్షించారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులతో ఇండ్ల నిర్మాణానికి ప్రభుత్వం ఉచితంగా ఇసుకను అందిస్తుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని నిబంధనల ప్రకారం నిర్ణీత విస్తీర్ణంలో ఇండ్లు నిర్మించుకోవాలని తెలిపారు.

మైనారిటీ మహిళలకు స్వయం ఉపాధి ప్రోత్సాహం

జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్

ఇందిరమ్మ మైనారిటీ మహిళా యోజన ద్వారా ముగ్గురికి రూ.50 వేల చొప్పున చెక్కుల పంపిణీ



జగిత్యాల ప్రతినిధి అక్టోబర్ 30 (ప్రజా కలం)

మైనారిటీ మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసి స్వయం ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ మైనారిటీ మహిళా యోజన పథకం ద్వారా లబ్ధిదారులకు ఆర్థిక సహాయం అందజేశారు. జగిత్యాల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జగిత్యాల రూరల్ మండలం పొలాస, నర్సింగాపూర్ గ్రామాలకు చెందిన ముగ్గురు ముస్లిం మైనారిటీ మహిళలకు ఒక్కొక్కరికి రూ. 50 వేల చొప్పున మంజూరైన చెక్కులను ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ పంపిణీ చేశారు. పొలాసకు చెందిన యండి సైమా సమీర్, రహీమా బేగం, నర్సింగాపూర్‌కు చెందిన అఫ్రీనా బేగంలు ఈ ఆర్థిక సహాయం పొందారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకుని మహిళలు స్వయం ఉపాధి రంగంలో రాణించాలని సూచించారు. సంపన్న దేశాల్లో సైతం అందరికీ ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించడం సాధ్యం కాదని, స్వయం ఉపాధి అవకాశాలను సృష్టించుకోవడం ద్వారా ఆర్థికంగా ఎదగాలని పేర్కొన్నారు. మహిళా సాధికారత, ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వం పలు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందని తెలిపారు. యూనియన్ బ్యాంక్ ఆధ్వర్యంలోని ఆర్ఎస్ఈటీఐ ద్వారా మహిళలకు నైపుణ్య శిక్షణ అందించే కార్యక్రమాన్ని కూడా చేపట్టినట్లు వెల్లడించారు.ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గాజంగి నందయ్య, ఎంపీడీవో రమాదేవి, సర్పంచ్ మీల్కూరి శంకర్, మాజీ జెడ్పీటీసీ పెండెం రాములు, శ్రీరాం భిక్షపతి, జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు ముఖీద్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు లింగారెడ్డి కి సన్మానం

మెట్‌పల్లి:(కోరుట్ల)ప్రతినిధి అక్టోబర్ 30 (ప్రజా కలం) ఇటీవల జగిత్యాల జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడిగా నియమితులైన కొమిరెడ్డి లింగారెడ్డిని శుక్రవారం మెట్‌పల్లి న్యాయవాదులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా శాలువా కప్పి, పూలమాల వేసి అభినందనలు తెలిపారు.

అనంతరం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏలేటి రాంరెడ్డి మాట్లాడుతూ తమతో పాటు న్యాయవాద వృత్తిలో కొనసాగిన వ్యక్తి జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడిగా నియమితులు కావడం ఎంతో గర్వకారణమన్నారు. భవిష్యత్తులో ఆయన మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షురాలు మెడిచెల్మల సుమలత, ప్రధాన కార్యదర్శి నల్ల రాజేందర్, న్యాయవాదులు గంద్ర ప్రవీణ్ రావు, ఎం.డి. వల్లియొద్దీన్, గడ్డం శంకర్ రెడ్డి, బద్దం లక్ష్మారెడ్డి, పోలకొండ దయాకర్ వర్మ, నాంపల్లి మారుతి, పసునూరి సుదర్శన్, మామిడిపల్లి విజయలక్ష్మి, నేరెళ్ల శ్రీధర్, తెడ్డు ఆనంద్, పసునూరి శ్రీనివాస్, నీరటి రమణ తదితరులు పాల్గొన్నారు.



ప్రజా కలం
శనివారం, అక్టోబర్ 31, 2026

నాన్నంటే ఎన్నటికీ అర్థం కాని ఓ ఎమోషన్..!

మనం ఈ భూమి మీద జీవం పోసుకున్నామంటే దానికి సూత్రధారులు అమ్మ, నాన్నే. ఒకరు తొమ్మిది నెలలు భారం మోస్తే, మరొకరు జీవితాంతం బాధ్యత వహిస్తారు. భారం కష్టం అందరూ చెప్తారు కానీ బాధ్యత వెనక ఉన్న ఒక తండ్రి ఆవేదన కోసం చాలా తక్కువ గా చర్చిస్తారు అందరూ అమ్మ కోసమే మాట్లాడతారు అమ్మ ఎన్నో కష్టాలు పడి పెంచింది, పెద్ద చేసింది అని. వాస్తవమే తల్లి పడిన కష్టాన్ని వెల కట్టలేం, వర్ణనాతీతం అది. అలానే నాన్న పడిన కష్టం కూడా మాటల్లో చెప్పలేనిది. నాన్న కష్టం కోసం మాట్లాడేవారు, పట్టించుకునే వారు చాలా అరుదుగా కనిపిస్తారు. అమ్మ జన్మనిస్తే, ఆ జన్మకి సార్థకత నాన్న వల్ల వస్తుంది. నిరంతరం మన వెనకాల ఉండి, మనందర్ని గెలిపించి, ఆ ఘనత కూడా తీసుకోని పెద్ద మనసు గల ఒకే ఒక వ్యక్తి నాన్న. పగలు కళ్ళు తెరిచిన దగ్గరనుండి మళ్ళీ నిద్ర పోయే వరకు ప్రతి క్షణం నా భార్య, నా పిల్లలు, నా ఇల్లు అని ఎండా వాన, పగలు రాత్రి అన్న తేడా లేకుండా కష్టపడి డబ్బులు సంపాదించేది నాన్న. తనకంటూ ఏ స్వార్థం లేకుండా తాను ఒక పూట పస్తు ఉండి అయినా సమయానికి అన్ని చేకూర్చేది నాన్న మాత్రమే. వంట్లో నలత గా ఉన్నా, ఒక్క రోజు పనికి వెళ్లకపోతే నా పిల్లలు ఆడిగినవి ఇవ్వలేకపోతానేమో అన్న భయంతో, ఓపిక తెచ్చుకుని పనికి వెళ్ళిపోతాడు నాన్న. నాన్న అంటేనే పౌరుషం. అమ్మలా కొన్ని విషయాల్లో జాలిపడి పోయే రకం కాదు. ఆ కఠినత్వం, ఆ రౌద్రం తన బిడ్డ భవిష్యత్తు బాగుండాలని మాత్రమే. ఏడవడం మగవారి లక్షణం కాదని అనేస్తాం. ఏం మగవారికి మనసు లేదా? వారికి బాధ వేయదా?. ఏ బాధనైనా గుండెల్లో నింపుకుని బయట గంభీరంగా కనపడతారు నాన్న. తాను బాధపడుతున్నాడని ఎప్పుడూ పక్కనున్న భార్య కి కూడా తెలియనివ్వడు తను బాధపడుతుంది అని, అంత కోమలమైన మనస్సు ఆయనది. కొడుకు తండ్రి పౌరుషం అయితే, కూతురు తండ్రి నమ్మకం. నాన్న నమ్మకాన్ని కూతురు ఎప్పుడూ కాపాడుతుంది అన్న నమ్మకం తో, పుట్టిన దగ్గర నుండి చివరి వరకు గుండెల్లో దాచుకుంటాడు. కొడుకు వంశాభివృద్ధి కి కారకుడు, ఎప్పుడూ తండ్రి తోనే ఉంటాడు. కొడుకు తన కన్నా పది అడుగులు ఎత్తుకి ఎదగాలని నిరంతరం శ్రమిస్తాడు. తన కన్నా ఎత్తుగా ఎదిగిన కొడుకుని చూసి అందరికన్నా ఎక్కువ గర్వ పడేది, ఆనంద పడేది తండ్రి మాత్రమే. ఆ రోజు కోసమే తన జీవితం ధార పోసేస్తాడు. ప్రస్తుత సమాజంలో కొడుకు తన భాద్యత మరిచిపోయినా, నా కొడుకు ఎక్కడున్నా పిల్ల పాపలతో, సుఖంగా ఆరోగ్యంగా ఉండాలని ప్రతి రోజు దేవుడ్ని మనసులో కోరుకుంటూనే ఉంటాడు. ప్రపంచమంతా నీకు వ్యతిరేకంగా వున్నప్పుడు, నేనున్నాను అని వెనక నిలుచునేది నాన్న ఒక్కరే. నువ్వు గెలిచినప్పుడు పది మందికి గర్వంగా చెప్పుకుని ఆనందపడేది నాన్న ఒక్కరే. కోపంగా మాట్లాడితే నాన్నకి ప్రేమగా మాట్లాడడం రాదని అనుకున్నా, మౌనంగా మాట్లాడకుండా కూర్చుంటే , మాతో మాటలు ఆడడం ఆయనకి ఇష్టం లేదని అని అనుకున్నా, ఒక బిడ్డకి నాన్న మనసు, తను తండ్రి అయినప్పుడే అర్థం అవుతుంది. ఆకోపం వెనక ఉన్న నీ ప్రేమ, ఆ మౌనం వెనక ఉన్న నీ భావం, అతి చనువుగా ఉంటే మేము మీ మాట వినకుండా గారాబం ఎక్కువైపోతుందని ఆ ప్రవర్తన కి అంతరార్థం అని , అది మేము అనుభవిస్తేగాని అర్థం కాలేదు మాకు. తీసే ప్రతి ఊపిరి నీ భిక్షే నాన్న, ఏం చేయను నీ రుణం తీర్చుకోవడానికి . అమ్మలా మనసులో భావాలు వ్యక్తపరచలేరు, గంభీరత్వం అతని నైజం కనుక. పిల్లలుగా ఆయన్ని అర్థం చేసుకోవడం మన ధర్మం. నాన్నకు గుప్పెడంత నమ్మకం, ఎప్పుడూ మీరు అందరికన్నా గొప్పే నాన్న అన్న భరోసా ఇస్తే చాలు, ఆయన జీవితాంతం సంతోషంగా ఉండడానికి. ఎప్పుడూ మదర్స్ డే కి ప్రాధాన్యత ఇచ్చేవాళ్ళు మెల్లగా నాన్న ని కూడా అభిమానించడం మొదలుపెట్టేరని అర్థమౌతోంది. ఈ ఒక్కరోజే కాక ప్రతి రోజు ఆయన గొప్పతనాన్ని గుర్తు చేసుకోగలిగితే అదే ఆయనకి మనం ఇచ్చే గౌరవం, మర్యాద. అమ్మా,పిల్లలూ ఒక్కటౌతుంటారు ఈ సృష్టిలో. నాన్న ఎప్పుడూ తుంటరివాడే, అమ్మమాత్రమే తరుచూ మంచిది అవుతూ ఉంటుంది, పిల్లల దృష్టిలో. కని, పెంచటం అమ్మేఅన్నట్లు కనిపిస్తుంది, నాన్నబాధ్యత ఏమీ లేనట్లు అనిపిస్తుంది. కనటం అమ్మేఅయినా కలలుకనటం నాన్న పనేనని ఎంతమంది పిల్లలకు అర్థమౌతుంది? పెంచటం అమ్మే అయినా బాధ్యతెరిగి పెరగటం నాన్నవల్లేనని, కొంతమంది పిల్లలకే బోధపడుతుంది. సేవచేయటం అమ్మవంతు, సరిచేయటం నాన్నతంతు. అమ్మకు ఎప్పుడూ పిల్లలలోని గుణాలే కనబడుతాయి, నాన్నకు మాత్రం పిల్లలలోని గుణాలతోపాటు దోషాలుకూడా కనబడుతాయి. ప్రేమించటం అమ్మవంతు అయితే, దీవించటం నాన్నవంతు. ఆకలితీర్చటం అమ్మవంతు అయితే, ఆశలుతీర్చటం నాన్నవంతు. అమ్మప్రేమ అనుక్షణం బహిర్గతమౌతుంటుంది, నాన్నదీవెన ప్రతిక్షణం అంతర్గతంగానే ఉంటుంది. అమ్మగుండెలో పిల్లల సుఖానికి సంబంధించిన ఆలోచనే ఉంటుంది. నాన్నగుండెలో పిల్లల క్షేమానికి అనుబంధించిన ఆవేదనే ఉంటుంది. అమ్మఆరాటాన్ని కన్నీళ్లు చెపుతాయి, నాన్నఆత్రుతని కళ్ళు మాత్రమె చెపుతాయి. కనిపించే ఆరాటం అమ్మది, కనిపించని పోరాటం నాన్నది. అమ్మకి లైకులెక్కువ, నాన్నకి షాకులెక్కువ. అమ్మ ఏడవటం కనిపిస్తుంది, నాన్నఎద చెరువవటం కనిపించదు. గుర్తింపు తెచ్చుకున్న దేవత అమ్మ, గుర్తింపు పొందలేని దేవుడు నాన్న. పిల్లల జీవితానికి అమ్మ ఒకకళ అయితే, నాన్న తళతళ. కనిపించే దేవత అమ్మ అయితే, కనపడని దేవుడు నాన్న. పిల్లల ఓట్లే అమ్మకు ఆస్తి, నాన్నకు మాత్రం అన్నీ నాస్తి.

ఉద్యోగుల హక్కులను కాలరాస్తే ఊరుకోం

- ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల డిమాండ్లను వెంటనే పరిష్కరించాలి

- బీఆర్ఎస్ నాయకురాలు దాసరి ఉష



పెద్దపల్లి,అక్టోబర్ 30:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి) నేషనల్ హెల్త్ మిషన్ విభాగంలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని బీఆర్ఎస్ నాయకురాలు దాసరి ఉష డిమాండ్ చేశారు.జిల్లా కేంద్రంలో గత 18 రోజులుగా శాంతియుతంగా సమ్మె చేస్తున్న ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల ధర్నా శిబిరాన్ని శుక్రవారం ఆమె సందర్శించి సంపూర్ణ సంఘీభావం ప్రకటించారు.ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకురాలు దాసరి ఉష మాట్లాడుతూ ప్రజారోగ్యం కోసం అహర్నిశలు శ్రమిస్తున్న వైద్య సిబ్బంది పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం శోచనీయమన్నారు.ఇతర రాష్ట్రాల్లో మహిళా ఉద్యోగులకు ప్రత్యేక సెలవులు ఇస్తుంటే,ఇక్కడ పనిచేస్తున్న మహిళా సిబ్బందికి చట్టబద్ధంగా రావాల్సిన 180 రోజుల ప్రసూతి సెలవులను కూడా నిరాకరించడం దారుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు.రాష్ట్రంలో ప్రచారాలు,సమ్మిట్ల పేరిట పత్రికా ప్రకటనల కోసం కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్న ప్రభుత్వం, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 17 వేల మంది ఎన్‌హెచ్‌ఎం సిబ్బందికి ఈఎస్ఐ, ఇన్సూరెన్స్ ప్రీమియం చెల్లించడానికి మాత్రం వెనకడుగు వేస్తోందని విమర్శించారు.హర్యానా, రాజస్థాన్,పంజాబ్ వంటి రాష్ట్రాల్లో ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తుంటే, తెలంగాణలో మాత్రం ఉన్న కాంట్రాక్ట్ ఉద్యోగులను ఔట్‌సోర్సింగ్ లోకి నెట్టి వారి హక్కులను కాలరాయాలని చూస్తున్నారని మండిపడ్డారు.కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లో ప్రాణాలకు తెగించి సేవలందించిన వైద్య సిబ్బందికి రాజ్యాంగబద్ధంగా సమాన పనికి సమాన వేతనం. చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని ఆమె డిమాండ్ చేశారు. పెద్దపల్లి జిల్లాకు చెందిన స్థానిక ప్రజాప్రతిని ధులు, మంత్రులువెంటనే స్పందించి ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. ఎన్‌హెచ్‌ఎం కార్మికులు ఎవరి బెదిరింపులకూ భయపడాల్సిన అవసరం లేదని,వారి న్యాయమైన పోరాటానికి బీఆర్ఎస్ పార్టీ అన్ని వేళలా అండగా ఉంటుందని,రాబోయే అసెంబ్లీ సమావేశాల్లోనూ ఈ సమస్యపై గళమెత్తుతామని దాసరి ఉష స్పష్టం చేశారు.

బాలల హక్కుల పరిరక్షణకు పటిష్టమైన చట్టాలు

- జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి శ్రీనిజ కోహిర్కర్

- జ్యోతిబాపూలే పాఠశాలలో సురక్షిత్ బచ్‌పన్ అభియాన్ సదస్సు





పెద్దపల్లి,అక్టోబర్ 30:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి) బాలల హక్కుల పరిరక్షణ,వారిపై వేధింపుల నివారణే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పెద్దపల్లి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి,సీనియర్ సివిల్ జడ్జి శ్రీమతి శ్రీనిజ కోహిర్కర్ పిలుపునిచ్చారు.సురక్షిత్ బచ్‌పన్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల ఆదేశాల మేరకు రంగంపల్లిలోని మహాత్మా జ్యోతిబాపూలే పాఠశాలలో న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సదస్సులో శ్రీమతి శ్రీనిజ కోహిర్కర్ విద్యార్థులనుద్దేశించి ప్రసంగిస్తూ.. సమాజంలో బాల్య వివాహాలు,బాల కార్మిక వ్యవస్థ,లైంగిక వేధింపులు,మానవ అక్రమ రవాణా వంటి సమస్యల నుంచి పిల్లలను రక్షించేందుకు అనేక పటిష్టమైన చట్టాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.పిల్లలు ఎలాంటి వేధింపులకు లేదా సమస్యలకు గురైనా ఏమాత్రం భయపడకూడదని,ఆ విషయాలను వెంటనే తల్లిదండ్రులకు లేదా ఉపాధ్యాయులకు తెలియజేయాలని, అవసరమైతే సమీపంలోని పోలీస్ స్టేషన్‌లో గానీ లేదా నేరుగా పెద్దపల్లిలోని జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదిస్తే ఉచిత న్యాయ సహాయం అందిస్తామని తెలిపారు.ఆపదలో ఉన్నప్పుడు బాలల రక్షణ కోసం 1098,ఉచిత న్యాయ సేవ కోసం 15100 టోల్ ఫ్రీ నంబర్లకు ఫోన్ చేసి సమాచారం అందించవచ్చు అని ఆమె వివరించారు.అనంతరం జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన, పెయింటింగ్ పోటీలలో ప్రతిభ కనబరిచిన విజేతలకు శ్రీనిజ కోహిర్కర్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమంలో న్యాయవాదుల సంఘం ప్రతినిధులు రాచూరు శ్రీకాంత్,నరేష్,శరత్,బర్ల రమేష్ బాబు,లమ్మహిళా న్యాయవాదుల విభాగం ప్రతినిధి ఝాన్సీ,డీసీపీఓ సిబ్బంది రమ,కల్పన,శ్యామల,పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు

ఆయిల్‌పామ్ సాగుపై రైతులు దృష్టి సారించాలి..



మల్లాపూర్, అక్టోబర్ 30 (ప్రజాకలం ప్రతినిధి): ఆయిల్‌పామ్ సాగుపై రైతులు దృష్టి సారించాలని జిల్లా వ్యవసాయ అధికారి వడ్డేపల్లి భాస్కర్ అన్నారు. ఈ మేరకు మల్లాపూర్ మండలంలోని పాత ధాంరాజ్‌పల్లి గ్రామ పంచాయతీ వద్ద వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆత్మ) ఆధ్వర్యంలో రైతులకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశంలో ప్రతి ఏటా విదేశాల నుంచి వంటనూనెలను దిగుమతి చేసుకుంటున్న నేపథ్యంలో రైతులు ఆయిల్‌పామ్ సాగును ప్రోత్సహించాలని సూచించారు. డ్రిప్, స్ప్రింక్లర్ పరికరాలపై ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీల గురించి వివరించారు.ప్రస్తుతం ఎల్‌నినో వాతావరణ పరిస్థితులు ఏర్పడుతున్న నేపథ్యంలో యాసంగిలో వరి సాగు చేసి రైతులు నష్టపోవద్దని, నీటిని పొదుపుగా వినియోగించుకుంటూ పెసర, జనుము, నువ్వులు వంటి ఆరుతడి పంటలు సాగు చేసి లబ్ధి పొందాలని సూచించారు. ఈ పంటలకు సంబంధించిన విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. పొలాల్లో ఫామ్ పాండ్స్, ఇళ్ల వద్ద ఇంకుడు గుంతలు నిర్మించుకుని వర్షపు నీటిని సంరక్షించుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఆత్మ డిప్యూటీ ప్రాజెక్టు డైరెక్టర్ సుధాకర్, కోరుట్ల ఏడీఏ దండ రమేష్,మండల వ్యవసాయ అధికారిని లావణ్య, తహసీల్దార్ రామచందర్, ఎంపీడీవో అలువాల శ్రీకాంత్, ఉద్యానవన అధికారి శ్రీనివాస్ రెడ్డి, గ్రామ సర్పంచ్ రాజేశ్వరి, ఆత్మ చైర్మన్ వాకిటి భూమారెడ్డి, ఆర్ఐ అశోక్, ఏఈవో వైష్ణవి, పంచాయతీ కార్యదర్శి సౌజన్య, రైతులు రాజిరెడ్డి, నారాయణ, మోహన్ రెడ్డి, రాజేందర్, నరేష్, గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పట్టణాల్లో స్వచ్ఛ విప్లవం రావాలి

-15 రోజుల స్పెషల్ డ్రైవ్‌కు జిల్లా కలెక్టర్ ఆదేశం



పెద్దపల్లి,అక్టోబర్ 30:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి) పెద్దపల్లి,సుల్తానాబాద్ మున్సిపాలిటీల్లో రానున్న 15 రోజుల పాటు ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ నిర్వహించి సంపూర్ణ పరిశుభ్రత సాధించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో మున్సిపల్ అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ పట్టణాల్లో ఎక్కడా ప్లాస్టిక్ వ్యర్థాలు,రోడ్లపై మురుగునీరు నిల్వ ఉండకుండా డ్రైనేజీల్లో పూడికతీత పనులు చేపట్టాలని స్పష్టం చేశారు.సూపర్ ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో తాగునీటి సరఫరాకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని,పైప్‌లైన్ లీకేజీలను అరికట్టడంతో పాటు నీటిని వృథా చేసేవారికి జరిమానాలు విధించాలని ఆదేశించారు.వీటితో పాటు రానున్న రెండు నెలల్లో పన్నుల వసూళ్ల లక్ష్యాలను పూర్తి చేయాలని,అక్రమ నిర్మాణాలపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. టియుఎఫ్‌ఐడిసి, ఇతర గ్రాంట్ల ద్వారా చేపట్టిన అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, డంప్ యార్డులను పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్లు వెంకటేష్,రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఐజేయూ నూతన కార్యవర్గానికి

సుజిత్ రావు సన్మానం





మెట్‌పల్లి:(కోరుట్ల) ప్రతినిధి అక్టోబర్ 30(ప్రజా కలం): మల్లాపూర్ మండల ఐజేయూ నూతన కార్యవర్గాన్ని టీపీసీసీ డెలిగేట్ కల్వకుంట్ల సుజిత్ రావు సత్కరించారు. శుక్రవారం మెట్‌పల్లిలోని తన నివాసంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో నూతన కార్యవర్గ సభ్యులకు శాలువాలు కప్పి అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా ఐజేయూ మండల అధ్యక్షుడు మల్లేశ్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి, ఉపాధ్యక్షుడు రాంచందర్ రెడ్డి, గౌరవ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, గౌరవ సలహాదారు రాజశేఖర్, సంయుక్త కార్యదర్శులు మధుకర్, శ్యామ్‌లను సత్కరించారు. ఈ కార్యక్రమంలో మెట్‌పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కూన గోవర్ధన్, టీపీసీసీ ఫిషర్మన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రుత్త నారాయణ, జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శులు ఖుతుబుద్దిన్ పాషా, ఎండీ జాఫర్, మల్లాపూర్ మండల కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు కొమ్ముల చిన్నారెడ్డి, పాత ధాంరాజ్‌పల్లి ఉపసర్పంచ్ ఇప్పపల్లి గణేష్, వేంపల్లి ఉపసర్పంచ్ రోడ్డ హారిక రాజు, గోపిడి నరేష్, రెబ్బాస్ మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

బెల్లంపల్లి నుంచి ఢిల్లీ నిరసన కార్యక్రమానికి బయలుదేరిన కాంగ్రెస్ నాయకులు....



బెల్లంపల్లి, అక్టోబర్ 30, (ప్రజాకలం) ప్రతినిధి.. ఎస్ఐఆర్ ప్రక్రియలో జరిగిన అక్రమాలకు బాధ్యత వహిస్తూ సీఈసీ జ్ఞానేశ్ కుమార్ ను సస్పెండ్ చేయాలని ఏఐసిసి,టిపిసిసి ఆదేశానుసారం ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ,ఏఐసీసీ జనరల్ సెక్రెటరీ పార్లమెంటు సభ్యురాలు ప్రియాంక గాంధీ వాద్రాల ఆధ్వర్యంలో అక్టోబర్ 1న జరిగే భారీ నిరసన కార్యక్రమంలో పాల్గొనడానికి బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి పిలుపుమేరకు, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు బండి ప్రభాకర్ ఆధ్వర్యంలో బెల్లంపల్లి నుంచి కాంగ్రెస్ నాయకులు శుక్రవారం ఢిల్లీ కి బయలుదేరారు.ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షుడు బండి ప్రభాకర్ మాట్లాడుతూ సీఈసీ జ్ఞానేష్ కుమార్ ఎస్.ఐ.ఆర్ ప్రక్రియలో చేసిన అక్రమాలకు బాధ్యత వహిస్తూ ఆయనను బాధ్యతలు నుంచి తొలగించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎస్ఐఆర్ ప్రక్రియ ద్వారా పెద్ద ఎత్తున ప్రజలు వారు ఓటు హక్కును కోల్పోయారని, అర్హులైన ఓటర్లకు ఓటు హక్కు కల్పించేంతవరకు తమ పోరాటాలు కొనసాగుతాయన్నారు.ఈ కార్యక్రమంలో టిపిసిసి మెంబర్ చిలుముల శంకర్,పట్టణ ఉపాధ్యక్షులు దుబాని వెంకటస్వామి, మైనార్టీ నాయకులు ఎం.డి వాజియార్,కాంగ్రెస్ నాయకులు గద్దల కుమార్, సాయి కిరణ్,కాంపెల్లి సతీష్,కుంబాల రాజేష్,అలీ భాయ్,తదితరులు పాల్గొన్నారు...

చలో ఢిల్లీ నిరసన కార్యక్రమానికి బయలుదేరిన బెల్లంపల్లి కాంగ్రెస్ నాయకులు



బెల్లంపల్లి, అక్టోబర్ 30, (ప్రజాకలం)ప్రతినిధిబెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ పిలుపుమేరకు నవంబర్ 1న న్యూఢిల్లీ రాంలీల మైదానంలో తలపెట్టిన చలో ఢిల్లీ – ఓట్ బచావో–దేశ్ బచావో కార్యక్రమంలో పాల్గొనేందుకు బెల్లంపల్లి నుంచి కాంగ్రెస్ నాయకులు శుక్రవారం ఢిల్లీకి బయలుదేరారు. ఈ సందర్భంగా బెల్లంపల్లి మున్సిపల్ వైస్ చైర్మన్ రాగంశెట్టి సత్యనారాయణ, సీనియర్ నాయకులు దావ రమేష్,నెల్లి రమేష్, మునుమందుల రమేష్, మత్తమారి సూరిబాబు, ముచ్చర్ల మల్లయ్య ,డికొండ రాజలింగు మాట్లాడుతూ ఎస్.ఐ.ఆర్ ప్రక్రియలో ఎంతోమంది తమ విలువైన ఓటు హక్కును కోల్పోయారని, ఎస్ ఐ ఆర్ ప్రక్రియలో జరిగిన అక్రమాలకు బాధ్యత వహిస్తూ వెంటనే సిఇసి జ్ఞానేష్ కుమార్ ని సస్పెండ్ చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఓటు హక్కు కోల్పోయిన ప్రజలకు కాంగ్రెస్ పార్టీ నుంచి పూర్తి సహకారాలు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

పోచాలు కుటుంబ సభ్యులకు పరామర్శ

- ప్రగాఢ సానుభూతి తెలిపిన దాసరి ఉష

సుల్తానాబాద్,అక్టోబర్ 30:(ప్రజాకాలం జిల్లా ప్రతినిధి)పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలం కనుకుల–రామునపల్లి గ్రామానికి చెందిన కొల్లూరి పోచాలు వర్ధంతి శుక్రవారం కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించగా ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ పార్టీ నాయకురాలు దాసరి ఉష హాజరై పోచాలు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆమె పోచాలు కుటుంబ సభ్యులను పరామర్శించి,వారికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.ఆయన లేని లోటు కుటుంబానికి తీరనిదని,వారి కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.



సీఎంఆర్ సరఫరాలో జాప్యం వద్దు

- అదనపు కలెక్టర్ బి.శ్రీరాములు



పెద్దపల్లి,అక్టోబర్ 30:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి) గత ఖరీఫ్,రబీ సీజన్లకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న సీఎంఆర్ బియ్యాన్ని ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా పూర్తిస్థాయిలో సరఫరా చేయాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ బి.శ్రీరాములు రైస్ మిల్లర్లను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో సంబంధిత అధికారులు,మిల్లర్లతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఖరీఫ్ 2025-26లో 63 శాతం, రబీలో 56 శాతం మాత్రమే సీఎంఆర్ సరఫరా పూర్తయిందని, మిగిలిన కోటాను ఆలస్యం చేయకుండా వెంటనే అప్పగించాలని స్పష్టం చేశారు. ప్రస్తుత ఖరీఫ్ 2026-27 సీజన్‌లో జిల్లా వ్యాప్తంగా 4.96 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేయగా,పౌర సరఫరాల సంస్థ ద్వారా 312 కొనుగోలు కేంద్రాల ద్వారా 2.75 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించనున్నట్లు తెలిపారు. నవంబర్ రెండో వారం నుంచి కొనుగోళ్లు ప్రారంభం కానున్న నేపథ్యంలో కేంద్రాల్లో రైతులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.కేంద్రాల్లో అవసరమైన టార్పాలిన్లు,తేమ కొలిచే యంత్రాలు, ఎలక్ట్రానిక్ కాటాలు,సరిపడా గన్నీ సంచులను వెంటనే అందుబాటులో ఉంచాలన్నారు.జిల్లాలోని గోదాములు ఇప్పటికే నిండినందున, అదనపు నిల్వ సామర్థ్యంతో పాటు సీఏపీ స్థలాలను యుద్ధప్రాతిపదికన సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో జిల్లా పౌర సరఫరాల అధికారి శ్రీనాథ్,జిల్లా మేనేజర్ శ్రీకాంత్,రైస్ మిల్లర్లు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలను మెరుగుపరచాలి -జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష



పెద్దపల్లి,అక్టోబర్ 30:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి) పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందిస్తూ,విద్యార్థుల అభ్యసన ఫలితాలను మెరుగుపరిచేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సూచించారు. శుక్రవారం గోదావరిఖని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో 7 మండలాల ఎంఈఓలు,ప్రధానోపాధ్యాయులకు నిర్వహించిన ఒకరోజు ఓరియంటేషన్ శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ కోయ శ్రీహర్ష ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పాఠశాలల్లో అమలవుతున్న రెమిడియేషన్ తరగతులు,ఖాన్ అకాడమీ డిజిటల్ పాఠాలు,ఎఫ్.ఎల్.ఎన్.కార్యక్రమాలను మండల విద్యాధికారులు, ప్రధానోపాధ్యాయులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు.ముఖ్యంగా తెలుగు,ఆంగ్లం,గణితం సబ్జెక్టుల్లో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి వారి నైపుణ్యాలను మెరుగుపరచాలన్నారు.ఖాన్ అకాడమీలో విద్యార్థులందరి నమోదు పూర్తి చేసి,వారు సాధిస్తున్న ప్రగతిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని స్పష్టం చేశారు.తరగతి గదిలో విద్యార్థుల్లో వినడం,మాట్లాడడం, చదవడం,రాయడం వంటి భాషా సామర్థ్యాలు పెరిగేలా బోధన సాగాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి జి.శారద,ఏఎంఓ డా.పి.ఎం.షేక్,రామగుండం ఎంఈఓ మల్లేశం,ఇతర మండలాల విద్యాధికారులు, ప్రధానోపాధ్యాయులు,అధికారులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్ టీచర్ల నిరసన బాట

-నల్ల బ్యాడ్జీలతో విధులకు హాజరు



పెద్దపల్లి,అక్టోబర్ 30:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి)

మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మోడల్ స్కూల్ సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపు మేరకు శుక్రవారం జూలపల్లి మండలంలోని పెద్దాపూర్ మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. విద్యార్థుల చదువులకు ఎటువంటి ఆటంకం కలగకుండా విధులు నిర్వహిస్తూనే, మధ్యాహ్న భోజన విరామ సమయంలో పాఠశాల ఆవరణలో శాంతియుతంగా నిరసన తెలిపారు.ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలపై ప్రభుత్వానికి ఎన్నిసార్లు విన్నవించినా స్పందన లేకపోవడంతోనే విధిలేని పరిస్థితుల్లో దశలవారీ ఉద్యమ బాట పట్టాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు.ఎంఎస్-జేపీసీ ప్రకటించిన కార్యాచరణలో భాగంగా శనివారం కూడా పాఠశాల స్థాయిలో నిరసనలు కొనసాగుతాయని,నవంబర్ 2, 3 న మండల తహసీల్దార్,ఎంపీడీఓలకు, 4 నుంచి 6 వరకు జిల్లా డీఈవో, కలెక్టర్లకు,10 నుంచి 12 వరకు స్థానిక ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు అందజేసి,చివరగా నవంబర్ 17న రాష్ట్రస్థాయి ముట్టడి-ధర్నా కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు వెల్లడించారు.ప్రభుత్వం తక్షణమే స్పందించి సమస్యలను పరిష్కరించాలని కోరుతూ,రాబోయే అన్ని ఆందోళన కార్యక్రమాలలో ఉపాధ్యాయులందరూ ఐక్యంగా పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

నూతన వివో భవనం భూమి పూజ

కార్యక్రమం లో పాల్గొన్న సర్పంచ్

ఎండపల్లి, అక్టోబర్ 30:(ప్రజాకలం ప్రతినిధి) మండలంలోని పడకల్ గ్రామం లోవివో బిల్డింగ్‌కు శంకుస్థాపన గ్రామ సర్పంచ్ బెడ్డల ప్రవీణ్,అధికారుల ఆధ్వర్యంలో భూమి పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమం లో ఉప సర్పంచ్, వార్డ్ సభ్యులు, పిఆర్ ఏఈ రాజ్ కుమార్, గ్రామ పంచాయతీ కార్యదర్శి విజయ్, వివో అధ్యక్షురాలు, సిఏ, మహిళా సంఘ సభ్యులు కారోబార్, ఫీల్డ్ అసిస్టెంట్, వివో బిల్డింగ్ కాంట్రాక్టర్ ఆకుల ప్రవీణ్ కుమార్,గ్రామ ప్రజలు పాల్గొన్నట్లు గ్రామసర్పంచ్ బెడ్డలప్రవీణ్ తెలిపారు.



వరికి స్వస్తి పలికి ఆరుతడి పంటల వైపు మళ్లాలి

- రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మక్కాన్ సింగ్

పెద్దపల్లి,అక్టోబర్ 30:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి)

రాబోయే యాసంగి సీజన్‌లో రైతులు సంప్రదాయ వరి సాగుకు స్వస్తి పలికి, తక్కువ నీటితో అధిక లాభాలనిచ్చే ఆయిల్‌పామ్,కూరగాయలు వంటి ఆరుతడి పంటల వైపు మొగ్గు చూపాలని రామగుండం శాసనసభ్యులు మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ పిలుపునిచ్చారు.పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం ఈసాలతక్కళ్లపల్లి గ్రామంలో ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో 35 ఎకరాల్లో చేపట్టిన ఆయిల్‌పామ్ మెగా ప్లాంటేషన్ కార్యక్రమాన్ని శుక్రవారం ఆయన స్వయంగా మొక్క నాటి లాంఛనంగా ప్రారంభించారు.అనంతరం రైతులకు ఆయిల్‌పామ్ సాగు విధానాలు, నీటి యాజమాన్యంపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఎమ్మెల్యే ప్రసంగించారు.ఎల్‌నినో ప్రభావం వల్ల రాబోయే రోజుల్లో నీటి కొరత తీవ్రమయ్యే సూచనలు ఉన్నాయని, భూగర్భ జలాలను కాపాడుకోవడం అత్యంత అవసరమని ఎమ్మెల్యే పేర్కొన్నారు.నీటి లభ్యత లేని పరిస్థితుల్లో రిస్క్ చేసి వరి వేయవద్దని,అవసరమైతే ప్రత్యామ్నాయ పంటలు వేయాలని లేదా భూములను తాత్కాలికంగా ఖాళీగా ఉంచడమే మేలని ఆయన రైతులకు సూచించారు.



బిందు సేద్యంతోనే నీటి పొదుపు

-జిల్లా ఉద్యాన అధికారి గడ్డం శ్యాంప్రసాద్

ప్రతి నీటి బొట్టునూ సద్వినియోగం చేసుకునేలా రైతులు డ్రిప్,స్ప్రింక్లర్ పద్ధతులను తప్పనిసరిగా పాటించాలని జిల్లా ఉద్యాన అధికారి గడ్డం శ్యాంప్రసాద్ తెలిపారు. వర్షపు నీటి నిల్వకు వ్యవసాయ కుంటలు,ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని పిలుపునిచ్చారు.ప్రభుత్వం ఆయిల్‌పామ్, సూక్ష్మ సేద్య పరికరాలపై భారీగా రాయితీలు అందిస్తోందని,రైతులు ఈ అవకాశాలను వినియోగించుకోవాలని కోరారు.త్వరలో శ్రీరాంపూర్‌లో ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ శ్రీరాంపూర్ మండలంలో తిరుమల ఆయిల్ కంపెనీ ఆధ్వర్యంలో త్వరలోనే ఆయిల్‌పామ్ ప్రాసెసింగ్ ఫ్యాక్టరీ నిర్మాణ పనులు పూర్తికానున్నాయని కంపెనీ ప్రతినిధులు వెల్లడించారు.స్థానికంగానే ఫ్యాక్టరీ అందుబాటులోకి వస్తుండటంతో మార్కెటింగ్ సమస్య ఉండదని అధికారులు స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో రామగుండం వ్యవసాయ మార్కెట్ కమిటీ వైర్మన్ గాలిపెల్లి తిరుపతి,పాలకుర్తి తహసీల్దార్ కోటేశ్వర్,ఎంపీడీవో రమేష్,సీఐ వై. కృష్ణకుమార్, వ్యవసాయ అధికారి ప్రమోద్,ఉద్యాన అధికారిణి జ్యోతి, తిరుమల ఆయిల్‌కెమ్ కంపెనీ సీఈవో కేశు కళ్యాణ్‌కర్,హెచ్‌వో బి.రాము,ఏఈవో కె.శ్రీకాంత్,ప్లాంటేషన్ ఆఫీసర్ టి.ప్రశాంత్, డ్రివ్ అధికారులు ఎ.రాజు,టి.మునిధర్,స్థానిక సర్పంచులు,అధికారులు,రైతులు పాల్గొన్నారు.

నీటిని వృధా చేస్తే కఠిన చర్యలు

మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్ - మినరల్ వాటర్ ప్లాంట్ యజమానులతో సమీక్ష



పెద్దపల్లి,అక్టోబర్ 30:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి)

పట్టణంలో తాగునీటిని వృధా చేస్తే కఠిన చర్యలు తప్పవని పెద్దపల్లి మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్ హెచ్చరించారు. ప్రస్తుతం కొనసాగుతున్న ఎల్ నినో వాతావరణ పరిస్థితుల దృష్ట్యా,భవిష్యత్తులో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా మున్సిపల్ కార్యాలయంలో పెద్దపల్లి మినరల్ వాటర్ ప్లాంట్ అసోసియేషన్ సభ్యులతో ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మినరల్ వాటర్ ప్లాంట్ యజమానులు ఎట్టి పరిస్థితుల్లోనూ నీటిని వృధా చేయవద్దని స్పష్టం చేశారు.భూగర్భ జలాల పరిరక్షణ,స్థిరీకరణ కోసం ప్రతి ప్లాంట్ వద్ద తప్పనిసరిగా ఇంకుడు గుంతను నిర్మించుకోవాలని ఆదేశించారు.ఇందుకు 15 రోజుల గడువు విధిస్తున్నట్లు తెలిపారు.నిర్దిష్ట గడువులోగా నిబంధనలు పాటించకుండా, ప్లాంట్ల నుంచి వచ్చే వ్యర్థ జలాలను డ్రైనేజీల్లోకి వదిలితే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.మున్సిపల్ అధికారుల ఆదేశాలపై మినరల్ వాటర్ అసోసియేషన్ సభ్యులు సానుకూలంగా స్పందిస్తూ అధికారులకు పూర్తిగా సహకరిస్తామని,త్వరలోనే ఇంకుడు గుంతల నిర్మాణం పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్‌తో పాటు మినరల్ వాటర్ ప్లాంట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ హరీష్,అసోసియేషన్ సభ్యులు,పట్టణంలోని పలు వాటర్ ప్లాంట్ల యజమానులు పాల్గొన్నారు.

పట్టణ ప్రజలు నీటిని వృధా చేస్తే జరిమానా తప్పదు

-మున్సిపల్ వైర్మన్ ...మున్సిపల్ కమిషనర్

ప్రస్తుతం కొనసాగుతున్న ఎల్ నినో వాతావరణ పరిస్థితులను అర్థం చేసుకొని పట్టణ ప్రాంత ప్రజలు నీరు వృధా చేయకూడదని మున్సిపల్ చైర్మన్ నూగిళ్ళ మల్లయ్య, కమిషనర్ ఆకుల వెంకటేష్ పేర్కొన్నారు. పెద్దపల్లి మున్సిపల్ పట్టణ ప్రాంతంలో నీటి సరఫరా ప్రతిరోజు జరుగుతుందని, కానీ ప్రస్తుత కరువు పరిస్థితిని దృష్టిలో పెట్టుకొని పట్టణ ప్రజలు నీటిని ఆధా చేయాలని,అనవసరంగా నీరు వృధా చేయకూడదని,నల్ల నీటిని డ్రైనేజీలో వదలరాదని,ఎవరైనా నీటిని వృధా చేస్తే 5వేల వరకు జరిమానా విధిస్తామని అదేవిధంగా నల్ల కనెక్షన్ తొలగిస్తామని పేర్కొన్నారు.

ఇది కాలం తెచ్చిన కరువు కాదు కాంగ్రెస్ తెచ్చిన కరువే

బీఆర్ఎస్ నాయకురాలు దాసరి ఉష - 400 కి.మీ మహా సైకిల్ యాత్రకు సంపూర్ణ మద్దతు

పెద్దపల్లి,అక్టోబర్ 30:(ప్రజాకలం జిల్లాప్రతినిధి)

కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు,రైతాంగ వ్యతిరేక చర్యల వల్ల రాష్ట్రంలో మళ్లీ కరువు ఛాయలు అలుముకుంటున్నాయని పెద్దపల్లి బీఆర్ఎస్ నాయకురాలు దాసరి ఉష ఆందోళన వ్యక్తం చేశారు.కాంగ్రెస్ పాలనలో గోసపడుతున్న అన్నదాతలను చైతన్యవంతం చేసేందుకు బీఆర్ఎస్ యువజన నాయకులు కాళేశ్వరం నుండి ఎర్రవెల్లి వరకు చేపట్టిన 400 కిలోమీటర్ల 'మహా సైకిల్ యాత్ర'కు ఆమె తన సంపూర్ణ మద్దతు ప్రకటించారు.ఈ సందర్భంగా దాసరి ఉష మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రస్తుతం కనిపిస్తున్నది కాలం తెచ్చిన కరువు కాదని,పూర్తిగా కాంగ్రెస్ పార్టీ తెచ్చిన మానవ నిర్మిత కరువేనని మండిపడ్డారు. పక్క రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణలో వర్షపాత లోటు తక్కువగా ఉన్నప్పటికీ, కాంగ్రెస్ అసమర్థ పాలన వల్లే నేడు సాగునీటి ఎద్దడి ఏర్పడిందని విమర్శించారు.కేసీఆర్ పై రాజకీయ కక్షతోనే కాళేశ్వరం ప్రాజెక్టును మరమ్మతులు చేయకుండా మూలనపడేశారని,ప్రాజెక్టును నిర్లక్ష్యం చేయడం వల్ల సాగునీరందక పంట పొలాలు ఎండిపోతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు.యాసంగి సాగు కోసం విత్తనాలు ఇచ్చే ముందే,సాగునీరు మరియు కరెంట్ అడగబోమని రైతుల వద్ద బలవంతంగా సెల్ఫ్ డిక్లరేషన్ ఫారాలపై సంతకాలు



చేయించుకోవడం ప్రభుత్వ దౌర్భాగ్యానికి నిదర్శనమని ఆమె ధ్వజమెత్తారు.కేసీఆర్ హయాంలో నిరంతర విద్యుత్,రైతుబంధు,పుష్కలంగా సాగునీరు అంది వ్యవసాయం పండుగలా సాగిందని, నేడు మళ్లీ రైతులు తమ సొంత పొలాల్లోనే కూలీలుగా మారే దుస్థితి దాపురించిందని ఆవేదన వ్యక్తం చేశారు.తుఫాను వర్షాలు, ప్రతికూల వాతావరణాన్ని సైతం లెక్కచేయకుండా అన్నదాతల హక్కుల కోసం బొడ్డు రవీందర్, ఉప్పు రాజకుమార్ తదితర బీఆర్ఎస్ నాయకులు ప్రాణాలను పణంగా పెట్టి ఈ మహా సైకిల్ యాత్ర చేస్తున్నారని కొనియాడారు.ప్రజా సంక్షేమాన్ని గాలికొదిలేసి సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటనలకే పరిమితమయ్యారని విమర్శిస్తూ,ప్రజలను మోసం చేస్తున్న ఈ ప్రభుత్వానికి సైకిల్ యాత్ర ద్వారా ప్రజలే గట్టి గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో వేంపేట విద్యార్థి ప్రతిభ



మెట్‌పల్లి రూరల్,అక్టోబర్ 30: (ప్రజాకలం); జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలం వేంపేట గ్రామానికి చెందిన మార్గదర్శి కాన్వెంట్ పాఠశాల మూడో తరగతి విద్యార్థి పెంటపర్తి శ్రేయాస్ రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభ కనబరిచాడు. ఇటీవల కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో నిర్వహించిన రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో 60 మీటర్ల పరుగు పందెం పోటీలో చక్కటి ప్రతిభ కనబరిచి ప్రశంసలు అందుకున్నాడు. ఈ సందర్భంగా పాఠశాలలో శ్రేయాస్‌ను కరస్పాండెంట్ ఏలేటి లక్ష్మి శాలువాతో సన్మానించి, రాష్ట్రస్థాయిలో అందుకున్న ప్రశంసాపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులు చిన్నతనం నుంచే ఆటలపై ఆసక్తి పెంచుకోవాలని, క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసం, ఉత్సాహం, జ్ఞాపకశక్తిని పెంపొందిస్తా యని అన్నారు. పాఠశాలలో ప్రతిరో జూ సాయంత్రం నిర్వహించే ఆటల వల్లే శ్రేయాస్ రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబరి చాడని పేర్కొన్నారు. విద్యార్థిని ప్రోత్స హించిన తల్లిదండ్రులను అభినందించారు.

పోలీస్ ఉద్యోగాల అభ్యర్థులకు

ఉచిత స్టడీ మెటీరియల్ పంపిణీ



మెట్‌పల్లి టౌన్ ప్రతినిధి అక్టోబర్ 30 (ప్రజాకలం):- పట్టణంలో ఎస్సై, కానిస్టేబుల్ ఉద్యోగాలకు సిద్ధమవుతున్న నిరుద్యోగ యువతకు రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్, కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు ఉచితంగా స్టడీ మెటీరియల్ అందజేశారు. ఈ సందర్భంగా నర్సింగరావు మాట్లాడుతూ.. నిరుద్యోగ యువత పోటీ పరీక్షల్లో ప్రతిభ కనబరిచి ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాలనే లక్ష్యంతో పట్టుదలతో చదవాలని సూచించారు. యువతకు అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు తాము ఎల్లప్పుడూ ముందుంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో, మున్సిపల్ చైర్‌పర్సన్ మైలారపు లింబాద్రి, కమిషనర్ శ్రీనివాస్ గౌడ్, కౌన్సిలర్లు బత్తుల నరేశ్, అజయ్, నునుగొండ నరేశ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు ముఖీమ్, కో-ఆప్షన్ సభ్యులు మాధవరెడ్డి, గజం రవి, జగిత్యాల జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి బర్ల సూరి తదితరులు పాల్గొన్నారు.

టీజేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కంతి మోహన్ రెడ్డికి సన్మానం



మెట్‌పల్లి టౌన్ ప్రతినిధి అక్టోబర్ 30 (ప్రజాకలం):-తెలంగాణ జనసమితి (టీజేఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఇటీవల నియమితులైన కంతి మోహన్ రెడ్డిని శుక్రవారం మెట్‌పల్లి న్యాయవాదులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా శాలువా కప్పి, పూలమాల వేసి అభినందనలు తెలిపారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏలేటి రాంరెడ్డి మాట్లాడుతూ, తమతోటి న్యాయవాది కంతి మోహన్ రెడ్డి టీజేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమితులు కావడం ఎంతో గర్వకారణమన్నారు.భవిష్యత్తులో ఆయన మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షురాలు మెడిచెల్మల సుమలత, ప్రధాన కార్యదర్శి నల్ల రాజేందర్, న్యాయవాదులు గంద్ర ప్రవీణ్ రావు, ఎండీ వల్లియొద్దీన్, గడ్డం శంకర్ రెడ్డి, బద్దం లక్ష్మారెడ్డి, పోలకొండ దయాకర్ వర్మ, నాంపల్లి మరుతి, పసునూరి సుదర్శన్, మామిడిపల్లి విజయలక్ష్మి, నేరెళ్ల శ్రీధర్, తెడ్డు ఆనంద్, పసునూరి శ్రీనివాస్, నీరటి రమణ, కోల అశోక్, చింతకుంట శంకర్, టీజేఎస్ నాయకులు చిలువేరి నందగోపాల్, ఏశాల గంగారెడ్డి, గజ్జి రాజేందర్, కంతి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

భూ పట్టా వివరాలు వెల్లడించాలని తహసీల్దార్‌కు వినతి..



మల్లాపూర్, అక్టోబర్ 30 (ప్రజాకలం ప్రతినిధి): మల్లాపూర్ మండలం లోని నడికుడ వునరావాన గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 299/2/1లో చంద నర్సారెడ్డికి మంజూరైన డి-1 పట్టాకు సంబంధించిన పూర్తి వివరాలు వెల్లడించాలని సర్పంచ్ తూర్పు సమత రాజన్న, ఉప సర్పంచ్ మారుతి ఆధ్వర్యంలో గ్రామస్థులు మల్లాపూర్ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. పట్టా ఎప్పుడు, ఎవరి అనుమతితో మంజూరైంది? ఎంత భూమి కేటాయించారు? అనే వివరాలతో పాటు సంబంధిత భూ రికార్డుల ప్రతులు అందించాలని కోరారు.ఈ కార్యక్రమంలో వి.డి.సి. చైర్మన్ రవీందర్ రెడ్డి, హన్మంతు తదితరులు పాల్గొన్నారు.

ఖేతీ బచావో అభియాన్ అవగాహన సదస్సు

- వ్యవసాయ అధికారి రాజ్ కుమార్



ఇబ్రహీంపట్నం అక్టోబర్ 30(ప్రజా కలం ప్రతినిధి) జగిత్యాల్ జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలోప్రస్తుత ఎల్‌నినో పరిస్థితులు, ఖరీఫ్‌లో నమోదైన తక్కువ వర్షపాతం, భూగర్భ జలాల లభ్యత తగ్గడం, అక్టోబర్‌లోనూ అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్న నేపథ్యంలో రైతులు వరికి ప్రత్యామ్నాయంగా ఆరుతడి పంటల సాగుపై దృష్టి సారించాలని మండల వ్యవసాయ అధికారి రాజ్‌కుమార్ సూచించారు. ఇబ్రహీంపట్నం మండలంలోని వర్షకొండ గ్రామంలోనిర్వహించిన ఖేతీ బచావో అభియాన్ కార్యక్రమంలో భాగంగా రైతులకు పంటల మార్పిడి, నీటి పొదుపు పద్ధతులపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా రాజ్‌కుమార్ మాట్లాడుతూ, రైతులు తమ భూముల స్వభావం, నీటి లభ్యతను బట్టి కంది, పెసర, మినుము, శనగ, జొన్న, మొక్కజొన్నతో పాటు నువ్వులు, కుసుమ వంటి నూనెగింజల పంటలు సాగు చేయాలని సూచించారు. అలాగే తక్కువ పంటకాలం కలిగిన కూరగాయలు, ఆకుకూరల సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. వీటి ద్వారా నీటి వినియోగం, సాగు ఖర్చులు తగ్గించడంతో పాటు తక్కువ సమయంలో ఆదాయం పొందవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పొనకంటి వెంకట్, వ్యవసాయ విస్తరణ అధికారి సాయికృప మరియు రైతులు పాల్గొన్నారు.

ఎస్సారెస్పీ కాలువలోకి మురుగునీరు పైపుల తొలగింపునకు చర్యలు

అధికారుల దృష్టికి తీసుకెళ్లిన సర్పంచ్ సంఘ రమేష్ యాదవ్

గ్రామ పంచాయతీ సిబ్బంది సహకారం తో చర్యలు చేపట్టిన ఇరిగేషన్ శాఖ



ఎండపల్లి, అక్టోబర్ 30 : (ప్రజా కలం ప్రతినిధి)

మండలంలోని రాజారాంపల్లి గ్రామ పరిధిలోని ఎస్సారెస్పీ డి 83/బీ సాగునీటి కాలువ లోకి మరుగుదొడ్ల మురుగు నీరు చేరుతున్న సమస్య పై గ్రామ సర్పంచ్ సంగ రమేష్ స్పందించారు. ఈ విషయాన్ని ఎస్సారెస్పీ కాలువ అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో శుక్రవారం రోజున అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలన చేపట్టారు. కాలువలోకి మరుగునీరు వెళ్లేలా ఏర్పాటు చేసిన పైపు లైన్లను గుర్తించి గ్రామ పంచాయతీ సిబ్బంది సహకారం తో చర్యలు చేపట్టారు. భవిష్యత్తు లో ఎవరైనా తిరిగి కాలువలోకి మురుగునీరు విడుదల చేస్తే కఠిన చర్యలు తీసు కుంటామని ఎస్సారెస్పీ అధికారులు హెచ్చ రించారు. సమస్య పరిష్కారానికి స్పందించిన సర్పంచ్‌కు గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు.

ఐజేయూ నూతన కార్యవర్గానికి ఘన సన్మానం



మల్లాపూర్, అక్టోబర్ 30 (ప్రజాకలం ప్రతినిధి): ప్రజా సమస్యల పరిష్కారంలో పాత్రికేయుల కృషి ఎంతో గొప్పదని కొత్త ధాంరాజ్‌పల్లి సర్పంచ్ ఎగ్గరపు లింబద్రి అన్నారు. ఈ మేరకు మల్లాపూర్ మండల టీయూడబ్ల్యూజే (ఐజేయూ) నూతన కార్యవర్గ సభ్యులను కాంగ్రెస్ నాయకులతో కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు సభావత్ మల్లేష్, ఉపాధ్యక్షుడు బద్దం రామ్ చందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి బద్దం శ్రీనివాస్ రెడ్డి, సంయుక్త కార్యదర్శి మాధుకర్, గౌరవ అధ్యక్షుడు ర్యాగల్ల వెంకటేశ్వర్, సలహాదారు గుగ్గిళ్ల శేఖర్, శ్యాం లను శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లడంలో పాత్రికేయులు కీలక పాత్ర పోషించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బద్దం విజయ నర్సారెడ్డి, బద్దం శంకర్ రెడ్డి, బద్దం వెంకట్ రెడ్డి, ఎగ్గరపు రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

కాసిరెడ్డి నరేష్ రెడ్డికి మాజీ మంత్రి రెడ్యానాయక్ నివాళులు



మరిపెడ ప్రతినిధి ప్రజా కలం న్యూస్ అక్టోబర్ 30 మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం గుండెపుడి గ్రామానికి చెందిన కాసిరెడ్డి నరేష్ రెడ్డి వృత్తిరీత్యా విజయవాడలో నివాసం ఉంటున్నారు. ఈ క్రమంలో విజయవాడలో ఉన్న సమయంలో అకస్మాత్తుగా గుండెపోటుతో మృతి చెందారు. ఆయన భౌతికకాయాన్ని స్వగ్రామమైన గుండెపుడికి తీసుకు రావడం జరిగింది. గ్రామస్తుల ద్వారా విషయం తెలుసుకున్న మాజీ మంత్రి రెడ్యానాయక్ గుండెపుడి గ్రామంలోని నరేష్ రెడ్డి నివాసానికి చేరుకుని ఆయన భౌతికకాయానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ లకావత్ రవికుమార్, మాజీ సర్పంచ్ నూకల కిషన్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ పులుసు చిరంజీవి, ఉపసర్పంచ్ గడ్డం ఉపేందర్ రెడ్డి, బోడపట్ల సుధాకర్, కోట వెంకటరెడ్డి, యామిని రామ్మూర్తి, జగదీశ్వర్ రెడ్డి, బోడపట్ల రవి, గంట్ల పాపిరెడ్డి, నాగినబోయిన నరసయ్య, పులుసు వెంకన్న, వడ్లకొండ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.


యూత్ అధ్యక్షుడిగా పొలాస అశోక్ కుమార్

- నియామక పత్రం అందజేసిన చామకూర మల్లారెడ్డి

కాప్రా అక్టోబర్ 30 (ప్రజాకలం న్యూస్) మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ కీసర సర్కిల్ జవహర్ నగర్ డివిజన్-3 BRS యూత్ అధ్యక్షుడిగా పొలాస అశోక్ కుమార్ నియమితులయ్యారు. మాజీ మంత్రి. ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఈ నియామకం జరిగింది. ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. కార్యక్రమంలో మాజీ మేయర్ మేకల కావ్య, పార్టీ డివిజన్ అధ్యక్షుడు కొండల్ ముదిరాజ్, మాజీ కార్పొరేటర్ పల్లపు రవి, నాయకులు సింగన్న బాలరాజ్, సిద్దులు, పొలాస సాయి కుమార్, బండి నవీన్, కృష్ణ యాదవ్, పల్లపు ప్రశాంత్, రాజు, అజీం, రవి పాల్గొన్నారు. మహిళా విభాగం నుంచి మల్లమ్మ, యాకమ్మ, యదాలక్ష్మి, కళావతి, లక్ష్మి, విమల, మహేశ్వరి, ధనలక్ష్మి హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా. యువజన సంఘం అధ్యక్షునిగా ఏకగ్రీవమైన పొలాస అశోక్ కుమార్ మాట్లాడుతూ తనకు అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తానని తెలిపారు. పార్టీ బలోపేతానికి, యువతను పార్టీ వైపు ఆకర్షించేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యంతో రాష్ట్రంలో కరువు

సెస్ డైరెక్టర్ ఆకుల గంగారాం - రుద్రంగిని కరువు మండలంగా ప్రకటించాలని తాసీల్దారు వినతి



రుద్రంగి, అక్టోబర్ 30, (ప్రజాకలం ప్రతినిధి)

ప్రస్తుత పరిస్థితులు ఎల్నీనోతో వచ్చిన కరువు కాదని కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యంతో రాష్ట్రానికి వచ్చిన కరువని సెస్ డైరెక్టర్ ఆకుల గంగారాం అన్నారు. శుక్రవారం రుద్రంగి మండల కేంద్రంలో సెస్ డైరెక్టర్ ఆకుల గంగారాం ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు రుద్రంగి మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని తాసీల్దార్ పుష్పలతకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రస్తుత వర్షాభావ పరిస్థితిలో మెట్ట ప్రాంతమైన రుద్రంగి, ఉమ్మడి మానాల గ్రామాల్లో భూగర్భజలాలు లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం జిల్లాలో కేవలం రెండు మండలాలనే కరువు మండలలుగా ప్రకటించి రుద్రంగి మండలాన్ని కరువు మండలంగా ప్రకటించకపోవడం బాధకరమన్నారు. వర్షం మీద ఆధారపడి ఉన్న రుద్రంగి మండలంలో చెరువులు, కుంటలను నింపేందుకు ఎలాంటి ప్రత్యామ్నాయం లేని రుద్రంగిని ఎందుకు కరువు మండలంగా ప్రకటించడం లేదో ప్రజాప్రతినిధులు, అధికారులే మండల ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. రెండు రోజుల క్రితం రుద్రంగిలోని అటవీ ప్రాంతంలోని కుంటలు, చెరువులు, వాగులను పరిశీలించిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కు తన స్వంత గ్రామంలో భూగర్భజలాలు లేక పంటలు ఎండిపోతున్న పరిస్థితులు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. కొందరు రైతులు తమ పంటలను కాపాడుకునేందుకు ట్యాంకర్లు, జనరేటర్ సహాయంతో పంటలకు నీరు అందిస్తున్నారన్నారు. ఎల్నీనో గురించి ప్రభుత్వానికి ముందే తెలిసినప్పటికి కాలేశ్వరంలో ప్రాజెక్టులో పుష్కలంగా నీరు ఉన్నా కేవలం కెసిఆర్ పై నింద మోపడానికి మాత్రమే సీఎం రేవంత్ రెడ్డి రైతులకు అవసరమైన సమయంలో సాగు నీరు అందించలేదన్నారు. స్థానిక ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ప్రత్యేక చొరువ తీసుకొని రుద్రంగి మండలాన్ని కరువు మండలంగా

ప్రకటించి మండలంలో అధికారులతో సర్వే చేయించి పంట నష్టపోయిన రైతులకు న్యాయం చేయాలన్నారు. ఇప్పటికైన ప్రభుత్వం చిత్తశుద్ధితో ఆలోచించి గోదావరి జలాలలో చెరువులను నింపి సాగు, త్రాగు నీరు అందించేందుకు ఆలోచనలు చేయాలన్నారు. మండలంలో ఇప్పటి వరకు ఎక్కడ కూడా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించలేదన్నారు. కొందరు రైతులు తమ పంటను దళారులకు అమ్ముకుంటున్నారన్నారు. దళారీ వ్యవస్థను అరికట్టి రైతులకు మద్దతు ధర ప్రకటించి ధాన్యాన్ని కొనుగోలు చేయాలన్నారు. రుద్రంగి మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని లేని పక్షంలో రైతుల పక్షాన పెద్ద ఎత్తున నిరసనలు చేపడుతామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గంగం మహేష్, చెప్యాల గణేష్, ఉప్పులూటి గణేష్, అల్లూరి గంగారెడ్డి, ఆకుల గంగాధర్, లావుడ్య మోహన్, గడ్డం మహేందర్, సింగారపు గంగారెడ్డి, మల్లయ్య, విజయ్, నరేందర్లతో పాటు తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోతే కఠిన చర్యలు

ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్ - పెద్దపల్లిలో పోలీసుల విస్తృత తనిఖీలు

100కు పైగా వాహనాలకు జరిమానాలు..అవగాహన కల్పించిన పోలీసులు



పెద్దపల్లి,అక్టోబర్ 30:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి)

ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే ఉపేక్షించేది లేదని,ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ రూల్స్ తప్పనిసరిగా పాటించాలని ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్ స్పష్టం చేశారు.శుక్రవారం జిల్లా కేంద్రంలోని కమాన్ చౌరస్తా వద్ద ట్రాఫిక్ విభాగం ఆధ్వర్యంలో ప్రత్యేక ఎన్‌ఫోర్స్‌మెంట్ డ్రైవ్ నిర్వహించారు.పెద్దపల్లి,రామగుండం,మంచిర్యాల సీఐలు, ఎస్సైలు,పోలీస్ సిబ్బంది సమన్వయంతో పట్టణంలో విస్తృతంగా వాహనాల తనిఖీలు చేపట్టారు.ఈ సందర్భంగా ఏసీపీ శ్రీనివాస్ మాట్లాడుతూ నంబర్ ప్లేట్లు లేకుండా తిరుగుతున్న వాహనాలు, మైనర్ డ్రైవింగ్,హెల్మెట్ లేకుండా ప్రయాణించడం,ట్రిపుల్ రైడింగ్, సీట్ బెల్ట్ ధరించకపోవడం,రోడ్లపై ఇష్టారాజ్యంగా వాహనాలు నిలపడం మరియు డ్రంక్ అండ్ డ్రైవ్‌లకు పాల్పడే వారిపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు.ఈ క్రమంలో నిబంధనలు ఉల్లంఘించిన 100కు పైగా వాహనాలను గుర్తించి జరిమానాలు విధించినట్లు పేర్కొన్నారు.రోడ్డు ప్రమాదాల కారణంగా రోజూ ఎందరో ప్రాణాలు కోల్పోతున్నారని, సరైన జాగ్రత్తలు తీసుకోకపోవడం వల్లే ఇలాంటి విషాదాలు చోటుచేసుకుంటున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.వాహనదారులు తమ వెంట ఆర్సీ,ఇన్సూరెన్స్,డ్రైవింగ్ లైసెన్స్ వంటి ధ్రువీకరణ పత్రాలను తప్పనిసరిగా ఉంచుకోవాలని సూచించారు.ప్రతి ఒక్కరూ బాధ్యతతో వ్యవహరించి, సురక్షిత ప్రయాణాన్ని కొనసాగిస్తూ తమ ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలను కాపాడాలని కోరారు.ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.ఈ తనిఖీల్లో పెద్దవల్లి ట్రాఫిక్ సీఐ బి.శ్రీనివాస్ గౌడ్,మంచిర్యాల,గోదావరిఖని ట్రాఫిక్ సీఐలు,ఎస్సైలు మరియు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.


నల్లబెల్లి గ్రామం లో 'ఖేతీ బచావో అభియాన్' కార్యక్రమం



అక్టోబర్ 30 ప్రజాకలం ప్రతినిది: (వరంగల్ /వర్ధన్నపేట)

ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో తక్కువ నీటి అవసరమయ్యే ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలి – వ్యవసాయ శాఖ అధికారులువర్ధన్నపేట, అక్టోబర్ 30: నల్లబెల్లి గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద శుక్రవారం 'ఖేతీ బచావో అభియాన్' మరియు ఎల్‌నినో ప్రభావం వల్ల రబీ పంటలపై కలిగే ప్రభావాలపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి పి. విజయ్ కుమార్, జాతీయ ఆహార భద్రత మిషన్ (ఎన్ ఎఫ్ యస్ యన్ ఎం) కన్సల్టెంట్ సారంగం,ూజూ ఆర్. శిరీష, ఉప సర్పంచ్ ఎం. దేవేందర్, ూజూ డైరెక్టర్లు, విద్యుత్ శాఖ, పశువైద్య శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు మరియు రైతులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, ఎల్‌నినో ప్రభావంతో రానున్న రోజుల్లో ఉష్ణోగ్రతలు పెరిగి, భూగర్భ జలమట్టాలు తగ్గే అవకాశం ఉన్నందున రైతులు నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకొని పంటల ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు. అధిక నీరు అవసరమయ్యే వరి, మొక్కజొన్న పంటల సాగును తగ్గించి, తక్కువ నీటితో సాగు చేయగల పెనర, మినుము, బొబ్బర్లు, శనగ, కంది వంటి పప్పుధాన్యాలతో పాటు వేరుశనగ, నువ్వులు, కుసుమ, ప్రొద్దుతిరుగుడు, ఆముదం వంటి నూనెగింజల పంటలను ప్రత్యామ్నాయంగా సాగు చేయాలని తెలిపారు. అలాగే కోతుల బెడదను తట్టుకునే ఆయిల్‌పామ్, కుసుమ, ఆముదం వంటి పంటల సాగుపై కూడా రైతులు ఆలోచించాలని సూచించారు.అనంతరం ఖేతీ బచావో అభియాన్ ముఖ్య ఉద్దేశాలను వివరిస్తూ, ప్రకృతి వ్యవసాయం ద్వారా నేల ఆరోగ్యాన్ని పరిరక్షించడం, నేలలో తేమశాతాన్ని కాపాడటం, నాణ్యమైన పంట ఉత్పత్తులను సాధించడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. మట్టి నమూనాల సేకరణ విధానం, భూసార పరీక్షల ప్రాముఖ్యతను వివరిస్తూ, పరీక్ష ఫలితాల ఆధారంగా నేలలోని పోషకాల స్థితిని తెలుసుకొని సమతుల్యంగా ఎరువులు వినియోగించాలని సూచించారు. వివిధ శాఖల అధికారులు తమ శాఖల ద్వారా రైతులకు అందిస్తున్న సేవలు, పథకాల గురించి వివరించారు. అదేవిధంగా, ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి పథకం 24వ విడత నిధుల విడుదల కార్యక్రమాన్ని ఇల్లంద మరియు వర్ధన్నపేట రైతు వేదికల్లో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రసారం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

పట్టభద్రుల ఓటరు నమోదుకు విశేష స్పందన!



అక్టోబర్ 30 ప్రజాకలం ప్రతినిధి: (వరంగల్ /వర్ధన్నపేట)

ఖమ్మం-నల్గొండ-వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు కార్యక్రమానికి పట్టణంలో విశేష స్పందన లభిస్తోందని పీఏసీఎస్ డైరెక్టర్ కొండేటి మహేందర్ పేర్కొన్నారు. పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఈగ దామోదర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత ఓటరు నమోదు ప్రక్రియను పీఏసీఎస్ డైరెక్టర్ కొండేటి మహేందర్, పట్టణ మహిళా నాయకురాలు లింగం రజిత రెడ్డి సందర్శించారు.ఈ సందర్భంగా మహేందర్ మాట్లాడుతూ.. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదుకు ఆసక్తి చూపుతున్న అర్హులైన అభ్యర్థుల నుంచి అనూహ్య స్పందన లభిస్తోందని తెలిపారు. పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఈగ దామోదర్ ఆధ్వర్యంలో ఉచితంగా నమోదు ప్రక్రియ చేపట్టడం అభినందనీయమన్నారు. ఇంకా ఓటరుగా నమోదు చేసుకోని అర్హులైన పట్టభద్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ పేర్లను ఓటరు జాబితాలో నమోదు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ కొండేటి మహేందర్, మహిళా నాయకురాలు లింగం రజిత రెడ్డి, ఐత సుధాకర్, గౌరవ్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విజ్డమ్ విద్యార్థిని ఎంపిక



మెట్‌పల్లి టౌన్ ప్రతినిధి అక్టోబర్ 30 (ప్రజాకలం):- కరీంనగర్ జిల్లాలో నిర్వహించిన ఎస్‌జీఎఫ్ ఉమ్మడి జిల్లా క్రీడా పోటీల్లో విజ్డమ్ హైస్కూల్ విద్యార్థిని వెలగందుల హరిణి ప్రతిభ కనబరిచింది. అండర్-14 విభాగంలో షాట్‌పుట్ పోటీలో ప్రథమ స్థానం సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. త్వరలో హనుమకొండలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో హరిణి పాల్గొననుంది. ఈ సందర్భంగా పాఠశాల పీఈటీలు హరీష్, సాయికుమార్, భూమిక వివరాలు వెల్లడించగా, పాఠశాల కరస్పాండెంట్ ఎన్నమనేని రామారావు విద్యార్థినిని అభినందించారు.

మెట్‌పల్లి మున్సిపల్ కౌన్సిల్ సమావేశానికి కోరం లేక నిలిచిన అజెండా



మెట్‌పల్లి:(కోరుట్ల) అక్టోబర్ 30(ప్రజా కలం) మెట్‌పల్లి మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం కోరం లేక వాయిదా పడింది. శుక్రవారం ఉదయం 11 గంటలకు మున్సిపల్ చైర్‌పర్సన్ మైలారపు లింబాద్రి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. అయితే సమావేశానికి సరిపడా కౌన్సిలర్లు హాజరుకాకపోవడంతో కోరం లేకుండా పోయింది. దీంతో అజెండాలోని అంశాలపై చర్చించి తీర్మానాలు చేయకుండానే సమావేశం ముగిసింది. నిబంధనల ప్రకారం వాయిదా వేసిన సమావేశాన్ని నిర్వహించినప్పటికీ, కోరం లేకపోవడంతో ఎలాంటి నిర్ణయాలు తీసుకోలేకపోయినట్లు మున్సిపల్ కమిషనర్ వెల్లడించారు.

ఖేత్ బచావో అభియాన్‌పై రైతులకు అవగాహన కార్యక్రమం



గొల్లపల్లి అక్టోబర్ 30 ప్రజాకలం ప్రతినిధి గొల్లపల్లి మండలంలోని శంకర్రావుపేట్ గ్రామంలో ఖేత్ బచావో అభియాన్ పై వ్యవసాయ అధికారి బోట్ల కరుణ రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బొట్ల కరుణ మాట్లాడుతూ, రైతులు పంటల సాగులో శాస్త్రీయ యాజమాన్య పద్ధతులను పాటిస్తూ భూసారాన్ని పరిరక్షించుకోవాలని సూచించారు. ఎరువులు, పురుగుమందులను అవసరానికి అనుగుణంగా సమతుల్యంగా వినియోగించి సాగు ఖర్చులను తగ్గించుకోవాలని తెలిపారు. ప్రస్తుత ఎల్ నినో ప్రభావంతో యాసంగిలో నీటి లభ్యత తగ్గే అవకాశం ఉన్నందున, రైతులు వరి సాగుకు బదులుగా తక్కువ నీటితో సాగయ్యే మొక్కజొన్న, పెసర, మినుము, వేరుశనగ, నువ్వులు, కూరగాయల పంటలను సాగు చేసుకోవాలని సూచించారు. అందుబాటులో ఉన్న నీటి వనరులను పొదుపుగా వినియోగించుకోవాలని రైతులకు వివరించారు.ఈ కార్యక్రమంలో ఏఈఓ వంశీ కుమార్, గ్రామ సర్పంచ్ గోలి గంగారెడ్డి,వార్డు సభ్యులు ,ప్రజాప్రతినిధులు , రైతులు తదితరులు పాల్గొన్నారు.

శేషంపల్లి స్టేజ్ వద్ద ఘోర రోడ్డు ప్రమాదం.. ఇద్దరు మృతి!



గద్వాల ప్రతినిధి, అక్టోబర్ 29 (ప్రజా కలం): జోగుళాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండలం శేషంపల్లి స్టేజ్ వద్ద గురువారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. గద్వాల నుండి అయిజ వైపు వెళ్తున్న హీరో హెచ్ఎఫ్ డీలక్స్ బైక్‌ను, అయిజ నుండి గద్వాల వైపు వస్తున్న ముగ్గురు ప్రయాణిస్తున్న పల్సర్ బైక్ ఢీకొట్టింది.ఈ ప్రమాదంలో పల్సర్ బైక్‌పై ప్రయాణిస్తున్న లోకేష్ (జూపాడు బంగ్లా, కర్నూలు జిల్లా), హీరో హెచ్ఎఫ్ డీలక్స్ బైక్‌పై వెనుక కూర్చున్న మహేష్ చికిత్స పొందుతూ గద్వాల ప్రభుత్వ ఆసుపత్రిలో మృతి చెందారు. మిగిలిన వారికి గాయాలయ్యాయి. ఈ ఘటనపై కేసు నమోదు చేస్తున్నట్లు మల్దకల్ ఎస్సై శ్రీహరి తెలిపారు.

ఎద్దులగూడెంలో భూముల రీ సర్వేకు శ్రీకారం!

గద్వాల ప్రతినిధి, అక్టోబర్ 30 (ప్రజా కలం):తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూ రీ సర్వే కార్యక్రమాన్ని శుక్రవారం జోగుళాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండలం ఎద్దులగూడెం గ్రామంలో తహసీల్దార్ ఝాన్సీ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు కురుమన్న పాల్గొన్నారు. గ్రామ రైతులతో కలిసి కొబ్బరికాయ కొట్టి రీ సర్వే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.ఈ సందర్భంగా తహసీల్దార్ ఝాన్సీ మాట్లాడుతూ.. మండలంలోని ఎద్దులగూడెంతో పాటు అన్ని గ్రామాల్లో వ్యవసాయ భూములు, నాలాలకు సంబంధించి రీ సర్వే నిర్వహించనున్నట్లు తెలిపారు. భూముల కొలతల ఆధారంగా సరిహద్దులను గుర్తించి భూ వివరాలను నిర్ధారించనున్నట్లు పేర్కొన్నారు. రైతులు, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ బీచుపల్లి, జీపీఓ లక్ష్మణ్, శేఖర్, జిల్లా మాజీ ఉపసర్పంచుల సంఘం అధ్యక్షుడు రంజిత్ కుమార్, గ్రామ రైతులు పాల్గొన్నారు.



పట్టభద్రుల ఓటరు నమోదే లక్ష్యం..

బీఆర్ఎస్ శ్రేణులు కదలాలి!

డా. అంజనేయ గౌడ్, బాను హనుమంతు నాయుడు

గద్వాల ప్రతినిధి, అక్టోబర్ 30 (ప్రజా కలం): జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండల కేంద్రంలో మహబూబ్‌నగర్–హైదరాబాద్–రంగారెడ్డి పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రక్రియపై బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మండల స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్‌చార్జి, స్పోర్ట్స్ అథారిటీ మాజీ చైర్మన్ డా. అంజనేయ గౌడ్ ముఖ్య అతిథిగా, గద్వాల నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి బాను హనుమంతు నాయుడు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రతి ఓటు ఎంతో కీలకమని, అర్హత కలిగిన ప్రతి పట్టభద్రుడిని ఓటరుగా నమోదు చేయించే బాధ్యత పార్టీ నాయకులు, కార్యకర్తలపై ఉందన్నారు. బీఆర్ఎస్ శ్రేణులందరూ సమన్వయంతో పనిచేస్తూ ఓటరు నమోదు ప్రక్రియను ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని సూచించారు. అర్హులైన పట్టభద్రులందరికీ ఓటరు నమోదుపై అవగాహన కల్పించాలని, ఈ ప్రక్రియలో ఎలాంటి నిర్లక్ష్యం చేయవద్దని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు, పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, యువజన నాయకులు, పట్టభద్రులు తదితరులు పాల్గొన్నారు.



రోజువారీ లక్ష్యాలను నిర్దేశించుకుని

రీ సర్వే పూర్తి చేయాలి



- జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

నిర్మల్ అక్టోబర్ 30ప్రజా కలం జిల్లా ప్రతినిధి)రోజువారీగా లక్ష్యాలను నిర్దేశించుకుని రీ సర్వే ప్రక్రియను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. శుక్రవారం నర్సాపూర్ (జి) మండలం చాక్ పల్లి గ్రామంలో కొనసాగుతున్న భూముల రీ సర్వే ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో చేపట్టిన భూముల రీ సర్వే వివరాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. మొత్తం రీ సర్వే చేయాల్సిన భూమి, పట్టా భూములు, ఎస్ఆర్ఎస్పీ భూములు, తదితర భూముల వివరాలు అడిగారు. భూముల హద్దుల గుర్తింపు పక్కాగా ఉండాలన్నారు. రీ సర్వే ప్రక్రియ పారదర్శకంగా పూర్తి చేయాలని పేర్కొన్నారు. సర్వే బృందం మొత్తం సభ్యుల పర్యవేక్షణలో, సంబంధిత రైతుల సమక్షంలో మాత్రమే సర్వే చేపట్టాలన్నారు. నిర్ణీత గడువులోగా రీ సర్వే ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. రీ సర్వే ప్రక్రియ చేపట్టే సిబ్బంది తప్పనిసరి ఎండ నుండి రక్షణ పొందేలా టోపీలు ధరించాలని సూచించారు. తాగునీరు తగినంత అందుబాటులో ఉంచుకోవాలని అన్నారు. ఓఆర్ఎస్ ద్రావణం తీసుకోవాలని పేర్కొన్నారు. అధికారులు, రైతుల పరస్పర సమన్వయంతో రీ సర్వే ప్రక్రియను పకడ్బందీగా పూర్తి చేయాలని తెలిపారు. స్థానిక రైతుతో మాట్లాడుతూ, ఆయన సాగు చేసిన పంటల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులు, నీటి కొరత అంశాలను బేరీజు వేసుకొని తక్కువ నీటితో పండే పంటలు మాత్రమే పండించాలని సూచించారు. వ్యవసాయ క్షేత్రంలో పంట కుంటలు (ఫామ్ పాండ్) లు నిర్మించుకోవాలని అన్నారు. పంట కుంటల నిర్మాణంతో భవిష్యత్తులో నీటి ఇబ్బందులు కలగకుండా ఉంటాయని చెప్పారు. రైతులు తమ పంట పొలాలలో పంట కుంటలు నిర్మించుకునే విధంగా అధికారులు ప్రోత్సహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ శ్రీకాంత్, సర్వేయర్ విలాస్, సర్పంచ్ సుధాకర్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పర్వతగిరి హైస్కూల్‌లో సామూహిక ఇంకుడు గుంత పనులు ప్రారంభం

- ముగ్గు పోసి పనులను ప్రారంభించిన సర్పంచ్ చిదురు శంకర్



(వరంగల్/పర్వతగిరి) అక్టోబర్ 30, ప్రజాకలం ప్రతినిధి: గ్రామంలో భూగర్భ జలాల మట్టాన్ని పెంపొందించడం, వర్షపు నీటిని సంరక్షించడం లక్ష్యంగా పర్వతగిరి గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో హైస్కూల్ ఆవరణలో సామూహిక ఇంకుడు గుంత నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ చిదురు శంకర్ ముగ్గు పోసి పనులను ప్రారంభించారు. వర్షపు నీరు వృథా కాకుండా ఇంకుడు గుంతల ద్వారా భూమిలోకి ఇంకేలా చర్యలు చేపడితే భూగర్భ జలమట్టం పెరుగుతుందని ఆయన తెలిపారు. నీటి సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి రఘు, ఉప సర్పంచ్ అనితా రమేష్, వార్డు సభ్యులు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సూర మల్లయ్య ప్రథమ వర్ధంతి కార్యక్రమంలో పాల్గొన్న మాజి ఫ్యాక్స్ చైర్మన్ ఎం.మనోజ్ గౌడ్

(వరంగల్/ పర్వతగిరిఅక్టోబర్ 30, ప్రజాకలం ప్రతినిధి: పర్వతగిరి మండలం గోపనపెల్లి గ్రామానికి చెందిన మాజీ ఉప సర్పంచ్ సూర అశోక్, మాజీ ఎంపీటీసీ సూర రమేష్ తండ్రి సూర మల్లయ్య ప్రథమ వర్ధంతి కార్యక్రమానికి మాజీ ప్యాక్స్ చైర్మన్ ఎం. మనోజ్ గౌడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా సూర మల్లయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ డైరెక్టర్ పట్టాపురం ఏకాంతం గౌడ్, గోపనపెల్లి బిఆర్ఎస్ మాజీ గ్రామ శాఖ అధ్యక్షులు నాంపల్లి సంపత్, గ్రామ పార్టీ అధ్యక్షులు బోయిని రవీందర్, వార్డు సభ్యులు కవిత రాజు, బోయిని రమేష్, బెల్లం వినోద్, గ్రామ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



పాగుంట స్వామి జాతర ఆహ్వాన పత్రిక ఆవిష్కరించిన ఎమ్మెల్యే బండ్ల!



గద్వాల ప్రతినిధి, అక్టోబర్ 30 (ప్రజా కలం):

జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కేటీ దొడ్డి మండలం పాగుంట (వెంకటాపురం) గ్రామంలో త్వరలో నిర్వహించనున్న శ్రీశ్రీశ్రీ పాగుంట లక్ష్మీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల (జాతర) పోస్టర్, ఆహ్వాన పత్రికను ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో పురేందర్ ఎమ్మెల్యేకు శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా సత్కరించారు.అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ ఏడాది కూడా స్వామివారి బ్రహ్మోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించాలని సూచించారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. బ్రహ్మోత్సవాలను విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని పిలుపునిచ్చారు. ఆలయ అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని తెలిపారు.

బ్రహ్మోత్సవాల కార్యక్రమాలు:

– నవంబర్ 9, సోమవారం – స్వామివారి కల్యాణ మహోత్సవం.

– నవంబర్ 10, మంగళవారం – రథోత్సవం.

– నవంబర్ 11, బుధవారం – స్వామివారి పల్లకీ సేవ.

ఈ కార్యక్రమంలో సర్పంచ్ తనయుడు తిమ్మారెడ్డి, మాజీ సర్పంచ్ అంజనేయులు, మాజీ కౌన్సిలర్ నరహరి శ్రీనివాసులు, మాజీ ఆలయ కమిటీ డైరెక్టర్ అభిలాష్, నాయకులు అజయ్, గోవిందు, చంద్రశేఖర్ రెడ్డి, ఆలూరు రామయ్య శెట్టి, కురుమన్న, ప్రవీణ్, ధర్మ నాయుడు, గోపి, వీరేష్ తదితరులతో పాటు ఆలయ ఈవో పురేందర్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్నికల సమరంలో కూటమి జోరు!

ఎటపాకలో అట్టహాసంగా విస్తృత ప్రచారం.. గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా కూటమి కదం

హోరెత్తిన కూటమి ఎంపీటీసీ అభ్యర్థి బాచినేని శ్రీకాంత్ ప్రచారం

ప్రజాకలం ప్రతినిధి, ఎటపాక, అక్టోబర్ 30:

పోలవరం జిల్లా రంపచోడవరం నియోజకవర్గం ఎటపాక మండలంలో స్థానిక సంస్థల ఎన్నికల ప్రచారం ఊపందుకుంది. ఎన్నికల సమరంలో భాగంగా , జనసేన, బీజేపీ బలపరిచిన తెలుగుదేశం పార్టీ ఎటపాక యం పీ టీ సీ అభ్యర్థి బాచినేని శ్రీకాంత్ ప్రచారం శుక్రవారం ఎటపాకలో కూటమి పార్టీలతో కూడిన కూటమి నాయకులు, కార్యకర్తలు శుక్రవారం ఎటపాకలో అట్టహాసంగా విస్తృత ప్రచారం నిర్వహించారు. భారీ సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పాల్గొనడంతో ఎటపాకలో ఎన్నికల సందడి నెలకొంది. ఎటపాక ప్రధాన రహదారుల మీదుగా సాగిన ప్రచార కార్యక్రమంలో కూటమి అభ్యర్థులు పాల్గొని ఓటర్లను కలుసుకున్నారు. ఇంటింటికీ వెళ్లి కూటమి అభ్యర్థులకు మద్దతు తెలిపి గెలిపించాలని ప్రజలను కోరారు. ఈ సందర్భంగా కూటమి నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తోందన్నారు. రంపచోడవరం నియోజకవర్గంలో చేపడుతున్న అభివృద్ధి పనులు స్థానిక ఎన్నికల్లో తమ అభ్యర్థులకు ప్రజల మద్దతు లభించేందుకు దోహదపడతాయని పేర్కొన్నారు. గ్రామాల అభివృద్ధి, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని, స్థానిక సమస్యల పరిష్కారానికి కూటమి అభ్యర్థులను గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఈ ప్రచార కార్యక్రమంలో కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు, ఎంపీటీసీ అభ్యర్థులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. శుక్రవారం ఎటపాకలో అట్టహాసంగా విస్తృత ప్రచారం నిర్వహించారు. భారీ సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పాల్గొనడంతో ఎటపాకలో ఎన్నికల సందడి నెలకొంది. ఎటపాక ప్రధాన రహదారుల మీదుగా సాగిన ప్రచార కార్యక్రమంలో కూటమి అభ్యర్థులు పాల్గొని ఓటర్లను కలుసుకున్నారు. ఇంటింటికీ వెళ్లి కూటమి అభ్యర్థులకు మద్దతు తెలిపి గెలిపించాలని ప్రజలను కోరారు. ఈ సందర్భంగా కూటమి నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తోందన్నారు. రంపచోడవరం నియోజకవర్గంలో చేపడుతున్న అభివృద్ధి పనులు స్థానిక ఎన్నికల్లో తమ అభ్యర్థులకు ప్రజల మద్దతు లభించేందుకు దోహదపడతాయని పేర్కొన్నారు. గ్రామాల అభివృద్ధి, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని, స్థానిక సమస్యల పరిష్కారానికి కూటమి అభ్యర్థులను గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఈ ప్రచార కార్యక్రమంలో కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు, ఎంపీటీసీ అభ్యర్థులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



నందిగామ గ్రామంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విస్తృత ప్రచారం!

మాజీ ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం



ప్రజాకలం ప్రతినిధిఎటపాక, అక్టోబర్ 30: పోలవరం జిల్లా రంపచోడవరం నియోజకవర్గం ఎటపాక మండలం నందిగామ గ్రామంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచారం జోరందుకుంది. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలను పురస్కరించుకుని శుక్రవారం మాజీ ఎమ్మెల్యే, రంపచోడవరం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌ఛార్జ్ నాగులపల్లి ధనలక్ష్మి ఆధ్వర్యంలో విస్తృత ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగులపల్లి ధనలక్ష్మి గ్రామంలోని ఇంటింటికీ తిరుగుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ విజయమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేయాలని, నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ ప్రచార కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, మండల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, గ్రామ పెద్దలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. నాయకులు, కార్యకర్తల ఉత్సాహంతో నందిగామ గ్రామంలో ప్రచార కార్యక్రమం కొనసాగింది.

జిల్లా యంత్రాంగం సమన్వయంతో పనిచేయాలి

- తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి

- ప్రభుత్వ విప్ శ్రీ యెన్నం శ్రీనివాస్ రెడ్డి

మహబూబ్ నగర్ ప్రజా కలం ప్రతినిధి అక్టోబర్ 30:

రాబోయే రోజుల్లో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా జిల్లా యంత్రాంగం ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ప్రభుత్వ విప్, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే శ్రీ యెన్నం శ్రీనివాస్ రెడ్డి లి అధికారులకు సూచించారు. భవిష్యత్తులో కరువు పరిస్థితులు, నీటి కొరత వంటి సమస్యలు ఎదురైనా ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ శ్రీమతి ఖుష్బూ గుప్తా అధ్యక్షతన నిర్వహించిన సమీక్ష సమావేశంలో జిల్లా, మండల, గ్రామస్థాయి అధికారులతో తాగునీటి సరఫరా, నీటి వనరుల లభ్యత, వేసవిలో ఎదురయ్యే సమస్యలు, వాటి పరిష్కారానికి చేపట్టాల్సిన ముందస్తు చర్యలపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ మాట్లాడుతూ, జిల్లాలో ఎక్కడెక్కడ తాగునీటి కొరత ఏర్పడే అవకాశం ఉందో ముందుగానే గుర్తించాలని సూచించారు. ముఖ్యంగా తీవ్రమైన నీటి ఎద్దడి తలెత్తే గ్రామాలు, ప్రాంతాలను గుర్తించి, అక్కడ అందుబాటులో ఉన్న నీటి వనరులను పరిశీలించి, అవసరమైన ప్రత్యామ్నాయ ఏర్పాట్లతో కూడిన కంటింజెన్సీ ప్రణాళికలను సిద్ధం చేయాలని తెలిపారు. ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి లి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఇచ్చిన ఆదేశాల మేరకు రాబోయే జూన్ నెల వరకు అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. ప్రతి శాఖ తన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించడంతోపాటు ఇతర శాఖలతో సమన్వయం చేసుకోవడం ఎంతో ముఖ్యమని అన్నారు. గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తొలుత గుర్తించేది గ్రామస్థాయి సిబ్బందేనని పేర్కొంటూ, గ్రామస్థాయిలో సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి మండల, జిల్లా అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. గ్రామ పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు, ఎంపీడీఓలు, మిషన్ భగీరథ, నీటిపారుదల, మున్సిపల్ కార్పొరేషన్ తదితర శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి గ్రామాల్లో నీటి వనరుల పరిస్థితిని పరిశీలించాలని, సమస్యలు గుర్తించిన వెంటనే పరిష్కారానికి చర్యలు చేపట్టాలని అన్నారు. అవసరమైన చోట అదనపు నీటి వనరులు, ప్రత్యామ్నాయ సరఫరా ఏర్పాట్లు, ఇతర అత్యవసర చర్యలకు సంబంధించి ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపించాలని సూచించారు. జిల్లా కేంద్రంతోపాటు మహబూబ్‌నగర్ నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లో తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించాలని ప్రభుత్వ విప్ సూచించారు. ప్రజలకు తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో పనిచేయాలని, అవసరమైన నిధులు, అనుమతులు, ఇతర ప్రభుత్వ సహకారాన్ని సమన్వయం చేసుకుంటూ సమస్యలను పరిష్కరించాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ ఎప్పటికప్పుడు అధికారులతో సమీక్షలు నిర్వహిస్తూ, గ్రామాలవారీగా సమస్యలను తెలుసుకుని అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. శాఖల మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేయడంతోపాటు, ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని అన్నారు. ప్రజా సమస్యలను ముందుగానే గుర్తించి పరిష్కరించేందుకు ఇలాంటి సమీక్ష సమావేశాలను క్రమం తప్పకుండా నిర్వహించడం అవసరమని ప్రభుత్వ విప్ శ్రీ యెన్నం శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జిల్లా యంత్రాంగం బాధ్యతాయుతంగా, అప్రమత్తంగా పనిచేయాలని స్పష్టం చేశారు. ఈ సమీక్ష సమావేశంలో అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, నగర మేయర్ శ్రీమతి గుమ్మాల మమత శ్రీనివాస్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి తో పాటు వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



వ్యాపారస్థులంతా తూనికలు - కొలతల

నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి

- జిల్లా తూనికలు - కొలతల అధికారి పి. శంకర్.



నిర్మల్ అక్టోబర్ 16 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి)

నిర్మల్ పట్టణంలోని పలు వ్యాపార సంస్థలపై తూనికలు – కొలతల (లీగల్ మెట్రాలజీ) శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు.



తనిఖీల్లో భాగంగా నిబంధనలు ఉల్లంఘించిన రెండు వ్యాపార సంస్థలపై కేసులు నమోదు చేసినట్లు జిల్లా లీగల్ మెట్రాలజీ అధికారి పి. శంకర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పట్టణంలోని వ్యాపారస్తులందరూ ప్రభుత్వ నిబంధనలకు కట్టుబడి తమ వ్యాపారాలను నిర్వహించుకోవాలని ఆయన స్పష్టం చేశారు. వ్యాపార సంస్థల్లో ఉపయోగించే ఎలక్ట్రానిక్ వెయింగ్ మిషన్లు, కాండా బాట్లు, ఇతర తూనిక పరికరాలకు నిర్ణీత గడువులోగా ఎప్పటికప్పుడు స్టాంపింగ్ చేయించుకోవాలని అన్నారు. అలాగే, వస్తువులను ప్యాకింగ్ చేసి విక్రయించే వ్యాపారులు తప్పనిసరిగా ప్యాకింగ్ లైసెన్స్ పొందిన తర్వాత మాత్రమే తమ వ్యాపారాన్ని కొనసాగించాలని ఆదేశించారు.

ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించే వ్యాపారస్తులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు. జిల్లాలోని ప్రతి ఒక్క వ్యాపారస్తుడు ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణించి, లీగల్ మెట్రాలజీ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని ఆయన స్పష్టం చేశారు.

విబిజి రామ్ జీ పనులు సమర్థవంతంగా చేపట్టాలి

- జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

నిర్మల్ అక్టోబర్ 30 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి)వివిజి రామ్ జీ పనులు సమర్థవంతంగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ లోకేశ్వరం మండలం అర్లి – గొడిసెర గ్రామంలో పర్యటించారు.



ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, వివిజి రామ్ జీ కింద గ్రామంలో ప్రతి ఒక్కరు ఉపాధి పొందాలని పేర్కొన్నారు. స్థానిక ప్రజా ప్రతినిధులు జాబ్ కార్డులు కలిగి ఉన్న వారిని కూలి పనులకు వెళ్లేలా ప్రోత్సహించాలని సూచించారు. వివిజి రామ్ జీ కార్యక్రమం కింద విస్తృతంగా నీటి సంరక్షణ నిర్మాణాలు చేపట్టాలని చెప్పారు. నీటి సంరక్షణ చర్యల వల్ల భవిష్యత్తులో నీటి సమస్యలు తలెత్తకుండా ఉంటాయని పేర్కొన్నారు.గ్రామంలో స్వాధ్యాయి వృక్ష మందిరానికి స్థలం కేటాయింపు అంశంపై స్థానికులతో మాట్లాడారు. వృక్ష మందిరం కార్యక్రమానికి సంబంధించిన వివరాలను సంబంధిత వ్యక్తులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం, లీజు, ఇతర మార్గాల ద్వారా వృక్షాలు నాటేందుకు స్థలాన్ని కేటాయించే అంశంపై అధికారులకు సూచనలు చేశారు. సంబంధిత స్థలాన్ని కలెక్టర్ పరిశీలించారు. సదరు ప్రాంతంలో గ్రావెల్, స్టోన్ మెటీరియల్ ఉన్నదేమో తెలుసుకునేందుకు మైనింగ్ అధికారుల ద్వారా వివరాలు సేకరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ సూర్యారావు, సర్పంచ్ జంగం ప్రసన్న, గ్రామస్తులు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఇల్లెందు ఎమ్మెల్యేను కలిసిన కొమ్మినేని వెంకటేశ్వర్లు



తల్లాడ, అక్టోబర్ ప్రజాకలం న్యూస్: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందు శాసనసభ్యులు కోరం కనకయ్యను తల్లాడ మండలంలోని అన్నారుగూడెం గ్రామానికి చెందిన సీనియర్ నాయకులు, ఉప సర్పంచ్ కొమ్మినేని వెంకటేశ్వర్లు (కేవీ) కలిశారు. శుక్రవారం సత్తుపల్లిలో జరుగుతున్న మహిళా కబడ్డీ పోటీలకు హాజరైన ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కొద్దిసేపు చర్చించారు. అనంతరం రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలను ఆయనతో కలిసి వీక్షించి తిలకించారు.

ముప్వా విజయబాబును కలిసిన పాత మిట్టపల్లి నాయకులు



తల్లాడ అక్టోబర్ 30 ప్రజా కలం న్యూస్

రాష్ట్ర ఇండస్ట్రియల్ మాజీ చైర్మన్ ముప్వా విజయబాబును తల్లాడ మండలంలోని పాత మిట్టపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు పోట్రూ శ్రీనివాసరావు, మాగంటి శ్రీనివాసరావు కలిశారు. శుక్రవారం సత్తుపల్లిలో జరుగుతున్న మహిళా కబడ్డీ పోటీలకు హాజరైన చైర్మన్ ను వారు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కొద్దిసేపు వారితో చర్చించారు. అనంతరం రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలను వారు ఆయనతో కలిసి తిలకించారు.

రాష్ట్రస్థాయి మహిళల కబడ్డీ పోటీలను తిలకించిన కొమ్మినేని వెంకటేశ్వర్లు



తల్లాడ సత్తుపల్లి అక్టోబర్ 30 ప్రజాకలం న్యూస్

ఖమ్మం జిల్లా సత్తుపల్లిలో జరుగుతున్న మహిళల 73వ సీనియర్ రాష్ట్ర కబడ్డీ ఛాంపియన్ పోటీలను తిలకిస్తున్న తల్లాడ మండలం అన్నారుగూడెం, గోపాలపేట గ్రామాల సీనియర్ నాయకులు కొమ్మినేని వెంకటేశ్వర్లు(కేవీ), కూచిపూడి వెంకటేశ్వరరావు, గోవిందు శ్రీనివాసరావు((ట్రాక్టర్). ఈ సందర్భంగా రాష్ట్ర ఇండస్ట్రియల్ మాజీ చైర్మన్ ముప్వా విజయబాబును మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఆయనకు తిరుపతి లడ్డు ప్రసాదం, శబరిమలై అయ్యప్ప స్వామి ప్రసాదాలను ముప్వా విజయ్ బాబుకు గోవిందు శ్రీనివాసరావు అందించారు. ఈ కార్యక్రమంలో పొన్నం కృష్ణయ్య, సూ హనుమంతరావు, షేకు యాకూబ్ పాషా, మెహరాజు, గోవిందు సురేష్, తాళ్ల అగస్టిన్, కందుల నారాయణ, తాళ్లూరి ఆదినారాయణ, కొత్తపల్లి దానయ్య తదితరులు ఉన్నారు.

ఎన్నికలు ప్రజాస్వామ్యంలో వజ్రాయుధం

- చిన్న వయసులోనే ఎన్నికల గురించి అవగాహన..

- కరస్పాండెంట్ కోటగిరి ప్రవీణ్..



తల్లాడ, అక్టోబర్ 30 (ప్రజా కలం న్యూస్): స్థానిక బాల భారతి విద్యాలయంలో విద్యార్థులకు ప్రజాస్వామ్య విలువలు, ఎన్నికల ప్రక్రియ పట్ల అవగాహన కల్పించే లక్ష్యంతో సాధారణ స్థానిక సంస్థల ఎన్నికలను శుక్రవారం నిర్వహించారు. పాఠ్యపుస్తకాలకు పరిమితం కాకుండా విద్యార్థులు స్వయంగా ఎన్నికల ప్రక్రియలో పాల్గొనేలా ఈ కార్యక్రమాన్ని రూపొందించారు. ఈ ఎన్నికల్లో విద్యార్థులు అభ్యర్థులుగా నామినేషన్లు దాఖలు చేసి, ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఓటరు జాబితా ఆధారంగా రహస్య బ్యాలెట్ పద్ధతిలో ఓటింగ్ జరిగింది. ఓట్ల లెక్కింపు అనంతరం ఫలితాలు ప్రకటించారు. ఈ ప్రక్రియ ద్వారా విద్యార్థులు ఎన్నికల నియమావళి, ఓటు హక్కు ప్రాముఖ్యత, బాధ్యతాయుతమైన పౌరసత్వం గురించి ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. కరస్పాండెంట్ కోటగిరి ప్రవీణ్, డైరెక్టర్ కోటగిరి శ్రావణి, ప్రిన్సిపాల్ తాళ్లూరి రామారావు, ఇన్చార్జ్ మేకల శ్రీనివాసరావు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. అనంతరం కరస్పాండెంట్ కోటగిరి ప్రవీణ్ మాట్లాడుతూ ఎన్నికలు ప్రజాస్వామ్యానికి పునాది. చిన్న వయసు నుంచే విద్యార్థులు ఓటు విలువను అర్థం చేసుకోవడం భవిష్యత్తులో బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగడానికి దోహదపడుతుంది" అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



రైతు సంక్షేమమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యం

సన్న వడ్లకు క్వింటాలుకు రూ.500 బోనస్

రైతులకు రూ.2 లక్షల వరకు ఏకకాలంలో రుణమాఫీ: ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి



మహబూబ్ నగర్ ప్రజా కలం ప్రతినిధి అక్టోబర్ 30:

రైతుల సంక్షేమం, వ్యవసాయ రంగ అభివృద్ధికి ప్రజా ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తోందని ప్రభుత్వ విప్, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. రైతులకు ఆర్థిక భరోసా కల్పిస్తూ, వారు పండించిన పంటకు గిట్టుబాటు ధర అందించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. శుక్రవారం మహబూబ్‌నగర్ నగరంలోని మార్కెట్ యార్డులో మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఖరీఫ్ సీజన్ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని యెన్నం శ్రీనివాస్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు సంక్షేమ పథకాలతో రాష్ట్రంలో వ్యవసాయ రంగం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందన్నారు. గతంలో వ్యవసాయం రైతులకు భారంగా ఉండేదని, రైతుల కష్టానికి తగిన ప్రతిఫలం అందించి వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. అర్హులైన రైతులకు ఏకకాలంలో రూ. 2 లక్షల వరకు పంట రుణమాఫీ అమలు చేసి రుణభారం నుంచి ఉపశమనం కల్పించిందన్నారు. సన్న వడ్లు పండించే రైతులకు క్వింటాలుకు అదనంగా రూ. 500 బోనస్ అందిస్తూ ప్రోత్సహిస్తున్నట్లు పేర్కొన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చే రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని అవసరమైన సౌకర్యాలు కల్పించాలని, ధాన్యం కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా, సజావుగా నిర్వహించాలని సంబంధిత అధికారులకు సూచించారు. రైతులు పండించిన ప్రతి గింజకు గిట్టుబాటు ధర అందేలా చర్యలు తీసుకోవాలన్నారు.

మరోవైపు పేద ప్రజలకు పోషక విలువలతో కూడిన నాణ్యమైన ఆహారం అందించాలనే లక్ష్యంతో రేషన్ కార్డుదారులకు ప్రతి ఒక్కరికీ నెలకు ఆరు కిలోల సన్న బియ్యాన్ని ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. రైతులకు ఆర్థిక భరోసా కల్పించడం, పేద కుటుంబాలకు ఆహార భద్రత కల్పించడం ప్రజా ప్రభుత్వ ప్రధాన ప్రాధాన్యతలని యెన్నం శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మహబూబ్‌నగర్ మేయర్ గుమ్మాల మమత శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సిరాజ్ ఖాద్రీ, కార్పొరేటర్లు ప్రశాంత్, రమేష్ రెడ్డి, నాయకులు శ్రీనివాస్ యాదవ్, పీర్ మహ్మద్ సాధిక్, మార్కెట్ యార్డు కార్యదర్శి అనిత తదితరులు పాల్గొన్నారు.

విద్య, ఉద్యోగ నియామకాలు, పదోన్నతుల్లో ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలి

ప్రభుత్వ ఉత్తర్వులపై సీఎం రేవంత్ రెడ్డికి డాక్టర్ కొరిపల్లి శ్రీనివాస్ కృతజ్ఞతలు



ఖమ్మం, అక్టోబర్ 30(ప్రజా కలం న్యూస్

రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ శాఖలు, యూనివర్సిటీలు, కార్పొరేషన్లలో ఉద్యోగ నియామకాలు, బదిలీలు, పదోన్నతుల ప్రక్రియలో ఎస్సీ వర్గీకరణను తప్పనిసరిగా అమలు చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడంపై తెలంగాణ మాదిగ హక్కుల దండోరా (టీఎంహెచ్‌డీ) రాష్ట్ర అధ్యక్షులు, దళితరత్న డాక్టర్ కొరిపల్లి శ్రీనివాస్ హర్షం వ్యక్తం చేశారు. ఈ నిర్ణయం తీసుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు ఎస్సీ అభివృద్ధి శాఖ కార్యదర్శి బోయి విజయేంద్ర ఈ నెల 26న మెమో నంబర్ 1628/ఎస్సీడీ/పీఓఏ-ఏ2/2026 జారీ చేసినట్లు తెలిపారు. ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు నేపథ్యంలో జస్టిస్ షమీమ్ అక్తర్ కమిషన్ సిఫార్సుల ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీలను మూడు గ్రూపులుగా విభజిస్తూ 15 శాతం రిజర్వేషన్లు కల్పించేలా 2025 ఏప్రిల్ 14న ఉత్తర్వులు జారీ చేసిందని వివరించారు. ఎస్సీ ఉపకులాలను గ్రూపులుగా విభజించి రిజర్వేషన్లు కల్పించడంతో పాటు విద్య, ఉద్యోగ నియామకాలు, పదోన్నతుల్లోనూ వర్గీకరణను అమలు చేయాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం షెడ్యూల్డ్ కులాల ఉద్యోగులకు ప్రయోజనం చేకూరుస్తుందని డాక్టర్ కొరిపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. ప్రభుత్వ ఆదేశాలను అన్ని శాఖలు విధిగా అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాదిగ ఉద్యోగ సంఘం నాయకులు గబ్బెటి రాజన్న మాదిగ, రాయల శ్రీనివాస్ మాదిగ, మునగలేటి వీరస్వామి మాదిగ, మంద కుమార్ మాదిగ, ఇనగంటి శ్రీను మాదిగ, కొండ్రు రాంబాబు మాదిగ, ముత్తయ్య మాదిగ, తదితరులు పాల్గొన్నారు.

కరువు పరిస్థితులపై కలెక్టర్ సమీక్ష

గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి



నాగర్ కర్నూల్ అక్టోబర్ 30 (ప్రజా కలం):జిల్లాలో నెలకొన్న కరువు పరిస్థితుల నేపథ్యంలో జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. నాగర్ కర్నూల్ జిల్లాలోని 13 మండలాలను రాష్ట్ర ప్రభుత్వం కరువు ప్రాంతాలుగా గుర్తించిన నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.కరువు పరిస్థితులపై సంబంధిత శాఖల అధికారులు శాఖల వారీగా సమగ్ర నివేదికలు సిద్ధం చేయాలని సూచించారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రతి 15 రోజులకు ఒకసారి తాగునీటి నరఫరా పరిస్థితిని సమీక్షించాలని, బోర్లు, చేతిపంపులు, ఓవర్‌హెడ్ ట్యాంకులు, పైపులైన్ల పనితీరును క్షేత్రస్థాయిలో పరిశీలించాలని తెలిపారు.నీటి సమస్య తీవ్రంగా ఎదురయ్యే అవకాశమున్న గ్రామాలను ముందుగానే గుర్తించి, అవసరమైన ప్రాంతాల్లో ప్రత్యామ్నాయ తాగునీటి సరఫరా ఏర్పాట్లు చేయాలని సూచించారు.అదేవిధంగా వ్యవసాయ, ఉద్యానవన శాఖల అధికారులు పంటల నష్టంపై సమగ్ర అంచనా వేయాలని, సాగునీటి లభ్యత, భూగర్భ జలమట్టాల పరిస్థితిని నిరంతరం పరిశీలించాలని ఆదేశించారు. కరువు పరిస్థితుల్లో రైతులకు అవసరమైన సూచనలు, సలహాలు అందిస్తూ వారికి అండగా నిలవాలని పేర్కొన్నారు.అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ క్షేత్రస్థాయి పరిస్థితులను ఎప్పటికప్పుడు అంచనా వేయాలని, నిర్దిష్ట గడువులోగా సమగ్ర నివేదికలు సమర్పించాలని కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ అధికారులను ఆదేశించారు.

తూడుకుర్తి పాఠశాలలో బాలల రక్షణపై న్యాయ విజ్ఞాన సదస్సు

పోక్సో చట్టం, బాల్య వివాహాలు, సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన



నాగర్‌కర్నూల్, అక్టోబర్ 30 (ప్రజా కలం):రాష్ట్ర హైకోర్టు ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ నాగర్‌కర్నూల్ ఆధ్వర్యంలో శుక్రవారం తూడుకుర్తి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 'సురక్షిత్ బచ్పన్ అభియాన్ –పాన్ ఇండియా న్యూల్ అవేర్‌నెస్ క్యాంపెయిన్' కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి శ్రీమతి నిహారిక హాజరై మాట్లాడుతూ బాలల రక్షణ, హక్కులు, భద్రతను పెంపొందించడమే సురక్షిత్ బచ్పన్ అభియాన్ ప్రధాన ఉద్దేశమని తెలిపారు. చిన్నారులపై జరిగే లైంగిక దాడులు, వేధింపులను అరికట్టేందుకు రూపొందించిన పోక్సో చట్టంపై విద్యార్థులకు అవగాహన కల్పించడం ఈ కార్యక్రమం ముఖ్య లక్ష్యమన్నారు.ప్రతి బిడ్డకు స్వేచ్ఛగా చదువుకునేందుకు, ఆడుకునేందుకు సురక్షితమైన వాతావరణం కల్పించాల్సిన బాధ్యత సమాజంపై ఉందన్నారు. బాల్య వివాహాలు, సైబర్ నేరాలు, బాలల హక్కులు, రక్షణ చర్యలపై విద్యార్థులకు వివరించారు.ఈ సందర్భంగా బాలల రక్షణకు సంబంధించి విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. బాలల హక్కులు, రక్షణపై రూపొందించిన పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించి బాలల భద్రతపై ప్రజలకు సందేశాన్ని అందించారు.ఈ కార్యక్రమంలో ప్రభుత్వ న్యాయవాది శ్రీరామ్ ఆర్య, చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ సుదర్శన్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించిన మట్టా దయానంద్..



తల్లాడ, అక్టోబర్ 30 (ప్రజా కలం న్యూస్):

తల్లాడ మండలం తల్లాడ గ్రామంలో గురువారం శ్రీశ్రీశ్రీ సురమాంబ దేవి సమేత శ్రీ కంఠమహేశ్వర స్వామి వనం ఎల్లమ్మ – వనం మైసమ్మ దేవతల ప్రతిష్ట, కళ్యాణ మహోత్సవం తల్లాడ గౌడ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తెలంగాణ రాష్ట్ర నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా తల్లాడ విచ్చేసిన డాక్టర్ మట్టా దయానంద్ ని గౌడ సంఘం కమిటీ సభ్యులు శాలువాతో ఘనంగా సన్మానించారు ఈ కార్యక్రమం లో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గొడుగునూరు లక్ష్మిరెడ్డి, గౌడ సంఘం నాయకులు మొక్క బసవయ్య, పెరిక నాగేశ్వరరావు, కమిటీ సభ్యులు భారీగా పాల్గొన్నారు.

కంఠమేశ్వర స్వామి ఆలయ ప్రతిష్ఠ మహోత్సవంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే సండ్ర

ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారిని దర్శించుకున్న సండ్ర వెంకటవీరయ్య



తల్లాడ, అక్టోబర్ 30 (ప్రజా కలం న్యూస్): తల్లాడ పట్టణంలోని శ్రీ సూరమాంబదేవి సమేత కంఠమేశ్వర స్వామి, వనం ఎల్లమ్మ, వనం మైసమ్మ దేవతల ప్రతిష్ఠ మహోత్సవం, కళ్యాణ వేడుకలు శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకలకు బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు.గౌడ సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా సండ్ర మాట్లాడుతూ ఆలయాల అభివృద్ధి, ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజంలో భక్తిభావాన్ని, ఐక్యతను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పెరిక.నాగేశ్వరరావు, నాయకులు రెడ్డెం వీర మోహన్ రెడ్డి,దుగ్గిదేవర వెంకట్ లాల్ ,ఉపసర్పంచ్ కర్నాటి లక్ష్మ రెడ్డి, మాజీ వి డిసి చైర్మెన్ దగ్గుల శ్రీనివాస రెడ్డి, దగ్గుల రాజశేఖర్ రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ గుండ్ల వెంకటి, ఇజ్జగని గోవింద రావు, కమిటీ సభ్యులు, స్థానిక ప్రముఖులు, భక్తులు పాల్గొన్నారు.

నవంబర్ 1 నుంచి 15 వరకు మాదకద్రవ్యాల నిరోధానికి ప్రత్యేక డ్రైవ్

విద్యాసంస్థల పరిసరాల్లో మత్తు పదార్థాల విక్రయాలపై ప్రత్యేక నిఘా

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవు: కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్



నాగర్ కర్నూల్ 30 (ప్రజా కలం): జిల్లాలో మాదకద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణాను అరికట్టేందుకు నవంబర్ 1 నుంచి 15వ తేదీ వరకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు బానిస కాకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని సూచించారు. ముఖ్యంగా పాఠశాలలు, కళాశాలల పరిసరాల్లోని పాన్‌షాపులు, ఇతర దుకాణాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని తెలిపారు. విద్యాసంస్థల 100 అడుగుల పరిధిలో గుట్కా, సిగరెట్ల విక్రయాలు నిషేధమని, నిబంధనలు ఉల్లంఘించి మత్తు పదార్థాలు విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.జిల్లాలోని పాఠశాలలు, కళాశాలలు, గ్రామాలు, పట్టణాల్లో మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణాకు సంబంధించిన కేసుల దర్యాప్తును వేగవంతం చేసి, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ జిల్లాలో మాదకద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణాను పూర్తిస్థాయిలో అరికట్టేందుకు కృషి చేయాలని కలెక్టర్ సూచించారు.

మెకానికల్ విద్యార్థికి రూ.10 లక్షల వార్షిక ప్యాకేజీతో ఉద్యోగం

పాలేరు అక్టోబర్ 30(ప్రజా కలం న్యూస్)పొన్నేకల్‌లోని శ్రీ చైతన్య ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన మెకానికల్ ఇంజనీరింగ్ విద్యార్థి సరిమళ్ళ అఖిల్ కుమార్ హైదరాబాద్‌కు చెందిన ఏలేయేషన్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలో రూ. 10 లక్షల వార్షిక వేతన ప్యాకేజీతో ఉద్యోగానికి ఎంపికయ్యాడు.ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్ మాట్లాడుతూ, కోర్ ఇంజనీరింగ్ విభాగాల్లోనూ మంచి ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని, విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. కళాశాలలో అందిస్తున్న ప్రత్యేక శిక్షణ, కమ్యూనికేషన్ స్కిల్స్, సాంకేతిక నైపుణ్యాల వల్లే ప్రాంగణ నియామకాలు సాధ్యమవుతున్నాయని ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ సాయి గీతిక, ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకట చలపతి తెలిపారు. విద్యార్థి అఖిల్ కుమార్‌ను కళాశాల యాజమాన్యం, డీన్ డాక్టర్ వి. సుదర్శన్, హెచ్ఆర్ అపూర్వ బాపతి, ప్లేస్‌మెంట్ అధికారి డాక్టర్ రాజేష్ కానుగంటి, అధ్యాపకులు అభినందించారు.



కూసుమంచిలో బీజేపీ ఆధ్వర్యంలో ఇంటింటికీ పట్టభద్రుల ఓటరు నమోదు

- బీజేపీ జిల్లా నాయకులు గుండా ఉపేందర్ రెడ్డి



పాలేరు అక్టోబర్ 30(ప్రజా కలం) కూసుమంచి మండల కేంద్రంలోని శుక్రవారం బీజేపీ జిల్లా నాయకులు గుండా ఉపేందర్ రెడ్డి, ఆధ్వర్యంలో ఇంటింటికీ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు కార్యక్రమం కొనసాగుతోంది. నవంబర్ 2023కు ముందు డిగ్రీ పూర్తి చేసిన పట్టభద్రులు తప్పనిసరిగా కొత్తగా ఓటరుగా నమోదు చేసుకోవాలని ఆయన కోరారు. నవంబర్ 6వ తేదీ వరకు నమోదు చేసుకునే అవకాశం ఉందని తెలిపారు. అర్హులైన పట్టభద్రులు 9182314900 నంబర్‌కు అవసరమైన ధ్రువపత్రాలు పంపిస్తే ఆన్‌లైన్‌లో నమోదు చేస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో స్థానిక వార్డు సభ్యురాలు మంద నవ్య, చంద్రశేఖర్ గౌడ్, కొత్త శ్రీనివాస్ రెడ్డి, యువమోర్చా జిల్లా నాయకులు మంద చంద్రశేఖర్ గౌడ్, అడపా మధు తదితరులు పాల్గొన్నారు.

పట్టభద్రులు తమ ఓటును నమోదు చేసుకోవాలి

- కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బజ్జూరి వెంకట్ రెడ్డి



పాలేరు అక్టోబర్ 30(ప్రజా కలం న్యూస్) కూసుమంచి మండలంలోని పట్టభద్రులందరు తప్పకుండా తమ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ కూసుమంచి మండలం అధ్యక్షుడు బజ్జూరి వెంకట్ రెడ్డి కోరారు. శుక్రవారం కూసుమంచి మండల కేంద్రంలో ఓటు హక్కు నమోదు పట్ల పట్టభద్రులకు అవగాహన కల్పించారు. ఓటు హక్కు నమోదు చేసుకొని వారి వివరాలు సేకరించి అక్కడే ఓటు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర రెవెన్యూ గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సూచన మేరకు కాంగ్రెస్ పార్టీ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ రెడ్డి ఆధ్వర్యంలో కూసుమంచి మండలం లో ఐదు ఓటర్ నమోదు కేంద్రాలను ఏర్పాటు చేశామని, వాటికి ఇంచార్జ్ లను నియమించడం జరిగిందన్నారు. వారు ప్రతి గ్రామంలో తిరిగి ఓటు హక్కు నమోదు చేస్తారని,
మండల పరిధిలోని పట్టబద్రులు తమ ఓటు హక్కు కొరకు నవంబర్ 6 తారీకు లోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీడీసీ చైర్మన్ యరబోలు సూర్యనారాయణ రెడ్డి, మాజీ ఎంపీటీసీ మాదాసు ఉపేందర్, సర్పంచ్ కొండా కృష్ణవేణిమహిపాల్, ఓటర్ నమోదు ఇంచార్జ్ పెండ్ర అంజయ్య, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు కొండా శ్రీనివాస్ రావు తదితరులు హాజరైయ్యారు.

అండర్-17 పరుగు పందెంలో జిల్లా ప్రథమ స్థానం సాధించిన సిఎన్ఆర్ విద్యార్థి

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా స్థాయి పోటీలకు జ్ఞానేశ్వర్ ఎంపిక



నాగర్ కర్నూల్ అక్టోబర్ 30 (ప్రజా కలం): 70వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడా టోర్నమెంట్‌లో నాగర్ కర్నూల్‌కు చెందిన సిఎన్ఆర్ పాఠశాల విద్యార్థి జ్ఞానేశ్వర్ అద్భుత ప్రతిభ కనబరిచాడు. అండర్-17 బాలుర విభాగంలో నిర్వహించిన పరుగు పందెం పోటీల్లో జిల్లా ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకుని సత్తా చాటాడు.స్థానిక జిల్లా పరిషత్ క్రీడా మైదానంలో గురువారం నిర్వహించిన పోటీల్లో 9వ తరగతి చదువుతున్న జ్ఞానేశ్వర్ తన ప్రతిభతో అందరి ప్రశంసలు అందుకున్నాడు. ఈ విజయంతో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు.విద్యార్థి జ్ఞానేశ్వర్ సాధించిన విజయంపై పాఠశాల వ్యవస్థాపకులు చంద్రకళ, ప్రిన్సిపాల్ హోజీరా, అపర్ణ హర్షం వ్యక్తం చేశారు. పాఠశాల యాజమాన్యం సయ్యద్ ఫసియుద్దీన్, వెంకటేశ్వరరావు, వ్యాయామ ఉపాధ్యాయులు ఆనంద్, సత్యనారాయణతో పాటు ఉపాధ్యాయ బృందం విద్యార్థిని అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి పాఠశాలకు, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

జై భీమ్ కాలనీకి తీరిన నీటి తిప్పలు

కమ్యూనిటీ బోర్‌వెల్‌తో 11 కుటుంబాలకు ఉపశమనం

తానూర్, అక్టోబర్ 30(ప్రజా కలం): తాగునీటి కోసం ఏళ్ల తరబడి అల్లాడుతున్న హిప్నెల్లి గ్రామంలోని జై భీమ్ కాలనీ వాసులకు ఎట్టకేలకు ఊరట లభించింది. 11 కుటుంబాల నీటి కష్టాలను తీర్చేందుకు గ్రామ పంచాయతీ, గ్రామ సంఘం, వాష్ ప్రాజెక్టు సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కమ్యూనిటీ బోర్‌వెల్‌ను శుక్రవారం ప్రారంభించారు. ఇన్నాళ్లూ నీటి కోసం కిలోమీటర్ల మేర వెళ్లాల్సి రావడంతో మహిళలు తీవ్ర శ్రమకోర్చి, కూలి పనులకు కూడా వెళ్లలేక ఉపాధి కోల్పోయేవారు. ఈ సమస్యపై స్పందించిన సర్పంచ్ గంగాసాగర, అధికారులు పరిష్కారానికి చొరవ చూపారు. గ్రామ సంఘం రూ.30 వేల వాష్ రుణం అందించగా, వాటర్ ఆర్గ్ సహకారంతో మరో రూ.30 వేల ఆర్థిక సాయం లభించింది. మొత్తం రూ.60 వేలతో బోర్‌వెల్, ట్యాంక్, పైప్‌లైన్ సౌకర్యాలు కల్పించారు. దీంతో సమయం, శ్రమ ఆదా అయి మహిళలు ఉపాధి పనులకు వెళ్లే వెసులుబాటు కలిగింది.



ఎల్ నినో ప్రభావం వలన తలెత్తే పరిస్థితులపై సమీక్ష

తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి

మహబూబ్. నగర్ నియోజకవర్గం సంబంధించి అధికారులతో సమావేశం

ప్రభుత్వ విప్ లియెన్నం శ్రీనివాస్ రెడ్డి, జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా



మహబూబ్ నగర్ ప్రజా కలం ప్రతినిధి అక్టోబర్ 30:

రాబోయే రోజుల్లో:ఎల్ నినో వలన తీవ్ర మైన పరిస్థితులు తలెత్తే అవకాశం ఉందని,వచ్చే 8 నెలలు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా జిల్లా యంత్రాంగం ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ప్రభుత్వ విప్,మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే లి యెన్నం శ్రీనివాస్ రెడ్డి లి అధికారులకు సూచించారు. భవిష్యత్తులో కరువు పరిస్థితులు, నీటి కొరత,విద్యుత్ వంటి సమస్యలు ఎదురైనా ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖల అధికారులు బాధ్యతగా పనిచేయాలని అన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా అధ్యక్షతన నిర్వహించిన మహబూబ్ నగర్ నియోజకవర్గం లో ఎల్ నినో నేవధ్యంలో త్రాగు నీరు సరఫరా,,విద్యుత్,వి.బి.జి రామ్ జీ పనులు, సమీక్ష సమావేశంలో సమీక్షించారు జిల్లా, మండల, గ్రామస్థాయి అధికారులతో తాగునీటి సరఫరా, నీటి వనరుల లభ్యత, వేసవిలో ఎదురయ్యే సమస్యలు, వాటి పరిష్కారానికి చేపట్టాల్సిన ముందస్తు చర్యలపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ మాట్లాడుతూ, జిల్లాలో ఎక్కడెక్కడ తాగునీటి కొరత ఏర్పడే అవకాశం ఉందో ముందుగానే గుర్తించాలని సూచించారు. ముఖ్యంగా తీవ్రమైన నీటి ఎద్దడి తలెత్తే గ్రామాలు, ప్రాంతాలను గుర్తించి, అక్కడ అందుబాటులో ఉన్న నీటి వనరులను పరిశీలించి, అవసరమైన ప్రత్యామ్నాయ ఏర్పాట్లతో కూడిన కంటింజెన్సీ ప్రణాళికలను సిద్ధం చేయాలని తెలిపారు. ముఖ్యమంత్రి లి రేవంత్ రెడ్డిలి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఇచ్చిన ఆదేశాల మేరకు రాబోయే జూన్ నెల వరకు అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. ప్రతి శాఖ తన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించడంతోపాటు ఇతర శాఖలతో సమన్వయం చేసుకోవడం ఎంతో ముఖ్యమని అన్నారు. గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తొలుత గుర్తించేది గ్రామస్థాయి సిబ్బందేనని పేర్కొంటూ, గ్రామస్థాయిలో సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి మండల, జిల్లా అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. గ్రామ పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు, ఎంపీడీఓలు, మిషన్ భగీరథ, నీటిపారుదల, మున్సిపల్ కార్పొరేషన్ తదితర శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి గ్రామాల్లో నీటి వనరుల పరిస్థితిని పరిశీలించాలని, సమస్యలు గుర్తించిన వెంటనే పరిష్కారానికి చర్యలు చేపట్టాలని అన్నారు. అవసరమైన చోట అదనపు నీటి వనరులు, ప్రత్యామ్నాయ సరఫరా ఏర్పాట్లు, ఇతర అత్యవసర చర్యలకు సంబంధించి ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపించాలని సూచించారు.

మహబూబ్. నగర్ నగర పాలక సంస్థ తో పాటు మహబూబ్‌నగర్ నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లో తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించాలని ప్రభుత్వ విప్ సూచించారు. ప్రజలకు తాగునీటి సమన్యలు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో పనిచేయాలని, అవసరమైన నిధులు, అనుమతులు, ఇతర ప్రభుత్వ సహకారాన్ని సమన్వయం చేసుకుంటూ సమస్యలను పరిష్కరించాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ ఎప్పటికప్పుడు అధికారులతో సమీక్షలు నిర్వహిస్తూ, గ్రామాలవారీగా సమస్యలను తెలునుకుని అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. శాఖల మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేయడంతోపాటు, ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని అన్నారు. ప్రజా సమస్యలను ముందుగానే గుర్తించి పరిష్కరించేందుకు ఇలాంటి సమీక్ష సమావేశాలను క్రమం తప్పకుండా నిర్వహించడం అవసరమని ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జిల్లా యంత్రాంగం బాధ్యతాయుతంగా, అప్రమత్తంగా పనిచేయాలని స్పష్టం చేశారు.

జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తాలి మాట్లాడుతూ ప్రతి గ్రామంలో పంచాయతీ కార్యదర్శులు రాబోయే రోజుల్లో నీటి ఎద్దడిని ఎదుర్కొనేందుకు ప్రత్యామ్నాయ నీటి వనరులను గుర్తించాలని సూచించారు. అవసరమైన చోట ట్యాంకర్ల సరసరా బోరుబావులు వేయడం, మోటార్లు సమకూర్చడం, పైపులైన్లు ఏర్పాటు చేయడం వంటి పనులకు ముందస్తు ప్రణాళిక రూపొందించి ప్రతిపాదనలు పంపించాలని అన్నారు. నీటి సమస్యగానీ, విద్యుత్ సమస్యగానీ తలెత్తితే వెంటనే ఉన్నతాధికారులకు తెలియజేయాలని సూచించారు. గ్రామాల్లో నీటి సంరక్షణ కోసం సోక్‌పిట్లు, సామూహిక సోక్‌పిట్లు, రీఛార్జ్ నిర్మాణాలు చేపట్టాలని అన్నారు. మండల స్థాయిలో ఎంపీడీఓలు టీమ్ లీడర్లుగా వ్యవహరిస్తూ పనులను పర్యవేక్షించాలని తెలిపారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ రాబోయే రోజుల్లో నీటి, విద్యుత్ సమస్యలను పరిష్కరించేందుకు ముందస్తు ప్రణాళికలతో సిద్ధంగా ఉండాలని కలెక్టర్ సూచించారు.

ముఖ్యంగా క్షేత్రస్థాయిలో రైతులకు వరి సాగు చేయకుండా ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసేలా అవగాహన కల్పించాలని అన్నారు. అనుమతి లేకుండా చెరువుల్లో బోర్లు వేసినా, నీటిని వృథా చేసినా బాధ్యులపై చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

ఈ సమీక్ష సమావేశంలో అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, నగర మేయర్ గుమ్మాల మమత శ్రీనివాస్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి తో పాటు వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.


లాస్య కుటుంబానికి న్యాయం చేయాలని మార్చురీ వద్ద

ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి ధర్నా

తొగుట : కస్తూరిబా గాంధీ పాఠశాల విద్యార్థిని లాస్య ఆకస్మిక మృతి విచారణ చేపట్టి బాలి కుటుంబానికి న్యాయం చేయాలని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు సిద్దిపేట ప్రభుత్వ దవాఖాన వద్ద లాస్య కుటుంబ సభ్యులను పరామర్శించి వారి కుటుంబానికి న్యాయం చేయాలని మార్చురీ ముందు బైఠాయించి ధర్నా చేపట్టారు. సమగ్ర విచారణ జరిపి న్యాయం చేసేంత వరకు నిరసన కొనసాగిస్తామని స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఇటీవల కాలంలో గురుకుల పాఠశాలల్లో విద్యార్థుల మరణాలపై ఆందోళన వ్యక్తం చేశారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు. కాగా, కస్తూర్బా పాఠశాలలో విద్యార్థిని ఆకస్మిక మృతి స్థానికంగా కలకలం రేపింది. సిద్దిపేట జిల్లా తొగుట మండలంలోని గుడికందులకు చెందిన దావులగల్ల లాస్య సిద్దిపేట మండలం రాఘవపూర్‌లోని కస్తూర్బా పాఠశాలలో పదో తరగతి చదువుతోంది. ఆరోగ్యంగా ఉన్న లాస్య దసరా సెలవుల అనంతరం యథావిధిగా హాస్టల్‌కు వెళ్లింది. అయితే, అనూహ్యంగా ఆమె మృతి చెందడం కుటుంబ సభ్యులను, గ్రామస్తులను తీవ్ర విషాదానికి గురిచేసింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. రాత్రి 10 గంటల సమయంలో పాఠశాల నుంచి లాస్య తల్లిదండ్రులకు ఫోన్ వచ్చింది. లాస్య పుష్పవతి అయిందని సమాచారం ఇచ్చినట్లు వారు తెలిపారు. తెల్లవారుజామున 5 గంటల సమయంలో హాస్టల్‌కు వెళ్లిన తల్లిదండ్రులకు, అప్పటికే లాస్య ఆరోగ్యం క్షీణించడంతో సిద్దిపేట ప్రభుత్వ దవాఖానకు తరలించినట్లు పాఠశాల సిబ్బంది తెలిపారని పేర్కొన్నారు.

అయితే, హాస్పిటల్‌కు చేరుకునే సమయానికే లాస్య మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆరోగ్యంగా ఉన్న తమ కుమార్తె ఆకస్మికంగా మృతి చెందడంపై తల్లిదండ్రులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లాస్య మృతికి దారితీసిన పరిస్థితులపై సమగ్ర విచారణ జరిపి, వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని కుటుంబ సభ్యులు, గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. బాధిత కుటుంబానికి న్యాయం చేసి, ఆదుకోవాలని కోరుతున్నారు. ప్రస్తుతం లాస్య మృతదేహం సిద్దిపేట ప్రభుత్వ దవాఖాన మార్చురీలో ఉంది.

యూపీలో టగ్ ఆఫ్ వార్



లక్నో : ఉత్తరప్రదేశ్ శాసనమండలి ద్వైవార్షిక ఎన్నికల ఫలితాలు రాష్ట్ర రాజకీయాల్లో సరికొత్త ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. బీజేపీకి తిరుగులేని కంచుకోటలుగా భావించే పట్టభద్రులు, ఉపాధ్యాయ నియోజకవర్గాల్లో ప్రధాన ప్రతిపక్షమైన సమాజ్‌వాదీ పార్టీ చొచ్చుకుపోయింది. మొత్తం 11 స్థానాలు 5 గ్రాడ్యుయేట్స్, 6 టీచర్స్ నియోజకవర్గాలకు జరిగిన ఎన్నికల్లో అధికార బీజేపీ 5 స్థానాలను గెలుచుకోగా, అఖిలేష్ యాదవ్ నేతృత్వంలోని ఎస్పీ 4 స్థానాల్లో జయకేతనం ఎగురవేసింది. కేవలం ఒక్క సీటు తేడాతో అధికార పార్టీ మెజార్టీని అడ్డుకోవడమే కాకుండా, విద్యావంతులు, ఉద్యోగుల వర్గాల్లో ప్రభుత్వ వ్యతిరేకత ఏ స్థాయిలో ఉందో ఈ ఫలితాల ద్వారా ఎస్పీ స్పష్టమైన రాజకీయ సందేశాన్ని పంపింది.ఈ ఫలితాల్లో అత్యంత విస్మయకరమైన అంశం ప్రధాని నరేంద్ర మోదీ లోక్‌సభ నియోజకవర్గమైన వారణాసి ఉపాధ్యాయ స్థానాన్ని ఎస్పీ కైవసం చేసుకోవడం. కాషాయ పార్టీకి కంచుకోట లాంటి వారణాసిలో బీజేపీ అభ్యర్థిని మట్టికరిపిస్తూ ఎస్పీ అభ్యర్థి లాల్ బిహారీ యాదవ్ సాధించిన విజయం లక్నో నుంచి ఢిల్లీ దాకా చర్చనీయాంశంగా మారింది. అంతేకాకుండా మేధావులు, విద్యావంతులకు కేంద్రమైన అలహాబాద్-ఝాన్సీ గ్రాడ్యుయేట్స్ స్థానంతో పాటు ఆగ్రా డివిజన్లలో సైతం సమాజ్‌వాదీ పార్టీ విజయదుందుభి మోగించింది. సీఎం యోగి ఆదిత్యనాథ్ ఇలాకా గోరఖ్‌పూర్, మీరట్ తదితర స్థానాల్లో బీజేపీ బయటపడినప్పటికీ.. గతంలో ఎన్నడూ లేని విధంగా పట్టభద్రుల స్థానాల్లో ఎస్పీ సాధించిన ఈ స్ట్రైక్ రేట్ కమలనాథులను ఆత్మరక్షణలోకి నెట్టింది.సాధారణంగా ఉపాధ్యాయ, పట్టభద్రుల స్థానాలంటే బీజేపీ, ఆరెస్సెస్ అనుబంధ సంఘాలకే మొదటి ప్రాధాన్యత ఉంటుందన్న సంప్రదాయానికి ఈ ఫలితాలు గండికొట్టాయి.నిరుద్యోగ సమస్య,పాతపెన్షన్ స్కీమ్ పునరుద్ధరణ డిమాండ్, కాంట్రాక్ట్ ఉపాధ్యాయుల సర్వీస్ క్రమబద్ధీకరణ వంటి క్షేత్రస్థాయి అంశాలను ఎస్పీ ఎన్నికల అస్త్రాలుగా మార్చుకోవడంలో పూర్తిస్థాయిలో సఫలీకృతమైంది. యువత, మధ్యతరగతి ఉద్యోగ వర్గాల్లో నెలకొన్న అసంతృప్తిని ఓట్ల రూపంలో మలచుకోవడంలోఅఖిలేష్ యాదవ్ నెరిపిన సైలెంట్ ఆపరేషన్ తిరుగులేని ఫలితాన్ని ఇచ్చింది.కేవలం యాదవులు, మైనార్టీల ఓటుబ్యాంకు మాత్రమే కాకుండా..విద్యావంతులు, పట్టభద్రులు,ఉపాధ్యాయ వర్గాల్లోనూ తమకు తిరుగులేని ఆమోదం లభిస్తోందని ఈ 4 ఎమ్మెల్సీ విజయాల ద్వారా ఎస్పీ నిరూపించుకుంది.

ఇజ్రాయెల్ ఎన్నికలను అరబ్బులు దొంగిలించారు

ఢిల్లీ,: ఇజ్రాయెల్ సార్వత్రిక ఎన్నికల ఫలితాలు తీవ్ర ఉత్కంఠకు దారితీశాయి. ఏ కూటమికి ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన స్పష్టమైన మెజారిటీ లభించకపోవడంతో రాజకీయ అనిశ్చితి నెలకొంది. ఈ నేపథ్యంలో ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహుకు చెందిన లికుడ్ పార్టీ సంచలన ఆరోపణలు చేసింది. అరబ్ నేతృత్వంలోని పార్టీలు లంచాలు, బెదిరింపులు, హింసకు పాల్పడి ఎన్నికలను దొంగిలించాయని తీవ్రంగా విమర్శించింది. దాదాపు 90 శాతం ఓట్లు లెక్కించగా, 120 స్థానాలున్న ఇజ్రాయెల్ పార్లమెంట్ 'నెస్సెట్'లో నెతన్యాహు నేతృత్వంలోని మితవాద కూటమి 53 సీట్లకు పరిమితమైనట్లు తెలుస్తోంది. మాజీ సైన్యాధిపతి గాడి ఐసెన్‌కోట్ నేతృత్వంలోని విపక్ష కూటమి 48 స్థానాల్లో నిలిచింది. ప్రభుత్వ ఏర్పాటుకు 61 సీట్ల మ్యాజిక్ ఫిగర్ అవసరం కాగా, రెండు కూటములూ ఆ మార్కును అందుకోలేకపోయాయి. కింగ్‌మేకర్‌గా అరబ్ పార్టీలు: ఈ ఎన్నికల్లో అరబ్ నేతృత్వంలోని జాయింట్ లిస్ట్, రామ్ పార్టీలు చారిత్రక విజయాన్ని నమోదు చేశాయి. గతంతో పోలిస్తే దాదాపు రెట్టింపు స్థానాలు సాధించి, ఏకంగా 19 సీట్లను కైవసం చేసుకున్నాయి. దీంతో ప్రభుత్వ ఏర్పాటులో ఈ పార్టీలు కింగ్‌మేకర్‌గా అవతరించాయి. ఈ పరిణామంతోనే నెతన్యాహు వర్గం తీవ్ర ఆందోళనతో ఆరోపణలకు దిగింది. ఓటింగ్ శాతం కూడా గత 25 ఏళ్లలో ఎన్నడూ లేనంతగా 77 శాతానికి చేరడం గమనార్హం. "ఉగ్రవాదానికి, యూదు దేశ వినాశనానికి మద్దతిచ్చే అరబ్ పార్టీలు ఈ ఎన్నికలను దొంగిలించాయి" అని లికుడ్ పార్టీ ఒక ప్రకటనలో పేర్కొంది.

ఓటర్లను ప్రలోభపెట్టడం, పోలింగ్ అధికారులను బెదిరించడం, నకిలీ ఓట్లు వేయడం వంటి అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించింది.

దీనికి సంబంధించి వందలాది సాక్ష్యాలు, ఆధారాలను పోలీసులకు, సెంట్రల్ ఎలక్షన్స్ కమిటీకి సమర్పించినట్లు వెల్లడించింది.

ఆయిల్ పామ్‌పై ఎల్ నినో ప్రభావం

- రైతు వేదికలో అవగాహన సదస్సు



తానూ ర్, అక్టోబర్ 30 (ప్రజా కలం): భైంసా మండలంలోని వానల్ పాడ్ రైతు వేదికలో ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ ఆధ్వర్యంలో ఆయిల్ పామ్ పంటపై ఎల్ నినో ప్రభావం, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భైంసా డివిజన్ ఉద్యాన అధికారి షేక్ జావిద్ పాషా మాట్లాడుతూ ఎల్ నినో పరిస్థితులను తట్టుకోవడానికి రైతులు పాటించాల్సిన కీలక సూచనలు చేశారు, తోటలోని పంట వ్యర్థాలను మల్చింగ్‌గా ఉపయోగించి నేలలో తేమను కాపాడుకోవాలి, నీటి ఎద్దడిని తట్టుకునేందుకు సిఫార్సు చేసిన మోతాదులో ఎరువులు, ముఖ్యంగా పొటాష్‌ను తప్పనిసరిగా వాడాలి, చెట్టుపై ఎప్పుడూ 30 నుంచి 35 ఆకులు ఉండేలా చూసుకోవాలి, తోటలో మైక్రోజెట్స్ ఉపయోగించడం వల్ల అనుకూలమైన సూక్ష్మ వాతావరణం ఏర్పడుతుంది,నీటి నిల్వ కోసం తోటల్లో నీటి కుంటల (ఫార్మ్ పాండ్స్) తవ్వకానికి ఉద్యాన శాఖ ద్వారా సబ్సిడీ అందిస్తున్నట్లు తెలిపారు, ఈ అవగాహన కార్యక్రమంలో శాస్త్రవేత్త దినేష్, సంబంధిత శాఖాధికారులు, స్థానిక రైతులు , పాల్గొన్నారు.

ఉమ్మడి పాలమూరు జిల్లాను కరువు ప్రాంతంగా ప్రకటించాలి

- ప్రజలను పీడించే ప్రభుత్వంగా కాంగ్రెస్ ప్రభుత్వం మారిందా

- కేసీఆర్ పాలనలో రైతులకు అండగా నిలిచాం..

- మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్

నాగర్ కర్నూల్, అక్టోబర్ 30 (ప్రజా కలం):ఉమ్మడి పాలమూరు జిల్లాలోని అన్ని మండలాలను కరువు ప్రాంతాలుగా ప్రకటించాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నాయకుడు శ్రీనివాస్ గౌడ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారంనాడు టిఆర్ఎస్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కరువు మండలాల ప్రకటనలో ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలపై ప్రశ్నలు సంధించారు. అధికారుల బృందం క్షేత్రస్థాయిలో పర్యటించి, సమగ్ర సర్వే నిర్వహించిన తర్వాతే కరువు మండలాలను ప్రకటించారా అని నిలదీశారు.పశువులకు, ప్రజలకు తాగునీరు అందక ఇబ్బందులు ఎదురవుతున్నా ప్రభుత్వానికి కరువు పరిస్థితులు కనిపించడం



లేదా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలు, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలో నెలకొన్న కరువు పరిస్థితులను గుర్తించి అన్ని మండలాలను కరువు ప్రాంతాలుగా ప్రకటించాలని కోరారు.2015-16లో కరువు పరిస్థితులు ఏర్పడినప్పుడు అప్పటి కేసీఆర్ ప్రభుత్వం రైతులకు అండగా నిలిచిందని శ్రీనివాస్ గౌడ్ గుర్తుచేశారు. రైతులకు ఉపాధి హామీ పథకం కింద 150 రోజుల పని కల్పించేలా చర్యలు తీసుకున్నామని, ప్రతి జిల్లా కలెక్టర్ వద్ద రూ.50 కోట్ల అత్యవసర నిధులు అందుబాటులో ఉంచేలా చర్యలు చేపట్టామని వివరించారు. పాడి రైతులు పశువులను అమ్ముకోకుండా ఉండేందుకు కూడా ప్రభుత్వం సబ్సిడీతో సహాయ కార్యక్రమాలు చేపట్టిందన్నారు. 2017లో కరువు పరిస్థితులు నెలకొన్న సమయంలోనూ ప్రజలకు ఇబ్బందులు కలగకుండా కేసీఆర్ ప్రభుత్వం పలు చర్యలు తీసుకుందని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో హరితహారం కార్యక్రమం ద్వారా మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు కృషి చేశామని, సాగునీటి ప్రాజెక్టులు, ఎత్తిపోతల పథకాల నిర్మాణానికి ప్రాధాన్యత ఇచ్చామని పేర్కొన్నారు.ప్రస్తుత ప్రభుత్వం రైతుల సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యం వీడి, కరువు పరిస్థితులపై తక్షణమే స్పందించాలని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించకుంటే చలో అసెంబ్లీ కార్యక్రమానికి పిలుపునిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ చైర్మన్ వెంకటయ్య వార్డ్ కౌన్సిలర్ గంగాధర్ వి ఆర్ ఎస్ పార్టీ నాయకులు పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యల శాశ్వత పరిష్కారమే లక్ష్యంగా భూ భారతి రీ సర్వే

- భూ హద్దులపై అభ్యంతరాలుంటే అధికారులకు తెలియజేయాలి

- రైతులు,భూ యజమానులు సర్వే ప్రక్రియను పరిశీలించాలి: కలెక్టర్ కె.హైమావతి



గజ్వేల్ నియోజకవర్గం,
అక్టోబర్ 30 (ప్రజా కలం ప్రతినిధి):

భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భూ భారతి పథకం కింద భూముల రీ సర్వే చేపడుతోందని జిల్లా కలెక్టర్ కె. హైమావతి తెలిపారు.శుక్రవారం గజ్వేల్ మండలం ఆరేవల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహించిన భూ భారతి--భూముల రీ సర్వేపై అవగాహన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.జిల్లాలో భూముల రీ సర్వేలో భాగంగా మొదటి, రెండో విడతల్లో మొత్తం 103 గ్రామాల్లో సర్వే పూర్తి చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు.తొలుత చిన్న గ్రామాలను ఎంపిక చేసి, అక్కడి భూ సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు.ఆరేవల్లి గ్రామంలో మొత్తం 656 ఎకరాల విస్తీర్ణం ఉందని,తొలుత ప్రభుత్వ భూములు,గ్రామ సరిహద్దులను సర్వే చేసిన అనంతరం పట్టా భూముల సర్వే చేపడతామని పేర్కొన్నారు. అధునాతన రోవర్ యంత్రాల సహాయంతో ఖచ్చితత్వంతో,పారదర్శకంగా సర్వే నిర్వహిస్తామని తెలిపారు. గూగుల్ మ్యాప్స్, జీపీఎస్ ట్రాకింగ్ సాంకేతికతను వినియోగిస్తూ భూముల హద్దులను పకడ్బందీగా గుర్తిస్తామని వెల్లడించారు.సర్వేయర్లు,గ్రామ పంచాయతీ అధికారులు, రెవెన్యూ రికార్డుల ఆధారంగా రోజుకు సుమారు 35 నుంచి 40 ఎకరాల వరకు సర్వే నిర్వహిస్తారని తెలిపారు.సర్వే సమయంలో భూ యజమానులు, రైతులు తమ భూముల హద్దులను స్వయంగా పరిశీలించాలని సూచించారు.హద్దుల విషయంలో ఏవైనా అభ్యంతరాలు ఉంటే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి,అవసరమైతే తిరిగి సర్వే చేయించుకోవచ్చని పేర్కొన్నారు.గ్రామాన్ని భూ సమస్యలు లేని ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు భూ యజమానులు, రైతులు అధికారులకు సహకరించాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో ఏడీ సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ సుదర్శన్,గజ్వేల్ తహసీల్దార్,గ్రామ సర్పంచ్,సర్వే అధికారులు, ప్రజాప్రతినిధులు,గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

22 ఏళ్లుగా పోరాటం చేస్తున్న రైతులకు న్యాయం చేయాలి

- 827 ఎకరాల బాధిత రైతులకు నష్టపరిహారం చెల్లించాలి

- జోనల్ కార్యాలయం ముందు ధర్నాముందు ఫ్యాబ్ సిటీ రైతుల ధర్నా

- టిజిఐఐసి నిర్లక్ష్య వైఖరిని విడనాడాలి- ఫ్యాబ్ సిటీ రైతుల రైతుల ఆగ్రహం



మహేశ్వరం,
అక్టోబర్ 29,(ప్రజా కలం ప్రతినిధి)

మహేశ్వరం నియోజకవర్గం తుక్కుగూడ జీహెచ్ఎంసీ పరిధిలోని రావిర్యాల, జన్నాయిగూడ గ్రామాలకు చెందిన రైతుల 827 ఎకరాల భూములకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం ఫ్యాబ్ సిటీ రైతులు TGIIC జోనల్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు.

22 ఏళ్లుగా న్యాయం కోసం ఎదురుచూపు:

గత 22 సంవత్సరాల క్రితం తమ భూములను TGIIC స్వాధీనం చేసుకుందని, ఇప్పటివరకు న్యాయమైన నష్టపరిహారం చెల్లించలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇది తీవ్ర అన్యాయమని మండిపడ్డారు.తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ రైతులు గతంలో 93 రోజుల పాటు రిలే నిరాహార దీక్షలు కూడా నిర్వహించారని గుర్తు చేశారు. ఆ నందర్భంగా TGIIC అధికారులు నష్టపరిహారం చెల్లిస్తామని హామీ ఇచ్చారని, అయితే హామీ ఇచ్చి రెండు నెలలు గడిచినా ఇప్పటివరకు అమలు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

జోనల్ అధికారి తీరుపై అసంతృప్తి:

రైతుల సమస్యలను పరిష్కరించాల్సిన జోనల్ కార్యాలయ అధికారి జ్యోతి సైతం రైతుల పట్ల నిర్లక్ష్య వైఖరి ప్రదర్శించడం బాధాకరమని రైతులు వాపోయారు.రైతుల సహనాన్ని పరీక్షించవద్దని, 22 ఏళ్లుగా ఎదురుచూస్తున్న తమకు తక్షణమే న్యాయమైన నష్టపరిహారం చెల్లించాలని, అధికారులు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. న్యాయం జరిగే వరకు తమ పోరాటాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు.ఈ ధర్నాలో రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పి. జంగారెడ్డి, రంగారెడ్డి జిల్లా కార్యదర్శి దుబ్బాక రామచందర్, సీపీఎం పార్టీ సీనియర్ నాయకులు కామ్రేడ్ పగడాల యాదయ్య, సీపీఎం మహేశ్వరం మండల కన్వీనర్ ఏర్పుల శేఖర్, రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి గోదాసు నరసింహ ఫ్యాబ్ సిటీ రైతు నాయకులు పాలకూర నాగేశ్వర్ గౌడ్‌లి తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ, తాగునీటి సమస్యలను వారం రోజుల్లో పరిష్కరించాలి

- ఎన్టీఆర్ నగర్ డివిజన్ పరిధిలో విస్తృతంగా పర్యటించిన మాజీ మంత్రి ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి



మహేశ్వరం, అక్టోబర్ 30,,(ప్రజా కలం)

మహేశ్వరం నియోజకవర్గంలోని ఎన్టీఆర్ నగర్ డివిజన్ పరిధిలో గల ఎన్టీఆర్ నగర్ ఫేజ్-2, సాయిబాబా నగర్ ప్రాంతాల్లో మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక బస్తీ వాసులు తమ ప్రాంతాల్లో నెలకొన్న డ్రైనేజీ పొంగిపొర్లడం, మురుగునీటి సమస్యలు, తాగునీటి సరఫరాలో ఇబ్బందులను ఎమ్మెల్యే గారి దృష్టికి తీసుకువచ్చారు.ప్రజల సమస్యలపై వెంటనే స్పందించిన ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అక్కడే ఉన్న అధికారి చంద్రు నాయక్ తో మాట్లాడి తాగునీటి సమస్యలను వారం రోజుల్లోగా పరిష్కరించాలని ఆదేశించారు.అదేవిధంగా పొంగిపొర్లుతున్న డ్రైనేజీ సమస్యపై ఈఈ కార్తీక్ గారితో ఫోన్‌లో మాట్లాడి, సుమారు 20 మీటర్ల మేర పైప్‌లైన్ డయామీటర్‌ను పెంచి, పక్కనే ఉన్న నాలాకు అనుసంధానం చేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారు మాట్లాడుతూ, లిమరో 20 రోజుల్లో తిరిగి ఈ ప్రాంతంలో పర్యటిస్తానని, అప్పటిలోగా తాగునీరు, డ్రైనేజీ సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు . ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తొలగించే వరకు అధికారులు నిర్లక్ష్యం చేయకుండా పనిచేయాలని స్పష్టం చేస్తూ బస్తీ వాసులకు భరోసా కల్పించారు.ఈ పర్యటనలో స్థానిక బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, బస్తీ వాసులు పాల్గొన్నారు.

బాలాపూర్ లో రామ్ రాజ్ కాటన్' నూతన షోరూమ్ ప్రారంభించిన మాజీ మంత్రి ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

మాజీ శాసనసభ్యులు తీగల కృష్ణారెడ్డి

మహేశ్వరం , అక్టోబర్ 29, (ప్రజా కలం):

భారతీయ సాంప్రదాయ దుస్తుల బ్రాండ్‌గా ఎంతో ప్రాచుర్యం పొందిన 'రామ్ రాజ్ కాటన్' నూతన షోరూమ్ హైదరాబాద్‌లోని మహేశ్వరం నియోజకవర్గం బాలాపూర్ సత్యసాయి నగర్, ఆర్ సి ఐ రోడ్ లో ఘనంగా ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి మహేశ్వరం నియోజకవర్గ ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మాజీ శాసనసభ్యులు తీగల కృష్ణారెడ్డి గారితో కలిసి రిబ్బన్ కట్ చేసి షోరూమ్ ను లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ రామ్ రాజ్ కాటన్ సంస్థ సాంప్రదాయ దుస్తులకు పెట్టింది పేరుగా నిలిచిందని, బాలాపూర్ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వస్త్రాలు అందుబాటులోకి రావడం సంతోషకరమని అన్నారు. నూతన షోరూమ్ వ్యాపారం దినదినాభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో రామ్ రాజ్ సంస్థ జనరల్ మేనేజర్ శైలేంద్ర నాయర్ తో పాటు ప్రకాష్, గణేష్, సతీష్, రవికుమార్, వెంకటేష్ పలువురు ప్రజా ప్రతినిధులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.



పులిమామిడిలో పీవీసీ ఇటుక బట్టీ మోసం బట్టబయలు

-15 వేలకు బదులు 6 వేలు -అమాయకులను మోసం చేస్తున్న కరీంనగర్ పి వి సి " ముఠా

- మహేశ్వరం ఇటుక బట్టీ సంఘం చొరవతో పట్టివేత



మహేశ్వరం, అక్టోబర్ 30, (ప్రజా కలం):

అమాయకులను మోసం చేస్తూ తప్పించుకు తిరుగుతున్న "కరీంనగర్ పీవీసీ " ఇటుక బట్టీ సిబ్బందిని మహేశ్వరం ఇటుక బట్టీ సంఘం సభ్యులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు.

అసలేం జరిగిందంటే...స్థానికుల వివరాల ప్రకారం.. కందుకూరు పోలీస్ స్టేషన్ పరిధి పులిమామిడి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి తన కొత్త ఇంటి నిర్మాణం కోసం "కరీంనగర్ఎఁజ" కంపెనీకి చెందిన ఇటుక బాగుంటుందనే ఉద్దేశంతో 15 వేల ఇటుకలకు ఆర్డర్ చేశాడు. శుక్రవారం ఉదయం పీవీసి బట్టీ సిబ్బంది లారీలో లోడ్ దించారు.అయితే ఇటుకలు తక్కువగా కనిపించడంతో అనుమానం వచ్చిన ఇంటి యజమాని వెంటనే మహేశ్వరం ఇటుక బట్టీ సంఘానికి సమాచారం ఇచ్చాడు. వారు సంఘటన స్థలానికి చేరుకుని నిందితుల ముందే వారితోనే ఇటుకలను లెక్కించడంతో అసలు బండారం బయటపడింది.ఇటుకలను సందులు సందులుగా పేరుస్తూ 15 వేల ఇటుకలు ఉన్నట్టు చూపిస్తూ మోసానికి పాల్పడ్డారు. మహేశ్వరం ఇటుక బట్టీ యాజమాన్యం చొరవ తీసుకొని క్షుణ్ణంగా లెక్కించగా 15 వేలకు బదులు కేవలం 6 వేల ఇటుకలే ఉన్నట్లు తేలింది. దీంతో స్థానికులతో పాటు మహేశ్వరం ఇటుక బట్టీ సంఘం సభ్యులు అవాక్కయ్యారు.వెంటనే బాధితుడు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సంఘటన స్థలానికి చేరుకున్న కందుకూరు పోలీసులు "కరీంనగర్ PVC' ఇటుక బట్టీ సిబ్బందితో పాటు ఇటుకల లోడ్ తీసుకొచ్చిన లారీని (TS 07 UJ 8379) స్వాధీనం చేసుకుని కందుకూరు పోలీస్ స్టేషన్ కు తరలించారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి:

ఆన్‌లైన్‌లో ఇటుకలు కొనుగోలు చేసే ముందు అమ్మేవారి వివరాలు, ఇటుకల పరిమాణం, నాణ్యత, ధర తదితర అంశాలను పూర్తిగా నిర్ధారించుకోవాలి. ముందస్తుగా డబ్బులు చెల్లించే విషయంలో జాగ్రత్త వహించాలి. కేవలం ఆన్‌లైన్ ప్రకటనలు, ఫోన్‌లో చెప్పే మాయమాటలు నమ్మి మోసపోవద్దు. ఇటుకలు అందిన తర్వాత ఆర్డర్ చేసిన సంఖ్య, నాణ్యత సరిగా ఉన్నాయో లేదో పరిశీలించాలి. ఎవరైనా మోసానికి పాల్పడితే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలి.

కేంద్రం అడ్డంకులను దాటుకుని ఢిల్లీకి రంగారెడ్డి కాంగ్రెస్ శ్రేణులు

నవంబర్ 1న రాంలీలా మైదానంలో మహాధర్నా

ధర్నాకు విమానాలు, బస్సుల ద్వారా తరలింపు

డిసిసి అధ్యక్షురాలు పారిజాత నరసింహారెడ్డి



రంగారెడ్డి, అక్టోబర్ 29, (ప్రజా కలం ప్రతినిధి)

దేశంలో ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగ హక్కులను కాపాడేందుకు, ఓటు హక్కు పరిరక్షణ కోసం ఏఐసీసీ మరియు ఇండియా కూటమి పిలుపుమేరకు నవంబర్ 1న న్యూఢిల్లీలోని చారిత్రాత్మక రాంలీలా మైదానంలో నిర్వహించనున్న భారీ బహిరంగ సభకు రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ శ్రేణులు ఉత్సాహంగా తరలివెళ్తున్నాయి. ఈ సందర్భంగా రంగారెడ్డి డీసీసీ అధ్యక్షురాలు పారిజాత నర్సింహారెడ్డి మాట్లాడుతూ తెలంగాణ నుండి కాంగ్రెస్ కార్యకర్తలు ఢిల్లీ వెళ్లేందుకు టీపీసీసీ తరఫున ప్రత్యేక రైళ్లు కేటాయించాలని కోరినప్పటికీ, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కక్షపూరిత రాజకీయాలతో రైళ్లను నిరాకరించిందని మండిపడ్డారు. ఎన్ని అడ్డంకులు సృష్టించినా ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం సాగే ఈ ఉద్యమాన్ని ఆపడం ఎవరి తరం కాదని స్పష్టం చేశారు.ప్రత్యేక రైళ్లు నిరాకరించినప్పటికీ వెనక్కి తగ్గకుండా, రంగారెడ్డి జిల్లాలోని షాద్‌నగర్, శేరిలింగంపల్లి, రాజేంద్రనగర్, మహేశ్వరం, ఇబ్రహీంపట్నం, ఎల్.బి.నగర్, చేవెళ్ల, కల్వకుర్తి నియోజకవర్గాలకు చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు ప్రత్యామ్నాయ మార్గాలైన ప్రత్యేక బస్సులు, విమానాలు రెగ్యులర్ రైలు టికెట్ల ద్వారా వేలాదిగా ఢిల్లీకి ప్రయాణమవుతున్నారని తెలిపారు.ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ , రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, మరియు టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ పిలుపు మేరకు జిల్లాలోని అన్ని మండల, టౌన్, డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు, యువజన కాంగ్రెస్, మహిళా కాంగ్రెస్ అనుబంధ సంఘాల నాయకులు రాంలీలా మైదానానికి చేరుకుంటున్నారని తెలిపారు.

బాలాపూర్ లోని ప్రశాంతి నగర్ ఫేజ్-2 రోడ్ల దుస్థితి దారుణం

-పట్టించుకోని అధికారులు- ప్రశాంతి నగర్ సమస్యలు పరిష్కరించాలి

-సీపీఐ పార్టీ బాలాపూర్ మండల కార్యదర్శి ముకుందం గారి చంద్రశేఖర్ రెడ్డి





మహేశ్వరం , అక్టోబర్ 30, (ప్రజా కలం): మహేశ్వరం నియోజకవర్గం బాలాపూర్ మండల్ లెనిన్ నగర్ లోని ప్రశాంతి నగర్ ఫేజ్-2 రోడ్ల పరిస్థితి అత్యంత దారుణంగా తయారైందని, గుంతలతో, మురుగు నీరు నిలిచి పిల్లలు, పెద్దల ఆరోగ్యం చెడిపోయే పరిస్థితి నెలకొందని సీపీఐ పార్టీ బాలాపూర్ మండల కార్యదర్శి ముకుందం గారి చంద్రశేఖర్ రెడ్డిలి ఒక పత్రికా ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు.రోడ్లు సరిగా లేక వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఈ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని ఈ నియోజకవర్గ ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి గారినిలి కోరుతున్నట్లు తెలిపారు. రోడ్లు, డ్రైనేజీలను తక్షణమే బాగు చేయాలని సీపీఐ పార్టీ డిమాండ్ చేస్తుందన్నారు.ఓట్ల సమయం వచ్చినప్పుడు మాత్రమే పేదోడు దేవుడిలా కనిపిస్తాడని, తర్వాత పేదోడి ఇంటి ముందు రోడ్డు చెడిపోయినా పట్టించుకునే నాయకుడు లేడని విమర్శించారు.పెద్ద పెద్ద నాయకులు డబ్బున్న వారి కాలనీల్లో రోజూ ఉదయం, సాయంత్రం రోడ్లు మరమ్మతు చేస్తారని, అదే పేదోడి కాలనీలో మురికి నీరు ఇంట్లోకి వచ్చినా పట్టించుకోరని, కారణం ఇప్పుడు మన ఓట్లు అవసరం లేదని ఎద్దేవా చేశారు. ఒక బిర్యానీకి, ఒక మందు సీసాకు మన పవిత్రమైన ఓటు అమ్ముకుంటే మన కాలనీ పరిస్థితి ఎప్పటికీ ఇలానే ఉంటుంది" అని ప్రజలకు హితవు పలికారు.

అయ్యప్ప నామస్మరణతో శబరిమల పాదయాత్ర చేపట్టిన మన్‌సాన్‌పల్లి అయ్యప్ప స్వాములు

మహేశ్వరం, అక్టోబర్ 30, (ప్రజా కలం)

రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండల పరిధిలోని మన్‌సాన్‌పల్లి గ్రామం నుంచి అయ్యప్ప స్వాములు శబరిమల పుణ్యక్షేత్రానికి పాదయాత్రగా బయలుదేరారు. అయ్యప్ప మాలధారణ చేసి మండల దీక్షను పాదయాత్ర ద్వారా పూర్తి చేస్తామని, భక్తిశ్రద్ధలతో ఇరుముడులు ధరించి శబరిమల యాత్రను ప్రారంభించారు.ఈ పాదయాత్రకు దేవేందర్ నాయక్ గురుస్వామి, పసుపుల బాలు గురుస్వామి నాయకత్వం వహించగా, ఏర్పుల గణేష్ కత్తి స్వామి తదితర అయ్యప్ప స్వాములు యాత్రలో పాల్గొన్నారు. స్వామివారి నామస్మరణతో గ్రామం నుంచి బయలుదేరిన భక్తులు, మార్గమధ్యంలో అయ్యప్ప నామజపం చేస్తూ తమ పాదయాత్రను కొనసాగించనున్నారు.ప్రతి సంవత్సరం అయ్యప్ప స్వామి దీక్ష చేపట్టి నియమ నిష్ఠలతో శబరిమల యాత్రకు వెళుతున్నట్టు వారు పేర్కొన్నారు. స్వామివారి దర్శనం చేసుకుని యాత్రను విజయవంతంగా పూర్తి చేసుకోవాలనే సంకల్పంతో పాదయాత్రకు శ్రీకారం చుట్టినట్టు తెలిపారు.



ఘనంగా గజ్వేల్ మండల కుమ్మర సంఘం సర్వసభ్య సమావేశం

- మండల అధ్యక్షుడిగా తోవ్వాల యాదగిరి..

- ప్రధాన కార్యదర్శిగా నాగపురి చందు ఎన్నిక



గజ్వేల్ నియోజకవర్గం, అక్టోబర్ 30 (ప్రజా కలం ప్రతినిధి):

సిద్దిపేట జిల్లా కమిటీ,గజ్వేల్ నియోజకవర్గ కమిటీ ఆధ్వర్యంలో గజ్వేల్ మండల కుమ్మర సంఘం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని 26 గ్రామాల కమిటీ సభ్యుల సమక్షంలో నూతన మండల కమిటీని ఎన్నుకున్నారు.నూతన కమిటీ అధ్యక్షుడిగా తోవ్వాల యాదగిరి, ప్రధాన కార్యదర్శిగా నాగపురి చందు, కోశాధికారిగా కొలిచెలిమే కుమార్,ప్రచార కార్యదర్శిగా కానుగుల విఠల్, గౌరవ అధ్యక్షుడిగా నాగపురి బాబు,అసోసియేట్ అధ్యక్షుడిగా బి. పోచయ్య ఎన్నికయ్యారు.ఈ సందర్భంగా కుమ్మర సంఘం సీనియర్ నాయకులు,సభ్యులు నూతన కమిటీకి అభినందనలు తెలిపారు.అనంతరం నూతన అధ్యక్షుడు తోవ్వాల యాదగిరి మాట్లాడుతూ,కుమ్మర సంఘం అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు.సంఘం సభ్యులంతా ఐక్యంగా ముందుకు సాగి, తమ హక్కులను సాధించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కుమ్మర సంఘం నాయకులు,సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సాధనలో కళా జోరు..

- సంగీతం, నృత్యంలో విద్యార్థుల ప్రతిభాపాటవాలు..

పటాన్‌చెరు, అక్టోబర్ 30 (ప్రజా కలం) ప్రతినిధి

విద్యార్థుల్లో దాగి ఉన్న కళా నైపుణ్యాలను వెలికితీస్తూ, సృజనాత్మకతకు వేదికగా గీతం విద్యాసంస్థలో నిర్వహించిన సాధన--2026 కళా ప్రదర్శన ఆకట్టుకుంది. సంగీతం,



నృత్యం, నాటకం, దృశ్య కళల్లో విద్యార్థులు తమ ప్రతిభను చాటుకున్నారు. హైదరాబాద్‌లోని గీతం మానవీయ, సామాజిక శాస్త్రాల పాఠశాల లలిత, ప్రదర్శన కళల విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. కర్ణాటక సంగీతం, భరతనాట్యం, కూచిపూడి, నాటకం, దృశ్య కళల్లో శిక్షణ పొందుతున్న విద్యార్థులు తమ ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. అధ్యాపకుల మార్గదర్శకత్వంలో విద్యార్థులు బృందాలుగా ఏర్పడి తమ కళా నైపుణ్యాలను ప్రదర్శించారు. సంగీత ప్రదర్శనలకు మృదంగంపై చంద్రకాంత్, వయోలిన్‌పై వాసు శాస్త్రి సహకారం అందించారు. ఈ కార్యక్రమం విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, సృజనాత్మకత, వేదికపై ప్రదర్శన సామర్థ్యాలను పెంపొందించడంతో పాటు వారి అభ్యసన ప్రగతిని చాటిచెప్పింది. విద్యార్థుల ప్రతిభను అధ్యాపకులు, తోటి విద్యార్థులు అభినందించారు. భావి కళాకారులను ప్రోత్సహించే వేదికగా సాధన--2026 నిలిచింది..

నిశ్చితార్థానికి రాజకీయ దిగ్గజాల క్యూ..

- నూతన వధూవరులను ప్రముఖులు ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు.

పటాన్‌చెరు, అక్టోబర్ 30 (ప్రజా కలం) ప్రతినిధి

పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి కుటుంబంలో జరిగిన వివాహ నిశ్చితార్థ వేడుక రాజకీయ, అధికార ప్రముఖుల రాకతో ఘనంగా జరిగింది. ఎమ్మెల్యే సోదరుడు గూడెం మధుసూదన్ రెడ్డి కుమారుడు సందీప్ రెడ్డి, ఆర్టీసీ ఎండీ, ఐపీఎస్ అధికారి వై. నాగిరెడ్డి



కుమార్తె హర్షతి నిశ్చితార్థం శుక్రవారం హైదరాబాద్‌లోని జేఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకకు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్ రావు, మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, మాజీ గవర్నర్ సీహెచ్ విద్యాసాగర్ రావు, పలువురు ప్రజాప్రతినిధులు, పోలీస్ ఉన్నతాధికారులు, ప్రభుత్వ శాఖల ప్రముఖులు హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన వధూవరులు సందీప్ రెడ్డి, హర్షతి జంటను ప్రముఖులు ఆశీర్వదించి, వైవాహిక జీవితం సుఖసంతోషాలతో సాగాలని ఆకాంక్షించారు..

నీటిని పొదుపుగా వినియోగించుకోవాలి

మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిశెట్టి చందన రవీందర్

గజ్వేల్,అక్టోబర్ 30 (ప్రజా కలం ప్రతినిధి):

నీటి వృథాను అరికట్టి,ప్రతి ఒక్కరూ నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని గజ్వేల్--ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిశెట్టి చందన రవీందర్ సూచించారు.మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో ఆమె అధ్యక్షతన,కమిషనర్ పి.గణేష్ రెడ్డి ఆధ్వర్యంలో కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో పట్టణ అభివృద్ధి, ప్రజా సౌకర్యాలు,వివిధ వార్డుల్లో నెలకొన్న సమస్యలపై కౌన్సిలర్లు చర్చించి పలు అంశాలను ప్రస్తావించారు.ఈ సందర్భంగా కొన్ని వార్డుల్లో నీటి వృథా జరుగుతోందని కౌన్సిలర్లు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు.దీనిపై చైర్‌పర్సన్ స్పందిస్తూ,రానున్న రోజుల్లో ఎల్లనినో ప్రభావంతో నీటి ఎద్దడి ఏర్పడే అవకాశం ఉన్నందున ప్రజలు ముందుగానే అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నీటిని అవసరమైన మేరకే వినియోగించాలని,వృథా కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.పట్టణంలో నీటి వృథాను అరికట్టేందుకు ప్రజలు మున్సిపాలిటీకి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.ఈ సమావేశంలో వైస్ చైర్‌పర్సన్ కళ్యాణ్ కర్ పద్మాబాయి నర్సింగరావు,కౌన్సిల్ సభ్యులు,వివిధ విభాగాల అధికారులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



మల్లన్న సాగర్ నిర్వాసితులకు అన్ని పన్నుల నుంచి మినహాయింపు ఇవ్వాలి

- ఎల్ఆర్ఎస్ ఫీజు మినహాయింపుపై హర్షం..

- మరో పదేళ్లపాటు మున్సిపల్ పన్నులు లేకుండా అనుమతులు ఇవ్వాలి

- సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బండ్ల స్వామి డిమాండ్



గజ్వేల్,అక్టోబర్ 30 (ప్రజా కలం ప్రతినిధి):

మల్లన్న సాగర్ ప్రాజెక్టు భూనిర్వాసితులకు ఎల్ఆర్ఎస్ ఫీజు మినహాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం మెమో నంబర్ 9022/పీ ఎల్‌జీ-III/2026 విడుదల చేయడంపై సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బండ్ల స్వామి హర్షం వ్యక్తం చేశారు. ఈ మినహాయింపుతోపాటు గజ్వేల్--ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని ఆర్‌అండ్‌ఆర్ కాలనీల్లో నివసిస్తున్న నిర్వాసితులకు మరో పదేళ్లపాటు అన్ని రకాల మున్సిపల్ పన్నుల నుంచి మినహాయింపు కల్పిస్తూ ప్రత్యేక జీవో జారీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు.స్థానిక విలేకరులతో బండ్ల స్వామి మాట్లాడుతూ.. ప్రజాపాలనలో మల్లన్న సాగర్ నిర్వాసితులకు ప్రయోజనం చేకూర్చే దిశగా ప్రభుత్వం నుంచి వెలువడిన తొలి అధికారిక ఉత్తర్వుగా ఈ ఎల్ఆర్ఎస్ ఫీజు మినహాయింపును భావిస్తున్నామని తెలిపారు.అయితే నిర్వాసితులు ఎదుర్కొంటున్న ఇతర సమస్యలను కూడా ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు.గతంలో నిర్వాసిత గ్రామాలను మున్సిపాలిటీలో విలీనం చేసిన సమయంలో పాలనకు అనుగుణంగా వార్డుల సంఖ్యను పెంచకపోవడంతో గందరగోళం నెలకొందని బండ్ల స్వామి పేర్కొన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అర్హులైన నిర్వాసితులకు అందాల్సిన పరిహారాలు,ప్యాకేజీలు, ఇళ్లు, ఇంటి స్థలాల కేటాయింపులు, వాటికి సంబంధించిన రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ఇప్పటికీ పూర్తికాలేదని ఆరోపించారు.ఆర్‌అండ్‌ఆర్ కాలనీల్లో ప్రజలకు అవసరమైన పాఠశాలలు, ఆలయాలు,ఇతర మౌలిక సదుపాయాలు కల్పించాల్సి ఉందన్నారు.నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.గత మూడేళ్లుగా ప్రస్తుత ప్రభుత్వంపై ఆశలు పెట్టుకుని నిర్వాసితులు తమ సమస్యల పరిష్కారం కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు.మల్లన్న సాగర్ ఆర్‌అండ్‌ఆర్ కాలనీల్లో నివసిస్తున్న నిర్వాసిత కుటుంబాలకు ఉపాధి కల్పించేందుకు వివిజి రామ్ (గ్రామీణ ఉపాధి హామీ పథకం) కింద వారిని అర్హులుగా గుర్తిస్తూ ప్రత్యేక జీవో విడుదల చేయాలని బండ్ల స్వామి కోరారు. ఉపాధి అవకాశాలు కల్పించడం ద్వారా నిర్వాసిత కుటుంబాలను ఆదుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి అధికారులు తక్షణమే చర్యలు చేపట్టేలా ప్రభుత్వం అవసరమైన జీవోలు జారీ చేయాలని డిమాండ్ చేశారు. సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించకపోతే భూనిర్వాసితుల ఆగ్రహానికి గురికావాల్సి వస్తుందని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

గజ్వేల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన సీపీ

- రికార్డులు ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలి

- ట్రాఫిక్ నియంత్రణపై సిబ్బందికి రష్మీ పెరుమాళ్ సూచనలు



గజ్వేల్, అక్టోబర్ 30 (ప్రజా కలం ప్రతినిధి):

సిద్దిపేట పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాళ్,ఐపీఎస్,శుక్రవారం గజ్వేల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ ఆవరణను పరిశీలించి, కార్యాలయ రికార్డులు,రిజిస్టర్లను తనిఖీ చేశారు.సిబ్బందితో మాట్లాడి విధుల నిర్వహణ,వారు ఎదుర్కొంటున్న సమస్యల గురించి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణతో పాటు సిబ్బందికి పలు సూచనలు చేశారు. పోలీస్ స్టేషన్‌కు సంబంధించిన రికార్డులను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆదేశించారు.గజ్వేల్ పట్టణంలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా సమర్థవంతమైన ప్రణాళికతో విధులు నిర్వహించాలని సూచించారు.ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో గజ్వేల్ ఏసీపీ నరసింహులు,ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ,ట్రాఫిక్ ఎస్ఐ నీరేష్, ఇతర పోలీసు అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేసిన జెడ్పీ సీఈవో శోభారాణి

బీబీనగర్, అక్టోబర్ 30 (ప్రజాకలం): ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు, అవసరమైన సౌకర్యాలు



అందించాలని జిల్లా జెడ్పీ సీఈవో ఎన్. శోభారాణి సూచించారు. శుక్రవారం బీబీనగర్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె ఆకస్మికంగా సందర్శించి వైద్య సేవల తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా వ్యాక్సినేషన్ కార్యక్రమం, టీబీ ముక్త్ భారత్, రక్తహీనత నివారణ కార్యక్రమాల అమలు స్థితిగతులను సమీక్షించారు. ఆసుపత్రిలో వైద్య సిబ్బంది హాజరును పరిశీలించి విధుల నిర్వహణపై ఆరా తీశారు. కాలం చెల్లిన మందులను వినియోగంలో ఉన్న మందులతో కలిపి ఉంచకుండా ప్రత్యేకంగా వేరు చేసి తొలగించాలని వైద్యులు డాక్టర్ మౌనిక, డాక్టర్ పావనిలకు సూచించారు. రోగులకు అవసరమైన మందులు, వైద్య సదుపాయాలు అందుబాటులో ఉంచాలని, వైద్య సేవల్లో నాణ్యత పాటించాలని తెలిపారు.

పథకాల అమలుపై జెడ్పీ సీఈవో సమీక్ష

వీబీజీ-రామ్‌జీ సిబ్బంది పనితీరుపై ఆరా..

పీఎంఏవై పురోగతిపై పరిశీలన

బీబీనగర్, అక్టోబర్ 30 (ప్రజాకలం): మండలంలో ప్రభుత్వ పథకాల అమలు, సిబ్బంది పనితీరును యాదాద్రి భువనగిరి జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి ఎన్.శోభారాణి శుక్రవారం సమీక్షించారు. బీబీనగర్ మండల ప్రజా పరిషత్ కార్యాలయాన్ని సందర్శించిన ఆమె.. ఎంపీడీవో వై.శ్రీనివాసరెడ్డిని వీబీజీ-రామ్‌జీ సిబ్బంది విధుల నిర్వహణ, పనితీరుపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రధానమంత్రి ఆవాస్ యోజన (పీఎంఏవై) పథకం అమలు, పురోగతిని పరిశీలించారు. ప్రభుత్వ పథకాలు అర్హులైన లబ్ధిదారులకు చేరేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఈసీ, టీఏలు పాల్గొన్నారు.



స్వచ్ఛత మన బాధ్యత..శ్రమదానం మన కర్తవ్యం

- జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి,జిల్లా ఎస్పీ అక్షాంశ్ యాదవ్



యాదాద్రి భువనగిరి అక్టోబర్ 30 ప్రజాకలం:యాదాద్రి భువనగిరి జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం భువనగిరి పట్టణంలోని చెరువు కట్టపై శ్రమదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి,జిల్లా ఎస్పీ అక్షాంశ్ యాదవ్ పాల్గొని స్వయంగా శ్రమదానం చేశారు. స్వచ్ఛత మన బాధ్యత..శ్రమదానం మన కర్తవ్యం అంటూ కట్టపైన పరిసర ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టి, చెత్తాచెదారాన్ని తొలగిస్తూ పరిసరాల పరిశుభ్రతకు తమ వంతు కృషి చేశారు. ప్రజలకు వ్యక్తిగత పరిశుభ్రత,వ్యక్తిగత బాధ్యత,సామాజిక సేవ యొక్క ప్రాధాన్యతను తెలిపారు.పోలీసు అమర వీరుల త్యాగాలను స్మరించుకుంటూ నిర్వహిస్తున్న సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా కేవలం పోలీసు సేవలకే పరిమితం కాకుండా, సమాజ హితం,ప్రజా సంక్షేమం,సామాజిక బాధ్యత వంటి అంశాలపై ప్రజల్లో అవగాహన కల్పించడమే,ఈ కార్యక్రమాల ముఖ్య ఉద్దేశమని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అడిషనల్ ఎస్పీ లక్ష్మీనారాయణ, డివిస్పీలు రవీందర్, శ్రీనివాస్ నాయుడు,సురేష్,సిఐలు సత్యనారాయణ,వెంకటేశ్వర్లు, మున్సిపల్ చైర్మన్ తంగళ్ళపల్లి శ్రీవాణి,గ్రంథాలయ చైర్మన్ ఆవైస్ చిస్తీ తదితరులు పాల్గొన్నారు.

రొమ్ము క్యాన్సర్ చికిత్సలో నైపుణ్యాలు పెంపొందించాలి

- వైద్యుల్లో శస్త్రచికిత్స నైపుణ్యాల పెంపునకు ప్రత్యేక శిక్షణ

- 24 మంది వైద్యులకు అధునాతన శస్త్రచికిత్స పద్ధతులపై అవగాహన



బీబీనగర్, అక్టోబర్ 30 (ప్రజాకలం): రొమ్ము క్యాన్సర్ చికిత్సలో అత్యాధునిక శస్త్రచికిత్స పద్ధతులపై వైద్యుల నైపుణ్యాన్ని పెంపొందించేందుకు బీబీనగర్ ఎయిమ్స్ లో ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. రొమ్ము క్యాన్సర్ అవగాహన మాసాన్ని పురస్కరించుకుని అక్టోబరు 29న జనరల్ సర్జరీ, అనాటమీ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో ఎంఆర్ఎం మాస్టరీ ఆఫ్ ఆక్సిలరీ డిసెక్షన్' పేరుతో ఒకరోజు శిక్షణ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ అమిత అగర్వాల్, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ మహేశ్వర్ లక్కిరెడ్డి, డీన్ అకడమిక్స్ డాక్టర్ నితిన్ అశోక్ జాన్ మార్గదర్శకత్వంలో కార్యక్రమం కొనసాగింది. డాక్టర్ ప్రియదర్శన్ జటేగావంకర్ అధ్యక్షతన, డాక్టర్ సునీల్ కుమార్ కార్యదర్శిగా, డాక్టర్ కృష్ణ రామావత్, డాక్టర్ మృదుల చంద్రపుట్ల సహ కార్యదర్శులుగా వ్యవహరించారు. ఈ సందర్భంగా పద్మశ్రీ పురస్కార గ్రహీత, డాక్టర్ బి.సి. రాయ్ జాతీయ పురస్కార విజేత, కిమ్స్-ఉషాలక్ష్మి రొమ్ము వ్యాధుల కేంద్రం వ్యవస్థాపకుడు డాక్టర్ పి. రఘురామ్ ముఖ్య ఉపన్యాసం చేశారు. శస్త్రచికిత్సతోనే క్యాన్సర్ చికిత్స పూర్తికాదని, వ్యాధిపై ప్రజల్లో అవగాహన కల్పించడం, ముందస్తుగా గుర్తించడం, రోగులకు సమగ్ర వైద్యం అందించడం కూడా అంతే ముఖ్యమని వివరించారు.

శిక్షణలో భాగంగా నిపుణుల ప్రసంగాలు, ముఖాముఖి చర్చలతో పాటు కడవర్‌పై ప్రత్యక్ష శస్త్రచికిత్స శిక్షణ ఇచ్చారు. మాస్టెక్టమీ, చర్మపు పొరల తొలగింపు, చంక ప్రాంతంలోని శోషరస కణుపుల తొలగింపు వంటి అధునాతన పద్ధతులపై అవగాహన కల్పించారు. వైద్య రంగంలో నైపుణ్యాభివృద్ధికి, రొమ్ము క్యాన్సర్ బాధితులకు మెరుగైన చికిత్స అందించేందుకు ఇటువంటి శిక్షణ కార్యక్రమాలు దోహదపడతాయని నిర్వాహకులు పేర్కొన్నారు.

మూడు సర్కిళ్లు.. ఒక్కరే టౌన్ ప్లానింగ్ అధికారి!

- మల్కాజిగిరి, మౌలాలి, కీసర సర్కిళ్లలో అస్తవ్యస్తంగా పట్టణ ప్రణాళిక వ్యవస్థ

- భవన నిర్మాణ అనుమతుల కోసం ప్రజల ఎదురుచూపులు.. అక్రమ కట్టడాల నియంత్రణపై కొరవడిన పర్యవేక్షణ

- అక్రమ నిర్మాణాల వద్ద అవినీతి ఆరోపణలు.. ఉన్నతాధికారులు స్పందించాలంటున్న స్థానికులు

మల్కాజిగిరి,
అక్టోబరు 30 (ప్రజా కలం ప్రతినిధి):

మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పట్టణ ప్రణాళిక విభాగం పనితీరు అస్తవ్యస్తంగా మారిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మల్కాజిగిరి జోనల్ పరిధిలోని మల్కాజిగిరి, మౌలాలి, కీసర మూడు సర్కిళ్లకు ఒక్కరే టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ (టీపీఎస్) విధులు నిర్వహిస్తుండటంతో ప్రజలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. సదరు అధికారి తరచూ సెలవుల్లో ఉండటంతో భవన నిర్మాణ అనుమతుల కోసం దరఖాస్తు చేసుకున్న వారు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి నెలకొందని పలువురు ఆరోపిస్తున్నారు.

ప్రభుత్వానికి ఆదాయం సమకూర్చే భవన నిర్మాణ అనుమతుల దరఖాస్తుల పరిశీలన, అనుమతుల జారీ వంటి పనులే సకాలంలో జరగకపోతే, ప్రభుత్వానికి ఆదాయం రాకుండా ప్రజలకు నష్టం కలిగించే అక్రమ నిర్మాణాలను అరికట్టే విషయంలో టౌన్ ప్లానింగ్ అధికారులు, సిబ్బంది ఏ మేరకు పర్యవేక్షణ చేస్తున్నారనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. మూడు సర్కిళ్లకు సరిపడా సిబ్బంది లేకపోవడం వల్ల అక్రమ నిర్మాణాలపై నిఘా, క్షేత్రస్థాయి తనిఖీలు, నిబంధనల ఉల్లంఘనల గుర్తింపు వంటి కీలక బాధ్యతలు సక్రమంగా నిర్వహించబడటం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.



అనుమతుల కోసం తిరగాల్సిందే.. అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట ఎక్కడ?

నిబంధనల ప్రకారం భవన నిర్మాణ అనుమతుల కోసం దరఖాస్తు చేసుకున్న సామాన్య ప్రజలు వాటి పరిశీలన, క్షేత్రస్థాయి తనిఖీలు, అనుమతుల ప్రక్రియ కోసం రోజుల తరబడి ఎదురు చూడాల్సి వస్తోందని బాధితులు చెబుతున్నారు. మరోవైపు అనుమతులు లేకుండా, నిబంధ నలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడుతున్న వారిపై తగిన చర్యలు తీసుకోవడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. అక్రమ నిర్మాణాలను గుర్తించి అడ్డుకోవాల్సిన యంత్రాంగం బలహీనంగా ఉంటే భవిష్యత్తులో ప్రజలు, కొనుగోలుదారులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అక్రమ కట్టడాల వద్ద అవినీతి ఆరోపణలు!

ముఖ్యంగా కొన్ని ప్రాంతాల్లో అక్రమ నిర్మాణాల విషయంలో టౌన్ ప్లానింగ్ అధికారులు, సిబ్బంది వ్యవహారశైలిపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు.

నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు జరుగుతున్నప్పటికీ వాటిని అడ్డుకోవడంలో అధికారులు చొరవ చూపడం లేదని, కొన్ని అక్రమ నిర్మాణాల వద్ద లంచాల ఆరోపణలు సైతం వినిపిస్తున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు. అయితే ఈ ఆరోపణలపై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాల్సిన అవసరం ఉంది. అవినీతికి పాల్పడినట్లు తేలితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

మూడు సర్కిళ్లకు సరిపడా సిబ్బందిని నియమించాలి

మల్కాజిగిరి, మౌలాలి, కీసర సర్కిళ్లకు వేర్వేరుగా టౌన్ ప్లానింగ్ అధికారులను, అవసరమైన సిబ్బందిని నియమించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. భవన నిర్మాణ అనుమతుల దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పరిష్కరించడంతో పాటు అక్రమ నిర్మాణాలపై నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని కోరుతున్నారు. విధులకు గైర్హాజరయ్యే అధికారులు, సిబ్బంది బాధ్యతలపై కూడా ఉన్నతాధికారులు దృష్టి సారించాలంటున్నారు.ప్రభుత్వ ఆదాయానికి సంబంధించిన పనుల్లోనే జాప్యం జరుగుతుంటే, ప్రజల ఆస్తులకు, భద్రతకు సంబంధించిన అక్రమ నిర్మాణాల నియంత్రణ పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. మల్కాజిగిరి మున్సిపల్ ఉన్నతాధికారులు ఈ వ్యవహారంపై ప్రత్యేక దృష్టి సారించి పట్టణ ప్రణాళిక విభాగాన్ని ప్రక్షాళన చేయడంతో పాటు ప్రజలకు జవాబుదారీతనంతో కూడిన సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

-రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలి

- ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి

బీబీనగర్, అక్టోబర్ 30 (ప్రజాకలం) : కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి అన్నారు. మండలంలోని కొండమడుగు, రాఘవాపురం, బ్రహ్మణపల్లి గ్రామాల్లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను శుక్రవారం ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రైతులు పండించిన ధాన్యాన్ని సకాలంలో కొనుగోలు చేసి, వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులకు, కేంద్రాల నిర్వాహకులకు సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ధాన్యం కొనుగోళ్లలో జాప్యం లేకుండా చర్యలు తీసుకుంటోందని, రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దని భరోసా ఇచ్చారు.ప్రతి ధాన్యం బస్తాకు 41 కిలోలు మాత్రమే కాంటా తూకం వేయాలని,అదనపు తూకం పేరుతో రైతులను ఇబ్బందులకు గురిచేయవద్దని స్పష్టం చేశారు.కొనుగోలు కేంద్రాల ఇన్‌చార్జీలు రైతులకు అందుబాటులో ఉంటూ కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలన్నారు.కొనుగోలు కేంద్రాల్లో రైతులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించి, ధాన్యం సేకరణను సకాలంలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని, వారు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేసేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే తెలిపారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ పొట్లోళ్ల శ్యామ్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు పంజాల రామాంజనేయులు గౌడ్, గోలి పింగల్ రెడ్డి, మండల అధ్యక్షుడు సురకంటి సత్తి రెడ్డి,కాసుల ఆంజనేయులు గౌడ్, సీనియర్ నాయకులు గడ్డం బాల్ రెడ్డి, పిఎసిఎస్ వైస్ చైర్మన్ వాకిటి చంద్ర శేఖర్ రెడ్డి, డైరెక్టర్లు,ఆయా గ్రామాల సర్పంచులు, అధికారులు, కాంగ్రెస్ గ్రామ శాఖ, పట్టణ అధ్యక్షులు,నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పోలీస్ స్టేషన్ పనితీరుపై అవగాహన: సీఐ చంద్రశేఖర్ రెడ్డి

నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) అక్టోబరు 30:

సమాజంలో శాంతిభద్రతలను కాపాడటంలో పోలీసుల పాత్ర అత్యంత కీలకమని, విద్యార్థులు పోలీసు సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆర్మూర్ సీఐ చంద్రశేఖర్ రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం ఆర్మూర్ పోలీస్ స్టేషన్‌లో స్థానిక క్షత్రియ పాఠశాల విద్యార్థుల కోసం ప్రత్యేకంగా 'ఓపెన్ హౌస్' కార్యక్రమాన్ని నిర్వహించారు. సీఐ చంద్రశేఖర్ రెడ్డి పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది విద్యార్థులకు స్టేషన్ పనితీరును కూలంకషంగా వివరించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితుల వివరాలను నమోదు చేసే రిసెప్షన్ డెస్క్ నుండి మొదలుకొని, లోపల ఉండే వివిధ విభాగాలను విద్యార్థులకు ప్రత్యక్షంగా చూపించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. విద్యార్థులకు చిన్నతనం నుంచే చట్టాలపై, పోలీసుల బాధ్యతలపై అవగాహన కల్పించాలనే ఉద్దేశంతోనే ఈ ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పోలీస్ స్టేషన్‌లో జరిగే రోజువారీ కార్యకలాపాలు, విధి నిర్వహణలో సిబ్బంది పాత్రలు, సమాజ రక్షణలో వారు తీసుకునే జాగ్రత్తలను విద్యార్థులకు వివరించారు. పోలీసులను చూసి భయపడాల్సిన అవసరం లేదని, వారు ఎల్లప్పుడూ ప్రజల రక్షణ కోసమే పనిచేస్తారని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో క్షత్రియ పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



విద్యుత్ కోతలతో రైతు తిప్పలు..

పంటకు పతమే దిక్కు!

- అప్పులు చేసి సాగు.. నీటి కోసం అవస్థలు

- 66 ఏళ్లు దాటినా అందని పింఛన్.. కలెక్టర్‌కు వేడుకోలు



డబ్బా నుండి పొలాల్లోకి నీరు పోస్తున్న దృశ్యం



66 ఏళ్లు నిండినా వృద్ధాప్య పింఛన్ అందడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్న రైతు కనకయ్య. పింఛన్ మంజూరు చేసి ఆదుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి.

గజ్వేల్ నియోజకవర్గం,
అక్టోబర్ 30 (ప్రజా కలం ప్రతినిధి):

ఆధునిక వ్యవసాయ యుగం లోనూ సాగునీటి కోసం ఓ రైతు సంప్రదాయ ఏతాన్ని ఆశ్రయించాల్సిన పరిస్థితి నెలకొం ది. ఒకవైపు విద్యుత్ కోతలు.. మరోవైపు సాగునీటి కొరత.. వెరసి అప్పులు చేసి సాగు చేసిన పంటను కాపాడుకునేందుకు ఆ రైతు పడుతున్న కష్టం అన్నదాతల పరిస్థితికి అద్దం పడుతోం ది.సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం శేర్‌పల్లి గ్రామానికి చెందిన గిరిజన రైతు కూరాకుల కనకయ్య ఏతం సాయంతో నీటిని తోడుతూ పంటను కాపాడుకునేందుకు శ్రమిస్తున్నారు.

ఏతంతో పంటకు నీరు

కనకయ్యకు వ్యవసాయమే జీవనా ధారం.తనకున్న ఎకరన్నర పొలంలో పంట సాగు చేయగా,విద్యుత్ కోతలు, వర్షాభావ పరిస్థితులు ఇబ్బందులకు గురిచేస్తున్నాయి.బోర్లు ఉన్నప్పటికీ సక్రమంగా విద్యుత్ సరఫరా కాకపోవడంతో పంటకు నీరందించడం కష్టంగా మారింది.దీంతో పంట ఎండిపోకుండా ఉండేందు కు సంప్రదాయ ఏతం పద్ధతిని ఆశ్రయించారు. చెట్టుకు కట్టెను కట్టి, ఒకవైపు రాళ్లతో బరువు ఏర్పాటు చేసి,మరోవైపు బొక్కెన సాయంతో నీటిని పైకి తోడుతూ పొలానికి అందిస్తున్నా రు.అప్పులు చేసి సాగు చేసిన పంటను కాపాడు కునేందుకు ఆయన చేస్తున్న ప్రయత్నం పలువురిని కదిలిస్తోంది.

అందని వృద్ధాప్య పింఛన్

వ్యవసాయ కష్టాలతో పాటు వ్యక్తిగత సమస్యలు కూడా తనను వేధిస్తున్నాయని కనకయ్య తెలిపారు. తనకు 66 ఏళ్లు దాటినా ఇప్పటివరకు పింఛన్ మంజూరు కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు.పింఛన్ కోసం పలుమార్లు అధికారులను సంప్రదించినప్పటికీ ఫలితం లేకపోయిందని పేర్కొన్నారు. సిద్దిపేట జిల్లా కలెక్టర్ కె.హైమావతి, రాష్ట్ర ప్రభుత్వం స్పం దించి తనకు పింఛన్ మంజూరు చేయాలని కనకయ్య విజ్ఞప్తి చేస్తున్నారు.వ్యవసాయానికి సక్రమంగా విద్యుత్ సరఫరా చేసి పంటను కాపాడుకునేందుకు సహకరించాలని కోరుతున్నారు. పంటను రక్షించుకునేందుకు ఏతంతో శ్రమిస్తున్న తనకు,పింఛన్ మంజూరు ద్వారా కూడా ప్రభుత్వం అండగా నిలవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



పురాతన పద్ధతితో మురికి కాలువల నీటితో కనకయ్య దంపతులు పరిపంటకు నీరు పోస్తున్న దృశ్యం

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి

వలిగొండ అక్టోబర్ 30 ప్రజాకలం:రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని,భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి అన్నారు.శుక్రవారం వలిగొండ మండల పరిధిలోని ఏదులగూడెం,పొద్దుటూరు, మాందాపురం,వలిగొండ మార్కెట్ యార్డ్ లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి మాట్లాడారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోలు సజావుగా సాగేలా అధికారులు చర్యలు తీసుకోవా లన్నారు. రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వ ఏర్పాటు చేసిన కేంద్రాలలో మద్దతు ధర పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో పిఏసిఎస్ చైర్మన్ గరిసె రవి,మండల అధ్యక్షుడు బత్తిని సహదేవ్,పట్టణ అధ్యక్షులు జానకిరాములు, వ్యవసాయ శాఖ అధికారి అంజనీ దేవి,ఏపిఎం అంజయ్య,పిఎసిఎస్ డైరెక్టర్లు,రైతులు,కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు



నల్ల పోచమ్మ అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరికీ సుఖసంతోషాలు కలగాలి -కూన శ్రీశైలం గౌడ్

ప్రజాకలం/ కుత్బుల్లాపూర్ (ప్రతినిధి) చింతల్ డివిజన్ పరిధి సంజీవయ్య నగర్ లో నల్ల పోచమ్మ ఆలయ ప్రాంగణంలో చింతల్ – కుత్బుల్లాపూర్ ఆర్య వైశ్య సంఘం సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించిన వరుణ యాగానికి కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలంగౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా యాగంలో పాల్గొని నల్ల పోచమ్మ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ... నల్ల పోచమ్మ అమ్మవారి ఆశీస్సులతో రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి, నీటి ఎద్దడి లేకుండా ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు. ప్రజలందరిపై అమ్మవారి కృపాకటాక్షాలు ఎల్లప్పుడూ ఉండాలని ప్రార్థించినట్లు తెలిపారు. అనంతరం కమిటీ సభ్యులు కూన శ్రీశైలం గౌడ్ ని శాలువాతో ఘనంగా సత్కరించి, తీర్థప్రసాదాలు అందజేశారు.ఈకార్యక్రమంలో చింతల్ కుత్బుల్లాపూర్ ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు విజయ్ గుప్తా, ప్రభు రాజుగుప్త, శ్రీనివాస్ గుప్తా, కృష్ణ, రాజు, ఆంజనేయులు గుప్త తదితరుల తో పాటు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.






తొలి మహిళా కామ్రేడ్ జీవిత చరిత్ర ఆవిష్కరణ

నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) అక్టోబరు 30:

శుక్రవారం ముంబై ప్రెస్ క్లబ్ లో "కామ్రేడ్ పార్వతీబాయి భోర్ ఏ ఫైటర్ స్టోరీ" పుస్తకం ఆవిష్కరణ జరిగింది. పార్వతీబాయి (మంగలి) కుటుంబంలో 1908లో ముంబై పరేల్ జన్మించింది. ఆమె ఓ పోరాట యోధురాలు ఆత్మకథ తోలిసారి ఆంగ్లంలో అనువాదం లీన మత్తయి చేయగా, శారద సాఠే, ఎస్.వందన స్టేజిని అలంకరించారు. ఐతే ఆమె 9ఏళ్ల వయస్సులోనే పెళ్లి చేయబడి, 3తరగతి వరకు మాత్రమే చదువుకుంది. ఆ కాలంలో మహిళలందరి సాధారణ పరిస్థితిగా ఉండే గృహ బానిసత్వపు సంకెళ్లను తెంచుకోవడానికి పోరాడింది. ఐతే ఆమె అంటరానితనానికి కూడా గురైంది. కావున బయటి ప్రపంచంలో పని చేయాలనే తీవ్రమైన ఆసక్తితో, ఆమె ఎర్రజెండా పట్ల ఆకర్షితురాలైంది. కమ్యూనిస్ట్ పార్టీ కార్యకర్తగా మారడమే కాకుండా ముంబైలో మహిళా కార్మికులు 1939లో చేసిన ఐకానిక్ "బిటియా మిల్" సమ్మె విజయవంతం తోసహా, 45రోజులు అండర్ గ్రౌండ్, 16నెలల పాటు జైలుపాలు, 18రోజులుగా నిరహార దీక్ష కొనసాగించారు. ఇలా అనేక చిరస్మరణీయ ఉద్యమాలలో ఆమె కీలకపాత్రను పోషించిందని అనువాదకులు తెల్పారు. ఈ స్ఫూర్తిదాయక పుస్తకం త్వరలో ఇతర భాషల్లోకి అనువాదం కానుందని నిర్వాహకులు అన్నారు.



Corporate .Office :1-7-511/4, Gemini Colony, Near Pochamma Temple, Zamistanpur, HYDERABAD, TELANGANA, 500020 Cell: 9010972526

Printed, Published and owned by **KALAKONDA RAMAKRISHNA**, Printed at **TEJOMAI PUBLICATION**, H.No. 2-24/98/BLN Colony, IDA Uppal Medchal-Malkajgiri, Hyderabad, Telangana-50013
Published from H.No.10-1-7, Bada Bazar, Beside Pothalingaiah Temple, Azam Raod, Nizamabad,Telangana -503001
Editor: **KALAKONDA RAMAKRISHNA**, **PRGI.No. TELTEL/2010/33275,** Cell: 90109 72526, Email:prajakalam2010@gmail.com



భారతీయ జనతా పార్టీ మోర్చాల కమిటీ అధ్యక్షులను ప్రకటించిన రంగారెడ్డి జిల్లా బిజెపి అధ్యక్షులు పంతంగి రాజభూపాల్ గౌడ్

మహేశ్వరం, అక్టోబర్ 29,(ప్రజా కలం)

రంగారెడ్డి జిల్లా బిజెపి అధ్యక్షులు పంతంగి రాజభూపాల్ గౌడ్ మహేశ్వరం నియోజకవర్గం కంటెస్టెంట్ ఎమ్మెల్యే అందేలా శ్రీరాములు యాదవ్ సూచన మేరకు జిహెచ్ఎంసి బడంగ్పేట్ సర్కిల్ లో 58 ప్రశాంతి హిల్స్ డివిజన్ బిజెపి అధ్యక్షులు పసునూరి బిక్షపతి చారి ప్రధాన కార్యదర్శులు ధ్యాసని తిరుపతిరెడ్డి. ఇంద్రవత్ రవి నాయక్ ఆధ్వర్యంలో భారతీయ జనతా పార్టీ మోర్చాల కమిటీ అధ్యక్షులను ప్రకటించడం జరిగింది. బీజేవైఎం అధ్యక్షుడుగా మన్యం రవీందర్ రెడ్డి 2.ఓబీసీ . మోర్చా .ప్రెసిడెంట్ గా పోలోజు రవీంద్ర చారి మహిళా మోర్చా ప్రెసిడెంట్ ఉమాదేవి, కిసాన్ మోర్చా ప్రెసిడెంట్ గా లిక్కి కృష్ణారెడ్డి. ఎస్టీ మోర్చా ప్రెసిడెంట్ బాలు నాయక్, ఎస్సి మోర్చా ప్రెసిడెంట్ . బొల్లు శ్రీనివాస్ దాస్. మజ్దూర్ మోర్చా ప్రెసిడెంట్ గా తల కంటి శ్రీనివాస్ రెడ్డి.. సోషల్ మేడయా కన్వీనర్ . కొండ్రు దేవా,ని ప్రకటించి నియామక పత్రాలు ఇవ్వడం జరిగింది.. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా బిజెపి కార్యవర్గ సభ్యులు కీసర హరినాథ్ రెడ్డి, మురళి చారి . రఘు ప్రశాంత్ శ్రీనివాస్ పాల్గొన్నారు..

ఈటల రాజేందర్ పాదయాత్రకు సంఘీభావం తెలిపి సన్మానించిన బీజేపీ సీనియర్ నేత కోలన్ శంకర్ రెడ్డి

మహేశ్వరం అక్టోబర్ 29, (ప్రజా కలం:

రాంపల్లి చౌరస్తాలో నిర్వహించిన ఎంపీ ఈటల రాజేందర్ పాదయాత్రలిలో బీజేపీ సీనియర్ రాష్ట్ర నేత కోలన్ శంకర్ రెడ్డి మిత్రులతో కలిసి పాల్గొని సంఘీభావం తెలిపి, శుభాకాంక్షలు తెలిపి సన్మానించారు.ఈ సందర్భంగా



బీజేపీ సీనియర్ నేత కోలన్ శంకర్ రెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎన్, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వాలు తప్పుడు ప్రచారంతో బీజేపీపై బురద జల్లుతున్నాయని, దీనిపై కాంగ్రెస్ పార్టీ బీజేపీ ప్రభుత్వానికి, ప్రధానికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రామచందర్ రావు ఆధ్వర్యంలో జరగనున్న పాదయాత్రలో వేలాదిగా యువత, దేశభక్తులు, బీజేపీ శ్రేణులు తరలిరావాలని పిలుపునిచ్చారు.దేశానికి బీజేపీయే కావలాగా ఉందని, దేశ ప్రజలను కాపాడుతుందని, కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ దేశద్రోహులతో కలిసి భారత్ ను విచ్ఛిన్నం చేయాలని చూస్తున్నారని విమర్శించారు.ఈ కార్యక్రమంలో ఎర్ల మల్లేష్ ముదిరాజ్, అంజి రెడ్డి, జగన్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.



బుర్రకథతో ప్రత్యేక గుర్తింపు పొందిన రాయపోల్ విద్యార్థులు.

జిల్లాస్థాయి పోటీల్లో ప్రతిభకు పురస్కారం. డీఈఓ చేతుల మీదుగా బహుమతి ప్రదానం.

దుబ్బాక ప్రజాకలం అక్టోబర్ 30.

చదువుతో పాటు కళలు, సంస్కృతి పరిరక్షణలోనూ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు సత్తా చాటుతున్నారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన కళలు, సంస్కృతి ప్రతిభా పాటవ పోటీల్లో పీఎంశ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రాయపోల్ విద్యార్థులు బుర్రకథ ప్రదర్శనతో ప్రత్యేక గుర్తింపు పొందారు. జీవశాస్త్ర ఉపాధ్యాయుడు హరీశ్ మార్గదర్శకత్వంలో విద్యార్థులు రితిక, ప్రాణస్య, నేతాజీ అద్భుతంగా బుర్రకథ ప్రదర్శించి ప్రశంసలు అందుకున్నారు. వారి ప్రతిభను గుర్తించిన జిల్లా విద్యాశాఖ అధికారి బి. రమేష్ ప్రత్యేక బహుమతిని అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను ప్రధానోపాధ్యాయుడు ఎం. వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయ బృందం అభినందించారు. జానపద కళలను భావితరాలకు పరిచయం చేస్తూ విద్యార్థులు ప్రతిభ కనబరచడం అభినందనీయమని పేర్కొన్నారు.

ట్రాఫిక్ సమస్యను నివారించండి - సునీల్ యాదవ్ ముసివేసిన రోడ్డు తెరవాలని వినతిపత్రం

కూకట్ పల్లి, అక్టోబర్ 30, ప్రజా కలం ప్రతినిధి:

కైతలపూర్ ఫూర్ 15 ఫేసులో రోడ్డు తెరవమని వినిధి పత్రం అందజేసిన



స్టేట్ యూత్ కాంగ్రెస్ సెక్రటరీ జిట్టా రమ్యకృష్ణ సునీల్ యాదవ్ కూకట్ పల్లి నియోజకవర్గం కైతలాపూర్ 15 ఫేసులో గత కొంతకాలంగా చిత్తరమ్మ గుడి మరియు రెయిన్బో వైన్స్ వెనకాల రోడ్డు మూసివేశారు. దాని వలన ట్రాఫిక్ సమస్య పెరిగి వాహనదారులు మరియు స్థానికులు ఇబ్బందులకు గురి అవుతున్నారని తెలుసుకుని స్టేట్ యూత్ కాంగ్రెస్ సెక్రటరీ జిట్టా రమ్యకృష్ణ సునీల్ యాదవ్ కూకట్ పల్లి జోనల్ కమిషనర్ మయాంక్ సింగ్ మరియు డిప్యూటీ కమిషనర్ ఆంజనేయులు ను కలిసి అక్కడి సమస్య గురించి వివరించి వినతి పత్రము ఇవ్వడం జరిగింది. దీనిపై స్పందించిన అధికారులు సంబందిత అధికారుల ద్వారా సమస్యను తెలుసుకుని రోడ్డును తెరిపిస్తామని హామీ ఇవ్వడం జరిగింది.

వేములవాడ ప్రగతికి జోరు..

- 38 తీర్మానాలతో అభివృద్ధికి బాటలు - మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు - రూ.250 కోట్లతో ఆలయ రూపురేఖల మార్పు.. పట్టణానికి కొత్త కళ.



వేములవాడ, అక్టోబర్ 30 (ప్రజా కలం ప్రతినిధి) : వేములవాడ పట్టణ అభివృద్ధికి మరింత ఊతమిచ్చేలా మున్సిపల్ పాలకవర్గం కీలక నిర్ణయాలు తీసుకుంది,ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడం, వార్డుల వారీగా అభివృద్ధి పనులు చేపట్టడమే లక్ష్యంగా నిర్వహించిన మున్సిపల్ సర్వసభ్య సమావేశంలో 38 ఎజెండా అంశాలకు ఏకగ్రీవంగా ఆమోదం లభించింది. చైర్మన్ పుల్కం రాజు అధ్యక్షతన శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో పట్టణ ప్రగతి, పండుగల నిర్వహణ, రహదారులు, డ్రైనేజీలు, సుందరీకరణ తదితర అంశాలపై చర్చించారు.

అభివృద్ధి పనులకు ప్రాధాన్యం...

పట్టణంలో చేపడుతున్న అభివృద్ధి పనులను చైర్మన్ వివరించారు. రాజరాజేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి రూ. 250 కోట్లతో వసులు కొనసాగుతున్నాయని తెలిపారు. ఆలయ ప్రధాన రహదారిని రూ. 6.50 కోట్లతో బీటీ రోడ్డుగా అభివృద్ధి చేస్తున్నట్లు పేర్కొన్నారు. పట్టణ సుందరీకరణలో భాగంగా రూ. 1.40 కోట్లతో ఎంట్రన్స్ టవర్లు, హైమాస్ట్ లైట్ల ఏర్పాటుకు చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ప్రత్యేక చొరవతో రూ. 4.20 కోట్లతో సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులకు నిధులు సమకూరాయని వివరించారు. బతుకమ్మ, దసరా ఉత్సవాల నిర్వహణపై వస్తున్న విమర్శలకు చైర్మన్ స్పందించారు. పట్టణ మహిళలు, ప్రజలు పండుగలను ఆనందోత్సాహాలతో జరుపుకునేలా మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశామన్నారు. గత పాలకవర్గ హయాంలో బతుకమ్మ వేడుకలకు రూ. 12 లక్షల నుంచి రూ. 32 లక్షలు, ఆ తర్వాత రూ. 34 లక్షల వరకు ఖర్చు చేసిన విషయాన్ని ప్రస్తావించారు. ఈసారి కూడా ప్రజలకు అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు వ్యయం చేసినట్లు తెలిపారు. ఉత్సవాలు విజయవంతంగా నిర్వహించడాన్ని కొందరు జీర్ణించుకోలేక విమర్శలు చేస్తున్నారని వ్యాఖ్యానించారు. వినాయక చవితి, బతుకమ్మ, దసరా వేడుకలను ప్రజల భాగస్వామ్యంతో ఘనంగా నిర్వహించామని పేర్కొన్నారు. విమర్శలకు అభివృద్ధితోనే సమాధానం..

తమ పాలకవర్గానికి అనుభవం లేదంటూ చేస్తున్న విమర్శలకు అభివృద్ధి పనుల ద్వారానే సమాధానం చెబుతామని పుల్కం రాజు అన్నారు. గత ఐదేళ్ల పాలనలో జరిగినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న అవినీతి, అక్రమాలను ఆధారాలతో సహా ప్రజల ముందుంచుతామని పేర్కొన్నారు. ప్రతి నెలా సర్వసభ్య సమావేశాలు నిర్వహిస్తూ కౌన్సిలర్లు, అధికారులు, ఎమ్మెల్యే సమన్వయంతో పట్టణ అభివృద్ధికి కృషి చేస్తామని స్పష్టం చేశారు. పారదర్శక పాలన అందించడమే తమ లక్ష్యమన్నారు.ఈ సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నరాల శేఖర్, కమిషనర్ లోకేష్, మేనేజర్ సంపత్ రెడ్డి, టీపీవో అభినవ్, టీఓ అన్వేష్, శానిటరీ ఇన్స్పెక్టర్ సుకుమార్, ఆర్ఐ రాజేందర్, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



ఆసుపత్రుల నిర్మాణాల్లో జాప్యం వద్దు

- వైద్యశాలల్లో మౌలిక వసతులు, వైద్య పరికరాల ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి. పనులు వేగవంతం చేయాలి - జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్

రాజన్న సిరిసిల్ల, అక్టోబర్ 30 (ప్రజా కలం ప్రతినిధి) : జిల్లాలో ప్రభుత్వ ఆసుపత్రుల నిర్మాణ పనుల్లో జాప్యానికి తావులేకుండా నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధికారులను ఆదేశించారు. నిర్మాణాలు పూర్తయిన భవనాలు ప్రజలకు అందుబాటులోకి రావాలని, తుది దశలో ఉన్న పనులను యుద్ధప్రాతిపదికన ముగించి ప్రారంభానికి సిద్ధం చేయాలని స్పష్టం చేశారు.15వ ఆర్థిక సంఘం నిధులతో చేపట్టిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఆరోగ్య ఉపకేంద్రాల నిర్మాణాలు, జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి (జీజీహెచ్), వేములవాడ ఏరియా ఆసుపత్రి, సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో (సీహెచ్సీ) మౌలిక వసతుల కల్పనపై శుక్రవారం ఐడీఓసీలో సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా అధికారులు జిల్లాలో చేపట్టిన నిర్మాణ పనుల పురోగతిని కలెక్టర్కు వివరించారు. పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖ ఆధ్వర్యంలో 15వ ఆర్థిక సంఘం నిధులతో 16 సబ్సెంటర్ల నిర్మాణాలు చేపట్టగా, ఇప్పటివరకు ఏడు పూర్తయ్యాయని తెలిపారు. మిగిలిన పనులు వివిధ దశల్లో కొనసాగుతున్నాయని, రుద్రంగి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవన నిర్మాణం తుది దశకు చేరుకుందని వివరించారు. టీజీఎంఐడీసీ ఆధ్వర్యంలో ఇల్లంతకుంటలో సామాజిక ఆరోగ్య కేంద్రం నిర్మాణ పనులు కొనసాగుతున్నట్లు వెల్లడించారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ.. నిర్మాణ పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ నాణ్యతా ప్రమాణాలతో పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఇప్పటికే తుది దశకు చేరుకున్న భవనాల్లో మిగిలిన పనులను వేగంగా పూర్తి చేసి, అవసరమైన అన్ని సదుపాయాలు కల్పించాలన్నారు. భవనాలు సిద్ధమైన తర్వాత ప్రారంభోత్సవాలకు ఎలాంటి ఆటంకాలు లేకుండా ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు.జిల్లా కేంద్రంలోని జీజీహెచ్తో పాటు వేములవాడ ఏరియా ఆసుపత్రి, ఎల్లారెడ్డిపేట, గంభీరావుపేట సీహెచ్సీల్లో అవసరమైన వైద్య యంత్ర పరికరాలు, ఇతర సామగ్రి సమ కూర్చడంతోపాటు పెండింగ్లో ఉన్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఇల్లంతకుంట సీహెచ్సీ నిర్మాణాన్ని నిర్ణీత గడువులోగా పూర్తిచేసి ప్రజలకు వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావాలని స్పష్టం చేశారు. ఈసమీక్షలో జిల్లా వైద్యాధికారి ఏంజెలా ఆల్ఫ్రెడ్, పంచాయతీరాజ్ ఈఈ సుదర్శన్ రెడ్డి, వైద్య కళాశాల ప్రిన్సిపాల్ రాజేశ్వరి, వేములవాడ ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ సుభాషిణి, వైద్యులు సంతోష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- నూకలమర్రిలో ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం. - రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది. - ఎల్నినోపై ప్రభావంపై అప్రమత్తం.. ప్రత్యామ్నాయ పంటల సాగుకు ప్రోత్సాహం



వేములవాడ, అక్టోబర్ 30 (ప్రజా కలం ప్రతినిధి) :రైతులకు నాణ్యమైన విద్యుత్, సాగునీరు అందించడంతో పాటు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు.

వేములవాడ ప్రాంతం నూకలమర్రి గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు దళారులను ఆశ్రయించకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు. ఏ గ్రేడ్ ధాన్యానికి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర చెల్లిస్తామని, ధాన్యంలో తేమ శాతం 17కుస చేరిన వెంటనే కొనుగోళ్లు చేపట్టేలా ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. మహిళా సంఘాలు ఐకేపీ కొనుగోలు కేంద్రాలను సమర్థంగా నిర్వహిస్తూ రైతులకు సేవలందిస్తున్నాయని అభినందించారు.రైతు సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, సన్న వడ్లు పండించే రైతులకు క్వింటాల్కు రూ. 500 బోనస్ అందిస్తున్నామని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా 25.25 లక్షల రైతు కుటుంబాలకు రూ. 20,650 కోట్ల పంట రుణమాఫీ చేసినట్లు వివరించారు.

విద్యుత్, సాగునీటికి భరోసాలి

వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్ అందించేందుకు నియోజకవర్గంలో 17 ప్రాంతాల్లో 33/11 కేవీ సబ్స్టేషన్లు మంజూరు చేయించామని ఆది శ్రీనివాస్ తెలిపారు. నూకలమర్రికి కూడా సబ్స్టేషన్ మంజూరైందని, కొత్తగా 220 కేవీ, 132/33 కేవీ సబ్స్టేషన్లకు అనుమతులు లభించాయని పేర్కొన్నారు. సాగునీటి ప్రాజెక్టులు, కాలువల నిర్మాణ పనులను వేగవంతం చేస్తున్నామని, కూడేలు మక్క కాలువల భూసేకరణకు సుమారు రూ. 80 కోట్లు మంజూరైనట్లు తెలిపారు.

ఎల్నినోపై ముందస్తు చర్యలు..

ఈ ఏడాది ఎల్నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశాలున్న నేపథ్యంలో ప్రభుత్వం ముందస్తు ప్రణాళికలు రూపొందిస్తోందని చెప్పారు. రైతు వేదికల ద్వారా వ్యవసాయ శాస్త్రవేత్తలతో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, తక్కువ నీటితో సాగయ్యే ఆరుతడి పంటల వైపు రైతులు దృష్టి సారించాలని సూచించారు. నీటి వృథాను అరికట్టడంతో పాటు పంటకుంటలు, నీటి సంరక్షణ కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టనున్నట్లు వెల్లడించారు. అటవీ ప్రాంతాల్లోని సహజ నీటి వనరులను సంరక్షించడం ద్వారా భూగర్భ జలాల పెంపునకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. తాగు, సాగునీటి సమస్యలు తలెత్తకుండా ప్రభుత్వం ముందస్తు కార్యాచరణతో ముందుకు సాగుతోందని, రైతులకు అన్ని విధాలుగా అండగా ఉంటామని ఆది శ్రీనివాస్ స్పష్టం చేశారు.



సఫిల్గూడ, బండ చెరువు అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

పెండింగ్ సమస్యలను తక్షణమే పరిష్కరించి నిర్ణీత గడువులో పనులు పూర్తి చేయాలి: ఎంఎంసీ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి

మల్కాజిగిరి, అక్టోబరు 29 (ప్రజా కలం ప్రతినిధి): మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని సఫిల్గూడ చెరువు, బండ చెరువు అభివృద్ధి పనులను వేగవంతం చేసి, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఎంఎంసీ కమిషనర్ టి. వినయ్ కృష్ణారెడ్డి అధికారులను ఆదేశించారు.



రెండు చెరువుల వద్ద కొనసాగుతున్న అభివృద్ధి పనుల పురోగతిపై గురువారం ఉన్నతాధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పనుల ప్రస్తుత పరిస్థితి, ఇంకా పరిష్కారం కావాల్సిన సమస్యలు, పనుల జాప్యానికి గల కారణాలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అభివృద్ధి పనులకు ఆటంకంగా ఉన్న సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ పెండింగ్ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని స్పష్టం చేశారు. ఒక శాఖకు సంబంధించిన సమస్య కారణంగా మరో శాఖ పనులు నిలిచిపోకుండా పరస్పర సహకారంతో ముందుకు సాగాలని సూచించారు. పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ క్షేత్రస్థాయిలో ఎదురయ్యే ఇబ్బందులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశించారు. చెరువుల అభివృద్ధి పనుల్లో ఎలాంటి జాప్యం జరగకుండా కార్యాచరణ రూపొందించి, నిర్దేశించిన గడువులోగా పనులన్నీ పూర్తి చేయాలని కమిషనర్ స్పష్టం చేశారు. ఈ సమీక్ష సమావేశంలో చీఫ్ ఇంజనీర్ శ్రీనివాస్తో పాటు లేక్స్ విభాగం అధికారులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై పోలీసుల అవగాహన కార్యక్రమం

మైనర్లు వాహనాలు నడపకుండా తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి: సీఐ విజయ్ కుమార్

మల్కాజిగిరి, అక్టోబరు 30 (ప్రజా కలం ప్రతినిధి): రహదారి భద్రతపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండటంతో పాటు ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని మల్కాజిగిరి పోలీసులు సూచించారు. శుక్రవారం సాయంత్రం మల్కాజిగిరి చౌరస్తాలో పోలీసుల ఆధ్వర్యంలో ట్రాఫిక్ నిబంధనలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ విజయ్ కుమార్ మాట్లాడుతూ వాహనదారులు ట్రాఫిక్ నియమాలను పాటిస్తూ తమతో పాటు ఇతరుల ప్రాణాల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ముఖ్యంగా మైనర్లు వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమని, తల్లిదండ్రులు తమ పిల్లలు వాహనాలు నడపకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు. మైనర్లు వాహనాలు నడుపుతున్న విషయాన్ని గుర్తించినప్పుడు తల్లిదండ్రులు వారికి రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించి బాధ్యతగా వ్యవహరించేలా చూడాలన్నారు. పోలీస్ కమిషనర్ బి. సుమతి, డీసీపీ, ఏసీపీ అధికారుల ఆదేశాల మేరకు ప్రజల్లో ట్రాఫిక్ నిబంధనలపై చైతన్యం కల్పించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎస్సై శ్రీనివాస్, ట్రాఫిక్ ఎస్సై రవికుమార్ రెడ్డి, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



యాదాద్రి భువనగిరి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారికి షోకాజు నోటీసులు జారీ చేసిన జిల్లా కలెక్టర్

నివేదికల జాప్యంపై డిఎంహెచ్ ఓ తోపాటు ఇతర వైద్యాధికారులకు షోకాజ్ నోటీసులు

యాదాద్రి భువనగిరి జిల్లా, అక్టోబర్ 30 (ప్రజా కలం)

టి-హబ్ (T-Hub) వైద్య నివేదికల జాప్యంపై జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి డిఎంహెచ్ఓ తో సహా పలువురు అధికారులకు జిల్లా కలెక్టర్ శుక్రవారం రోజున షోకాజ్ నోటీసులు జారీ చేశారు. జిల్లాలోని టి-హబ్ (T-Hub) కార్యక్రమం కింద నిర్వహించే ఉచిత వైద్య పరీక్షల శాంపిళ్ల సేకరణ, అలాగే వాటి రిపోర్టులను సకాలంలో అందించడంలో నిర్లక్ష్యం వహించినందుకు గాను జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి ఎం .మనోహర్, ఆసుపత్రి సూపరింటెండెంట్ (GGH) డాక్టర్ లక్ష్మణ్ రావు, ప్రోగ్రాం ఆఫీసర్ వి.వంశీ కృష్ణ కు షో-కాజ్ నోటీసులు జారీ చేశారు.





సైబర్ నేరాలపట్ల ప్రజలు జాగృతులై ఉండాలి

నిజామాబాద్ జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో సైబర్ నేరాలతో జాగ్రత్త ర్యాలీ

ప్రజల అప్రమత్తతే ప్రమాదాలను దూరం చేస్తుంది

ఫోన్ ప్లాష్ లైట్స్ తో ఫ్లాష్ వాక్ నిర్వహించిన అదనపు పోలీస్ కమిషనర్ శుభం ప్రకాశ్

నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) అక్టోబరు 30:

శుక్రవారం నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి సాయి చైతన్య, ఐపీఎస్,ఆదేశాల మేరకు ఫోన్ ఫ్లాష్ లైట్స్ తో ఫ్లాష్ వాక్ కార్యక్రమం నిర్వహించిన అదనపు పోలీస్ కమిషనర్ శుభం ప్రకాశ్ నిర్వహించడం జరిగింది. ప్రతి పౌరుడు సెల్ ఫోన్ వినియోగిస్తున్న డిజిటల్ కాలంలో తెలిసి తెలియకుండా సైబర్ నేరగాళ్ళ వలలో చిక్కుకుని ఆర్థికంగా నష్ట పోతున్నాడని నిజామాబాద్ జిల్లా అదనపు పోలీస్ కమిషనర్ శుభం ప్రకాశ్ అన్నారు. సెల్ ఫోన్ లో డబ్బుల ఆశచూపి కొన్ని డబ్బులు మనకు ఆన్లైన్లో పంపించి మనతో ఎక్కువ డబ్బులు కాజేసే కేటుగాళ్లు సైబర్ నేరగాళ్ళని అన్నారు. డిజిటల్ అరెస్ట్ అంటు బెదిరించి డబ్బులు మాయం చేస్తారని డిజిటల్ అరెస్ట్ లే లేవని ఆయన తెలిపారు. ప్రజలు తమ డబ్బులు సెల్ ఫోన్ ద్వారా పంపించేటప్పుడు ఒకటికి పదిసార్లు వెరిపై చేసుకుని పంపించుకోవాలని కోరారు. ప్రజల కష్టార్జీతమైన డబ్బులు సైబర్ నేరగాళ్ళపరం కాకుండా ప్రజలే చైతన్యవంతులు కావాలని ఆయన ఆశిస్తు అందుకు పోలీసు శాఖ మద్దత్తు ఉంటుందని అన్నారు. సైబర్ నేరగాళ్ళ పరమైన డబ్బులు తిరిగి తెప్పించడం కష్టంతో కూడిన పని అని అయిన రికవరీ చాలా చేస్తున్నామని ఆయన తెలిపారు. ర్యాలీతో ఒక చైతన్యం, ఒక ఆలోచన, ప్రచారం ప్రజలలోకి వెళుతుందని భావించి ర్యాలీ నిర్వహించామని ఆయన తెలిపారు. నిజామాబాద్ జిల్లా కోర్టు నుండి ప్రారంభం అయిన ర్యాలీ పోలీస్ పెరేడ్ గ్రౌండ్ వరకు కొనసాగింది అనంతరం శుభం ప్రకాష్ పోలీసులు ,పౌరులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ ర్యాలీలో నిజామాబాద్ ఎ.సి.పి ప్రకాష్ యాదవ్ , పోలీసు అధికారులు శ్రీధర్ రెడ్డి , ప్రసాద్ , సత్యనారాయణ , సందీప్, హరిబాబు ,యాదగిరి గౌడ్, సునీల్ కుమార్, న్యాయవాదులు,స్పెషల్ పార్టీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బ్రేక్‌ఫాస్ట్ ప్రేయర్ మీటింగ్‌లో పాల్గొన్న కొలన్ హన్మంత్ రెడ్డి

ప్రజాకలం/ కుత్బుల్లాపూర్ (ప్రతినిధి)

కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో నిర్వహించిన బ్రేక్‌ఫాస్ట్ ప్రేయర్ మీటింగ్ కార్యక్రమానికి కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరైయ్యారు. ఈసందర్భంగా పాస్టర్లు, క్రైస్తవ మత పెద్దలు నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో ఆయన పాల్గొన్నారు. సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం, ఐక్యత ప్రజలందరి సంక్షేమం కోసం ప్రార్థనలు నిర్వహించారు.



అనంతరం ఆయన మాట్లాడుతూ... అర్హులైన ప్రతి ఒక్కరూ ఎమ్మెల్సీ ఓటు నమోదు చేసుకోవాలని, ఓటు నమోదు ప్రక్రియపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాలని కోరారు. ముఖ్యంగా అర్హులైన పట్టభద్రులు తమ ఓటు హక్కును వినియోగించుకునేలా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వాములు కావాలని సూచించారు. ఈకార్యక్రమంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ క్రిస్టియన్ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ప్రభుత్వ సమన్వయకర్త కల్లోజి రవికుమార్, సీఎం కుత్బుల్లాపూర్ నియోజకవర్గ రివైవల్ పాస్టర్స్ ప్రేయర్ ఫెలోషిప్ చైర్మన్, అధ్యక్షులు రెవరెండ్ డాక్టర్ గోడి శేఖర్, డివిజన్ అధ్యక్షులు సిద్దనోళ్ల సంజీవరెడ్డి, పండరిరావు, శ్రీనివాస్, కలీం, అజయ్, జమీర్, రమేష్, కాఫర్, పాషా, కార్యదర్శి బిషప్ ఎం.ఎస్.సామ్యూల్ పీటర్, కోశాధికారి రెవరెండ్ దయానిధి, ఉపాధ్యక్షులు ఆనంద్ బాబు, సంయుక్త కార్యదర్శి సి.హెచ్. బెల్తాజర్ రాజు , న్యాయ సలహాదారు నియోజకవర్గ ఆర్గనైజింగ్ సెక్రటరీ పాస్టర్ జి.రాజశేఖర్ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ రివైవల్ పాస్టర్స్ ప్రేయర్ ఫెలోషిప్ ప్రతినిధులు, పాస్టర్లు, క్రైస్తవ మత పెద్దలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు. ఈసందర్భంగా కొలన్ హన్మంత్ రెడ్డి, నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు.

పట్టభద్రులు ఓటరు నమోదు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

బీబీనగర్‌లో ప్రత్యేక శిబిరాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి

బీబీనగర్, అక్టోబర్ 30 (ప్రజాకలం): వరంగల్--ఖమ్మం--నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదు ప్రక్రియలో భాగంగా బీబీనగర్ పట్టణ కేంద్రంలోని పోచంపల్లి రోడ్డు లోని బెంగుళూరు బేకరి వద్ద పట్టణ కాంగ్రెస్



పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాన్ని శుక్రవారం భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకమైందని పేర్కొన్నారు. అర్హులైన పట్టభద్రులందరూ ఓటు విలువను గుర్తించి, ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు జాబితాలో తమ పేర్లను తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. పట్టభద్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వాములు కావాలని కోరారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు పంజాల రామాంజనేయులు గౌడ్, గోలి పింగల్ రెడ్డి, పిఎసిఎస్ చైర్మన్ పొట్టోళ్ళ శ్యామ్ గౌడ్,మండల అధ్యక్షుడు సురకంటి సత్తి రెడ్డి,సర్పంచ్ పంజాల శ్రీనివాస్ గౌడ్, కాసుల ఆంజనేయులు గౌడ్, పట్టణ అధ్యక్షులు టంటం రఘు, బెండ ప్రవీణ్,ఉప్పలంచి శ్రీకాంత్,నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

రైళ్లు రద్దు చేస్తే బస్సుల్లో వస్తాం

హైదరాబాద్ : నవంబర్ 1న ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో 'ఓట్ బచావో, దేశ్ బచావో' పేరుతో ఇండియా కూటమి తలపెట్టిన మెగా నిరసన ర్యాలీని అడ్డుకునేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్రలు చేస్తోందని టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గత రెండు, మూడు నెలలుగా ఇండియా కూటమి ఆధ్వర్యంలో పలు నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.నవంబర్ 1న ఢిల్లీలో జరిగే ఇండియా కూటమి ర్యాలీ కోసం ప్రత్యేక రైళ్లు కేటాయించాలని కోరుతూ సికింద్రాబాద్ దక్షిణ మధ్య రైల్వే కార్యాలయం వద్ద టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు ధర్నా చేశారు. ఈ క్రమంలో పోలీసులు నేతలతో పాటు కార్యకర్తలను అదుపులోకి తీసుకున్నారు.ఈ ర్యాలీ కోసం తెలంగాణ నుంచి కాంగ్రెస్ శ్రేణులను తరలించేందుకు ప్రత్యేక రైళ్లు కేటాయించాలని ఎంపీలు అనిల్ యాదవ్, మల్లు రవి రైల్వే శాఖ జీఎంకు దరఖాస్తు చేసుకున్నారని పేర్కొన్నారు. అయితే, ఐదారు రోజుల పాటు కాలయాపన చేసి, చివరి నిమిషంలో ఉద్దేశపూర్వకంగా రైళ్లను నిరాకరించారని మండిపడ్డారు. రైల్వే అధికారులను కలిసేందుకు వెళ్లిన ఎంపీలతో పోలీసులు దురుసుగా ప్రవర్తించారని ఆరోపించారు. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ఆదేశాల మేరకే దక్షిణాది నేతలు ఢిల్లీ ర్యాలీకి వెళ్లకుండా అడ్డుకునే కుట్ర జరుగుతోందని ధ్వజమెత్తారు.కేంద్రం ఎన్ని అడ్డంకులు సృష్టించినా ఢిల్లీలో నిరసన గళం వినిపించి తీరుతామని స్పష్టం చేశారు. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలతో ఢిల్లీ ర్యాలీని విజయవంతం చేసేందుకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ప్రత్యేక రైళ్లు ఇవ్వకపోవడంతో ప్రత్యామ్నాయంగా బస్సులను ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు.ఢిల్లీకి బస్సు ప్రయాణం 30 గంటలకు పైగా ఉంటుందని, అందుకే యువకులు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. బస్సులో వెళ్లే వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. ప్రయాణ ఏర్పాట్లను పర్యవేక్షించేందుకు ఎంపీ మల్లు రవి, మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకాటి శ్రీహరి, ఎంపీలు బలరాం నాయక్, చామల కిరణ్ కుమార్ రెడ్డిలతో ఒక ప్రత్యేక కమిటీని కూడా వేసినట్లు తెలిపారు.

ఈ విషయమై డీసీసీ అధ్యక్షులు, ఫ్రంటల్ చైర్మన్లతో నిర్వహించిన జూమ్ మీటింగ్‌లో మంత్రులు, సీనియర్ నేతలు పాల్గొని ప్రణాళికలు రూపొందించినట్లు మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు.

కేంద్రం, ఈసీ నిద్రపోతున్నట్లు నటిస్తున్నాయి:

సచివాలయంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వంపై ఇండీ కూటమి ర్యాలీపై కుట్రలు చేస్తోందంటూ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓట్ల తొలగింపుపై రాహుల్ గాంధీ, ఖర్గే రెండేళ్లుగా పోరాడుతున్నారని, ఈ అంశంలో కేంద్రం, ఈసీ నిద్రపోతున్నట్లు నటిస్తున్నాయని ఆరోపించారు.

నవంబర్ 1న ఇండియా కూటమి ఆధ్వర్యంలో జరిగే ఆందోళనల కోసం ప్రత్యేక రైళ్లకు అనుమతి ఇవ్వకుండా బీజేపీ రాజకీయం చేస్తోందని విమర్శించారు. రైల్వే వ్యవస్థ కేంద్రానికో, బీజేపీకో సొత్తు కాదన్నారు. బిఆర్ఎస్ నేతలు హరీష్ రావు, కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను తప్పుపట్టిన ఆయన, ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి అమిత్ షాల ప్రజావ్యతిరేక విధానాలను త్వరలోనే ఒక్కొక్కటిగా బయటపెడతామని స్పష్టం చేశారు.

"దర్గా షరీఫ్" లో ఘనంగా ఉర్స్ ఉత్సవాలు

అతిథిగా హాజరైన ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్

ప్రజాకలం/ కుత్బుల్లాపూర్ (ప్రతినిధి) 128 - చింతల్ డివిజన్ దర్గా షరీఫ్ లో ఉర్స్ - ఈ - షరీఫ్ ఆఫ్ హజ్రత్ జిందా షాహ్ మదార్ (ఆర్ ఏ) వేడుకల్లో భాగంగా శుక్రవారం నిర్వహించిన చిరాగ్ ఉ కవ్వాలి కార్యక్రమానికి బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.....గంగా జమునా తహజీబ్ కు నిదర్శనం హైదరాబాద్ నగరమని, మతసామరస్యం, ఐకమత్యంతో ప్రజలంతా సంతోషంగా ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు.

ఈకార్యక్రమంలో కార్పొరేటర్ విజయ్ శేఖర్ గౌడ్, డివిజన్ అధ్యక్షులు ఎర్వ శంకరయ్య, మసీద్ కమిటీ ప్రెసిడెంట్ ఎండీ.అబ్దుల్ ఖాదర్, సలహాదారులు ఎండీ.సిరాజ్, ఎండి.రషీద్, ఎండీ. రియాజ్, సభ్యులు బాబుమియా, గౌస్ భాయ్, వాజిద్, షేక్ అలీ, సీనియర్ నాయకులు ఫెరోజ్, బస్వారాజ్, ఆకుల ప్రభాకర్ గుప్తా, జల్దా లక్ష్మీనాథ్, మంజూర్ అలీ, సతీష్ గట్టోజి, మెహరున్నిసా బేగం, జునైద్, శౌకత్ అలీ, రమ్మీ గౌడ్, అల్లావుద్దీన్, ఇర్ఫాన్, జునైద్, ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీ లక్ష్మీ గణపతి దేవస్థానం..

శ్రీ సంకటహర చతుర్థి.. పంచామృతాలతో అభిషేకా పూజలు

ప్రజాకలం/ కుత్బుల్లాపూర్ (ప్రతినిధి) నిజాంపేట్ జర్నలిస్ట్ కాలనీలోని శ్రీ లక్ష్మీ గణపతి దేవస్థానంలో శ్రీ సంకటహర చతుర్థి మహా గణపతికి పంచామృతలతో అభిషేకాలు.. పుష్పాలు, గరకే, హారతులతో దేవస్థానం ఉత్సవ కమిటీ సభ్యుల తో కలిసి ఆలయ పూజారి రాకేష్ పంతులు ప్రత్యేక పూజలు చేశారు. మహాగణపతి స్వామి వారి ఆశీర్వాదాలు కాలనీలో ప్రజలందరికీ ఉండాలని, ఆయురారోగ్యాలు అష్టైశ్వర్యాలతో ఉండాలని స్వామివారి ఆశీర్వాదాలు అందజేసి, భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. శ్రీ లక్ష్మీ గణపతి దేవస్థానం కమిటీ సభ్యులు గోవిందరావు, ముక్క దేవేందర్ గుప్తా, దామెర జగదీశ్వర్ గుప్తా, మల్లికార్జున్, బంటి, మహిళలు కమిటీ సభ్యులు, కాలనీలో ప్రజలు మహిళలు తదితరులు పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు,

కర్మన్‌ఘాట్‌లో రైస్ డీలర్లపై అధికారుల మెరుపు దాడులు!

26 కిలోల ప్యాకెట్‌లో 24-25 కిలోలే బియ్యం..

జీఎస్టీ ఎగవేత ఆరోపణలపై తనిఖీలు

ఎల్బీనగర్ : హైదరాబాద్‌లోని కర్మన్‌ఘాట్ ప్రాంతంలో రిటైల్, హోల్‌సేల్ బియ్యం డీలర్ల దుకాణాలపై సివిల్ సప్లైస్, విజిలెన్స్, లీగల్ మెట్రాలజీ అధికారులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర ఆదేశాల మేరకు విజిలెన్స్ ఎస్పీ రామ్‌కుమార్, సిద్ధేశ్వర్‌రావు, ఎల్బీనగర్ ఏసీపీ రవీందర్‌రెడ్డి నేతృత్వంలోని పోలీసు బృందాల సహకారంతో సుమారు 10 నుంచి 12 ప్రత్యేక బృందాలు ఈ తనిఖీల్లో పాల్గొన్నాయి.

ప్యాకెట్‌పై 26 కిలోలు.. తూకంలో తక్కువ!

బియ్యం సంచులపై 26 కిలోలుగా ముద్రించి ఉన్నప్పటికీ, తూకం వేయగా 24 నుంచి 25 కిలోల వరకే ఉన్నట్లు అధికారులు గుర్తించారు. మరికొన్ని ప్యాకెట్లలో 25 కిలోల కంటే 20 నుంచి 30 గ్రాముల వరకు తక్కువ బరువు ఉన్నట్లు తనిఖీల్లో వెల్లడైంది. దీంతో వినియోగదారులు చెల్లించిన ధరకు తగిన పరిమాణంలో బియ్యం అందుతున్నా యా లేదా అనే అంశంపై అధికారులు పరిశీలన చేపట్టారు.

జీఎస్టీ ఎగవేతపై ఆరా.. ప్యాకేజ్డ్ బియ్యం సంచులపై బరువు వివరాలను ముద్రించడం, జీఎస్టీ నిబంధనల అమలు, పన్ను చెల్లింపులకు సంబంధించిన అంశాలపై అధికారులు విచారణ చేపట్టారు. ప్యాకెట్లపై నెట్ క్వాంటిటీ వివరాలు, కంపెనీ పేరు తదితర తప్పనిసరి వివరాలు సక్రమంగా ఉన్నాయా లేదా అనే అంశాలనూ పరిశీలించారు.

బిల్లులు, వే-బిల్లులపైనా తనిఖీలు

బియ్యం సరఫరా చేస్తున్న లారీలకు సంబంధించిన బిల్లులు, జీఎస్టీ పత్రాలు, వే-బిల్లులను అధికారులు పరిశీలిస్తున్నారు. తూకంలో తేడాలు, ప్యాకేజింగ్ నిబంధనల ఉల్లంఘనలు గుర్తించిన చోట సంబంధిత శాఖల ద్వారా చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.

కమిషనర్ ఆదేశాల మేరకు స్థానిక పోలీసుల సహకారంతో రిటైల్, హోల్‌సేల్ బియ్యం దుకాణాల్లో సంయుక్త తనిఖీలు చేపట్టినట్లు విజిలెన్స్ ఎస్పీ రామ్‌కుమార్ తెలిపారు. ఈ ప్రాంతంలో ఈ ఏడాది సుమారు 30 నుంచి 35 వరకు తనిఖీలు నిర్వహించినట్లు వెల్లడించారు. నిత్యావసర వస్తువుల సరఫరాలో అక్రమాలకు తావులేకుండా చూడటం, కృత్రిమ కొరత సృష్టించి ధరలు పెంచే పరిస్థితులను నివారించడం ఈ తనిఖీల ప్రధాన ఉద్దేశమని స్పష్టం చేశారు. బియ్యం కొనుగోలు చేసే వినియోగదారులు ప్యాకెట్లపై పేర్కొన్న బరువు, వాస్తవ తూకాన్ని గమనించాలని అధికారులు సూచించారు. తనిఖీల్లో గుర్తించిన ఉల్లంఘనలపై విచారణ అనంతరం నిబంధనల ప్రకారం చర్యలు తీసుకునే అవకాశం ఉంది

బియ్యం ధరల నియంత్రణకు సహకరించాలి

కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం

అనవసర అపోహలు, వదంతులను వ్యాప్తి చేయవద్దు : కలెక్టర్ ఇలా త్రిపాఠి

నిజామాబాద్ : బియ్యం ధరలను నియంత్రణలో ఉంచేందుకు రైస్ మిల్లర్లు, బియ్యం వ్యాపారులు, ట్రేడర్లు జిల్లా యంత్రాంగానికి సహకరించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. బియ్యం నిల్వలు, సరఫరా, విక్రయాల విషయంలో పూర్తి పారదర్శకంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. కృత్రిమ కొరత సృష్టించి బియ్యం ధరలను పెంచేందుకు ప్రయత్నించినా, అక్రమ నిల్వలకు పాల్పడినా సంబంధిత వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిబంధనల అతిక్రమణకు పాల్పడే ట్రేడర్ల లైసెన్సులు రద్దు చేసేందుకు వెనుకాడబోమని స్పష్టం చేశారు.

సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో రైస్ మిల్లర్లు, ట్రేడర్లతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. స్వేచ్ఛ విపణిలో బియ్యం ధరలు, వాటి క్రయ విక్రయాలు, సన్న బియ్యం సేకరణ స్టాక్ వివరాలు తదితర అంశాలపై వారితో చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజలకు నిత్యావసరమైన బియ్యం సరసమైన ధరలకు అందుబాటులో ఉండేలా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని అన్నారు. మార్కెట్‌లో బియ్యం లభ్యత, ధరల పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తూ బియ్యం క్రయ విక్రయాలలో ఎలాంటి అంతరాయాలు ఏర్పడకుండా చూడాలని అధికారులను ఆదేశించారు.

బియ్యం నిల్వలు అందుబాటులో ఉన్నప్పటికీ కొరత ఉన్నట్లు చూపించడం, ఉద్దేశపూర్వకంగా సరఫరాను తగ్గించడం, ధరలను కృత్రిమంగా పెంచేందుకు ప్రయత్నించడం వంటి చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని కలెక్టర్ స్పష్టం చేశారు. వ్యాపారులు నిబంధనలకు అనుగుణంగా తమ వ్యాపార కార్యకలాపాలను నిర్వహించాలని, నిల్వలు, కొనుగోళ్లు, విక్రయాల విషయంలో నిబంధనలు తుచ తప్పక పాటించాలని సూచించారు. బియ్యం ధరలు, నిల్వలు, సరఫరాకు సంబంధించి ప్రజల్లో అనవసర ఆందోళన కలిగించే రీతిలో అపోహలు, వదంతులను వ్యాప్తి చేయవద్దని కలెక్టర్ కోరారు. వాస్తవ పరిస్థితులను నిర్ధారించుకోకుండా తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేయడం వల్ల ప్రజల్లో గందరగోళం ఏర్పడటంతో పాటు మార్కెట్‌పై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందన్నారు. ప్రజలకు వాస్తవ సమాచారాన్ని అందించేందుకు వ్యాపారులు సహకరించాలని అన్నారు. జిల్లాలో బియ్యం ధరలు, నిల్వలు, సరఫరా పరిస్థితులను సంబంధిత శాఖల అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ సూచించారు. మార్కెట్‌లో ధరల స్థిరత్వాన్ని కాపాడేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని, నిబంధనల ఉల్లంఘనలపై ఫిర్యాదులు అందిన వెంటనే తక్షణం స్పందించి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలు కూడా అనవసర అపోహలకు గురై అవసరానికి మించి బియ్యం నిల్వలను కొనుగోలు చేయవద్దని కలెక్టర్ హితవు పలికారు. బియ్యం ధరల స్థిరత్వానికి జిల్లా యంత్రాంగం తరపున అన్ని చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ప్రజల అవసరాలకు సరిపడా బియ్యం నిల్వలు అందుబాటులో ఉన్నాయని భరోసా కల్పించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ రాజాగౌడ్, సంబంధిత శాఖల అధికారులు, రైస్ మిల్లర్లు, ట్రేడర్లు పాల్గొన్నారు.



అంబీర్ చెరువులో పెరుగుతున్న గుర్రపు డెక్క-- పట్టించుకోని అధికారులు!

ప్రజాకలం/ కుత్బుల్లాపూర్ (ప్రతినిధి)

ప్రగతినగర్‌లోని అంబీర్ చెరువులో గుర్రపు డెక్క విపరీతంగా పెరిగిపోవడంతో పరిసర ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గుర్రపు డెక్క కారణంగా దోమల వ్యాప్తి చెంది ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని సంబంధిత అధికారులు వెంటనే స్పందించాలి. అంబీర్ చెరువులో పేరుకుపోయిన గుర్రపు డెక్కను పూర్తిస్థాయిలో తొలగించి, చెరువును శుభ్రపరిచి, దోమల నివారణకు తగిన చర్యలు చేపట్టాలి. ఇప్పటికైనా అధికారులు నిర్లక్ష్యాన్ని వీడి ప్రజల సమస్యను పరిష్కరించాలని ప్రగతినగర్ టీడీపీ సీనియర్ నాయకుడు నగేష్ ముదిరాజ్ కోరారు.

